శనివారం 8-4-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 16

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



సన్'రైజ్' కాలేదు!

ఐపీఎల్ టోర్నీలో వరుసగా రెండో మ్యాచ్ లోనూ ఓడిన హైదరాబాద్ జట్టు -15లో



నియామకాలకు 6 నెలలు బ్రేక్

ఆర్థిక అనిశ్చితితో నియామకాలకు విరామ మిచ్చే యోచనలో ఐటీ కంపెనీలు -15లో



కరోనాపై అప్రమత్తంగా ఉందాం

కోవిడ్ వ్యాప్తి పెరగడంతో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి పరిస్థితిని సమీక్షించారు. శుక్రవారం కొత్తగా 6,050 కేసులు నమోదయ్యాయి.

వివరాలు 6లో ▸



'టైమ్ -100'లో బాలీవుడ్ బాద్‌షా

టైమ్ మ్యాగజీన్ 2023కి నిర్వహించిన ప్రభావశీల వ్యక్తుల జాబితా 100లో షారుఖ్ అత్యధిక ఓట్లతో అగ్రస్థానంలో నిలిచారు.

వివరాలు 6లో ▸



ఇజ్రాయెల్ వైమానిక దాడులు

దక్షిణ లెబనాన్‌తోపాటు గాజాస్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడింది. హమాస్ ఉగ్ర వాద శిబిరాలపై దాడులు నిర్వహించింది.

వివరాలు 6లో ▸



శత్రు హృదయాల్లో స్నేహగీతం

బద్ధవిరోధులైన సౌదీ, ఇరాన్ చేతులు కలుపుతున్నాయి. ఈ రెండు దేశాల మధ్య సయోధ్యకు చైనా మధ్యవర్తిత్వం వహిస్తోంది.

వివరాలు 6లో ▸

నేడే మోదీ రాక..

ఉదయం 11.30కు హైదరాబాద్‌కు ప్రధాని.. వేడెక్కిన రాజకీయం

అటు అభివృద్ధి పనులు.. ఇటు రాజకీయ ఎత్తుగడలు

ప్రధాని కార్యక్రమాలకు కేసీఆర్ దూరం..!

సభలో మోదీ ఏం మాట్లాడతారన్న దానిపై ఉత్కంఠ

రాజకీయ విమర్శలు చేస్తారా? అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించేందుకే పరిమితమవుతారా?

రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ

బహిరంగ సభ విజయవంతానికి బీజేపీ భారీ ఏర్పాట్లు

బెయిల్‌పై సంజయ్ విడుదలతో పార్టీ శ్రేణుల్లో జోష్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో రాజకీయం వేడెక్కింది. పలు రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, ఎయిమ్స్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కోసం ప్రధాని శనివారం ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి నేరుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళతారు. అక్కడి కార్యక్రమాల తర్వాత పరేడ్‌గ్రౌండ్స్ సభలో పాల్గొంటారు. కొంతకాలం నుంచి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు తీవ్రస్థాయికి చేరడం, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవితను ఈడీ విచారించడం, పదో తరగతి పేపర్ లీక్ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్టు చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రధాని పర్యటన కాక రేపుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునివ్వడం, మోదీని, బీజేపీని టార్గెట్ చేస్తూ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు పెట్టడం, సింగరేణి ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించడం అగ్నికి ఆజ్యం పోస్తోంది. ఇక 'పరేడ్ గ్రౌండ్స్ సభలో ప్రధాని మోదీ ఏం మాట్లాడతారు? రాష్ట్ర ప్రభుత్వం, బీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబాన్ని

మిగతా 2వ పేజీలో ▶

8 కోచ్‌లు.. టికెట్ ధర రూ.1,680

రేపు తిరుపతి నుంచి మొదలుకానున్న వందేభారత్ రెగ్యులర్ సర్వీసు

-వివరాలు 12లో

రాక..

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన చేయనున్న మోదీ
- సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ రైలు ప్రారంభోత్సవం
- ఎంఎంటీఎస్ సర్వీసుల ప్రారంభం.. మహబూబ్‌నగర్ డబ్లింగ్ లైన్ జాతికి అంకితం .. బీబీనగర్ ఎయిమ్స్‌లో పలు పనులకు భూమి పూజ
- పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు
- పరేడ్‌గ్రౌండ్స్ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగం

కాక..

- రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు
- ప్రధాని మోదీ, బీజేపీని టార్గెట్ చేస్తూ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు.. సింగరేణి ప్రాంతాల్లో కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళన
- మోదీ సహా బీజేపీ కేంద్ర, రాష్ట్ర నేతలపై బీఆర్ఎస్ నేతల విమర్శలు
- తామూ నిరసనలు చేపట్టాలని కాంగ్రెస్, సీపీఐల నిర్ణయం



బండి సంజయ్‌ను పరామర్శిస్తున్న తరుణ్ ఛుగ్

కవిత, కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయం!

జైలు నుంచి విడుదలయ్యాక బండి వ్యాఖ్యలు

- కేసీఆర్ కుటుంబం లీకు వీరులు, లిక్కర్ వీరులు
- టీఎస్‌పీఎస్సీ లీకేజీలపై ఎండగట్టినందుకు నాపై కక్షగట్టారు..
- పథకం ప్రకారం పదోతరగతి పేపర్ లీక్ కేసులో అరెస్టు చేశారు
- పోలీసులపై పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తా.. కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాల్సిందే..

- 8లో



హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో ఎన్టీఆర్ గార్డెన్స్ పక్కన బాబాసాహెబ్ అంబేడ్కర్ భారీ విగ్రహ నిర్మాణం పూర్తయ్యింది. చుట్టూ ఉన్న నిర్మాణ సామగ్రిని తొలగించడంతో విగ్రహ రూపురేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నెల 14న సీఎం కేసీఆర్ ఈ విగ్రహాన్ని ప్రారంభించనున్నారు.

సింగరేణి ఏరియాలో బీజేపీ నేతలను తిరగనివ్వం

మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన ఎర్రబెల్లి, బాల్క సుమన్, పెద్ది

- అదానికి అప్పగించే కుట్రలను అడ్డుకునేందుకే ధర్నాలు
- బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ నేడు బీఆర్ఎస్ ఆందోళన
- ప్రశ్నపత్రాల లీకేజీ వెనక ఢిల్లీ పెద్దల హస్తం ఉందని ఆరోపణ

8లో

సింగరేణిపై చర్చకు రెడీ.. దమ్ముంటే రండి

బీఆర్ఎస్ నేతలకు ఈటల సవాల్

- రూ.11 వేల కోట్ల అభివృద్ధి పనులకోసం ప్రధాని వస్తుంటే.. అబద్ధపు ప్రచారాలా?
- మోదీ పర్యటన సందర్భంగా నిరసనలకు పిలుపునివ్వడం దారుణం
- సీఎం కేసీఆర్ చేతగానితనాన్ని ఇతరుల పైకి నెట్టడం అలవాటేనని విమర్శ

8లో



తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తర కర్ణాటక, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ద్రోణి శుక్రవారం బలహీనపడింది. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని విదర్భ, మరత్వాడ, కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కాగా, రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు శుక్రవారం కాస్త తగ్గాయి. గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 38.0 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత దుండిగల్‌లో 21.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	42.4	25.6
కర్నూలు	39.3	27.1
నల్లగొండ	38.5	22.0
భద్రాచలం	38.0	24.5
మహబూబ్‌నగర్	37.2	25.1
ఖమ్మం	37.0	24.0
విజయవాడ	37.0	24.0
హనుమకొండ	36.0	24.0
రామగుండం	35.8	24.4
విశాఖపట్నం	35.6	23.8
మెదక్	34.8	22.8
ఆదిలాబాద్	34.3	25.5
హైదరాబాద్	33.7	23.2
దుండిగల్	33.5	21.4
హకీంపేట్	32.9	23.0
నిజామాబాద్	31.4	27.3

తెలంగాణ పల్లెలకు 13 జాతీయ అవార్డులు

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ కింద 8 పురస్కారాలకు ఎంపిక

- నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ కింద 5 అవార్డులకు కూడా..
- 17న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం
- 'పల్లెప్రగతి'వల్లే రాష్ట్రానికి ఈ ఘనత: మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయి పురస్కారాల్లో తెలంగాణ పల్లెలకు అవార్డుల పంట పండింది. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్‌కు సంబంధించి 8 పురస్కారాలతోపాటు నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్‌కు సంబంధించి 5 పురస్కారాలు సాధించి రాష్ట్రం సత్తా చాటింది. దీన్‌దయాళ్ పురస్కారాల్లో 9 కేటగిరీల్లోని 27 అవార్డులకుగాను 8 అవార్డులు సాధించి రాష్ట్రాలవారీగా అగ్రస్థానంలో నిలిచింది. ఇందులో నాలుగు పంచాయతీలు తొలి ర్యాంకు సాధించగా మరో రెండు పంచాయతీలు రెండో ర్యాంకు, ఇంకో రెండు పంచాయతీలు మూడో స్థానంలో నిలిచాయి. అలాగే నానాజీ పురస్కారాల్లో 7 కేటగిరీలకుగాను ఐదు (వాటిలో ఒకటి ప్రథమ స్థానం) అవార్డులు లభించాయి. తెలంగాణ వివిధ కేటగిరీల్లో పురస్కారాలకు ఎంపికైన విషయాన్ని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఆర్థిక సలహాదారు డాక్టర్ బిజయకుమార్ బెహరా ఓ లేఖ ద్వారా రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శికి తెలియజేశారు. ఈ నెల 17న ఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో జరిగే 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్సెంటివైజేషన్ ఆఫ్ పంచాయత్స్ కమ్ అవార్డ్ సెర్మనీ'లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.



మార్కుల ఆధారంగా ర్యాంకులు...

ఏటా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఉత్తమ పనితీరు కనబరిచిన పంచాయతీలకు ప్రోత్సాహకంగా అవార్డులు అందిస్తోంది. జాతీయ పంచాయతీ అవార్డుల్లో భాగంగా, ఆన్‌లైన్‌లో పంచాయతీల ద్వారా నామినేషన్‌లను తీసుకొని 9 అంశాల్లో (థీమ్‌లలో) ఉత్తమ గ్రామ పంచాయతీలకు మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ అవార్డులు ప్రకటిస్తోంది. అయితే ఈ ఏడాది నుంచి అవార్డులను 9 అంశాల్లో ఏ పంచాయతీలు ప్రగతిని సాధించాయో వాటికి మొదటి, రెండవ, మూడవ బహుమతులుగా అవార్డులు ఇస్తోంది. ఇందులో ప్రతి అంశానికి వంద మార్కులకు సూచికలను ప్రకటించింది. ఈ తొమ్మిది అంశాల్లో ప్రతి పంచాయతీ సాధించిన మార్కుల ఆధారంగా దేశంలో ఉత్తమ పంచాయతీలను ప్రకటిస్తోంది.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్-2023

- **ఆరోగ్యవంతమైన పంచాయతీ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెంచుపల్లి మండలం గౌతంపూర్ (ఫస్ట్ ర్యాంకు)
- **తాగునీరు సమృద్ధిగా ఉన్న పంచాయతీ:** జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల (ఫస్ట్ ర్యాంకు)
- **సామాజిక భద్రతగల పంచాయతీ:** మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం కొంగట్‌పల్లి (ఫస్ట్ ర్యాంకు)
- **స్నేహపూర్వక మహిళా పంచాయతీ:** సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండలం ఏపూరు (ఫస్ట్ ర్యాంకు)
- **పేదరికరహిత, జీవనోపాధి పెంచిన పంచాయతీ:** గద్వాల జిల్లా రాజోలి మండలం మండొండి గ్రామం (సెకండ్ ర్యాంకు)
- **సుపరిపాలనగల పంచాయతీ:** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం చీమల్‌దారి (సెకండ్ ర్యాంకు)
- **క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ:** పెద్దపల్లి జిల్లా ఎలిగాడ్ మండలం సుల్తాన్‌పూర్ (థర్డ్ ర్యాంకు)
- **స్వయం సమృద్ధ మౌలిక సదుపాయాలుగల పంచాయతీ:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీర్‌రావుపేట మండలం గంభీర్‌రావుపేట (థర్డ్ ర్యాంకు)

మంత్రి ఎర్రబెల్లి, ఆయన బృందానికి అభినందనలు

సీఎం కేసీఆర్ మానసపుత్రిక అయిన పల్లెప్రగతి కార్యక్రమాల అమలు వల్లే రాష్ట్రానికి ఈ ఘనత లభించిందని, తెలంగాణను అవార్డులు వరించాయని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతోపాటు ఆయన బృందాన్ని ట్విట్టర్ వేదికగా అభినందించారు. ఇందుకు మంత్రి ఎర్రబెల్లి కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డులు రావడానికి కృషి చేసిన అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, సహకరించిన ప్రజలకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్-2023

- **ఉత్తమ బ్లాక్ (మండల) పంచాయతీ:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ ఎల్.ఎం.డి (సెకండ్ ర్యాంకు)
- **ఉత్తమ జిల్లా పంచాయతీలు:** ములుగు జిల్లా (సెకండ్ ర్యాంకు)
- **గ్రామ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ పురస్కార్ (స్పెషల్ కేటగిరీ):** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా కె. (థర్డ్ ర్యాంకు).
- **కార్బన్ న్యూట్రల్ విశేష్ పంచాయతీ పురస్కార్:** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా (సెకండ్ ర్యాంకు)
- **గ్రామ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ పురస్కార్ (స్పెషల్ కేటగిరీ–నాన్ ఫైనాన్షియల్ ఇన్సెంటివ్-సర్టిఫికెట్):** సిద్దిపేట జిల్లా మార్కూక్ ఎర్రవెల్లి (ఫస్ట్ ర్యాంకు)

నేడే మోదీ రాక..

▶ మొదటి పేజీ తరువాయి

టార్గెట్ చేస్తూ విమర్శలేమైనా చేస్తారా? కేవలం కేంద్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, సాయం వంటి అంశాలకే పరిమితమవుతారా?' అన్నదానిపై విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ప్రధాని పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీలు కూడా నిరసనలు చేపట్టాలని నిర్ణయించాయి.

ప్రధాని ప్రసంగంపై ఉత్కంఠ

తెలంగాణకు సంబంధించి రూ.11 వేల కోట్ల పైచిలుకు విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం మోదీ వస్తున్నందున రాజకీయపరమైన అంశాలపై మాట్లాడతారా, లేదా అన్న చర్చ సాగుతోంది. గత ఏడాదిన్నర కాలంలో పలుమార్లు రాష్ట్రానికి వచ్చిన మోదీ.. కొన్నిసార్లు కేసీఆర్‌ను, రాష్ట్రసర్కార్‌ను ఉద్దేశించి నేరుగా.. మరికొన్ని సార్లు పరోక్షంగా విమర్శలు సంధించారు. మరి ఇప్పుడు బీఆర్‌ఎస్ సర్కార్‌పై, సీఎం కేసీఆర్ వ్యవహారశైలిపై ఘాటైన విమర్శలు చేస్తారా, లేక గతంలో తరహాలో పరోక్ష విమర్శలు చేస్తారా? బండి సంజయ్ అరెస్టు వంటి అంశాలను ప్రస్తావించి తప్పుపడతారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

ఎన్నికల 'ఎఫెక్ట్' ఉంటుందంటున్న బీజేపీ!

కొన్నినెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో.. మోదీ సభలో తాజా రాజకీయ పరిణామాలు, కేంద్ర ప్రభుత్వాన్ని, బీజేపీని రాష్ట్ర సర్కారు, బీఆర్‌ఎస్ టార్గెట్ చేయడం వంటివి చర్చకు వచ్చే అవకాశాలు ఎక్కువని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి కాలంలో టీఎస్‌పీఎస్సీ, టెన్త్ పేపర్ల లీకేజీ, సంజయ్ అరెస్ట్, మళ్లీ సింగరేణి ప్రైవేటీకరణ అంశాన్ని తెరపైకి తేవడం, ఢిల్లీ లిక్కర్‌స్కాంలో కవితను ఈడీ విచారించడం వంటి అంశాలను ప్రధాని మోదీ పరోక్షంగానైనా ప్రస్తావించి... తద్వారా బీఆర్‌ఎస్ పెద్దలకు, రాష్ట్ర బీజేపీకి తగిన సంకేతాలు ఇస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కుటుంబ పార్టీలు, రాజకీయాలు, అవినీతి, అక్రమాలు, కుంభకోణాలను ప్రస్తావిస్తూ పరోక్షంగా విమర్శించే అవకాశం ఉందని కొందరు నేతలు చెప్తున్నారు.



ప్రధాని మోదీ ప్రసంగించే వేదిక

బీజేపీ–బీఆర్‌ఎస్.. టగ్ ఆఫ్ వార్..

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీఆర్‌ఎస్, బీజేపీ దూకుడు పెంచాయి. దీనితో తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, ఢిల్లీ లిక్కర్ స్కాం అంశాలపై బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసి బీఆర్‌ఎస్ సర్కారును, కేసీఆర్ కుటుంబాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేసింది. బీఆర్‌ఎస్ కూడా దీటుగా స్పందించి ప్రత్యారోపణలకు దిగింది. పదో తరగతి పేపర్ల లీక్ కేసులో కుట్ర అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు, రిమాండ్‌తో వేడి పెరిగిపోయింది. తాజాగా మోదీ పర్యటన సందర్భంగా సింగరేణి ప్రైవేటీకరణ అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చి అటు కేంద్రాన్ని, ఇటు బీజేపీని ఇరుకున పెట్టేందుకు బీఆర్‌ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పార్టీ శ్రేణుల్లో దూకుడు పెంచేందుకు కేసీఆర్ సహా కీలక నేతలంతా ప్రయత్నిస్తున్నారు. ఇక ప్రధాని పర్యటన, సభను విజయవంతం చేసి.. పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు బీజేపీ తీవ్రంగా కృషి చేస్తోంది.

ఈసారీ కేసీఆర్ దూరమే!

దాదాపు ఏడాదిన్నర కాలంలో వివిధ అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మోదీ నాలుగు సార్లు రాష్ట్రానికి రాగా.. సీఎం కేసీఆర్ ఒక్కసారి కూడా స్వాగతం పలకడానికి వెళ్లలేదు. ఆయన కార్యక్రమాలు వేటిలోనూ పాల్గొనలేదు. ఇప్పుడు ఐదోసారి ప్రధాని రాష్ట్రానికి వస్తున్నారు. ప్రోటోకాల్ ప్రకారం సీఎంకు ఆహ్వానం పంపడంతోపాటు బహిరంగ సభలో సీఎం ప్రసంగానికి ఏడు నిమిషాల సమయం కూడా కేటాయించారు. కానీ ఈసారి కూడా ప్రధాని కార్యక్రమాలు, సభలో కేసీఆర్ పాల్గొనడం లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రధానికి స్వాగతం పలకడానికి మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌ను పంపిస్తున్నారు.

మోదీ పర్యటన కార్యక్రమాలు ఇవీ..

- ఉదయం 11.30కు ప్రత్యేక విమానంలో బేగంపేటకు.. 11.45కు రోడ్డుమార్గాన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు..
- 11.47 నుంచి 11.55దాకా రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ రైలు పరిశీలన, మొదటి బోగీలో పిల్లలతో మాటామంతీ, డ్రైవింగ్ కేబిన్‌లో సిబ్బందిని కలుసుకుంటారు.
- 11.55 గంటలకు జెండా ఊపి సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తారు.
- మధ్యాహ్నం 12.15 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారు.
- 12.20 నుంచి 12.30 దాకా కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్, కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి ప్రసంగాలు
- 12.30 నుంచి 12.37 దాకా సీఎం కేసీఆర్ ప్రసంగం...
- 12.37 నుంచి 12.50 మధ్య రిమోట్ ద్వారా అభివృద్ధి పథకాల శిలాఫలకాల ఆవిష్కరణ. షార్ట్ వీడియోల ప్రదర్శన.
- 12.50 నుంచి 1.20 వరకు ప్రధాని మోదీ ప్రసంగం
- 1.30 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీకి తిరుగుప్రయాణం

ఏ ముఖం పెట్టుకొని రాష్ట్రానికి వస్తున్నారు?

ప్రధాని మోదీకి మంత్రి సబిత ప్రశ్న



తాండూరు రూరల్: ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని తెలంగాణ పర్యటనకు వస్తున్నారని మంత్రి పి.సబితారెడ్డి ప్రశ్నించారు. హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనే వారికి తెలంగాణలో చోటు లేదన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జినుగుర్తి గేటు వద్ద శుక్రవారం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఉన్నాయా? అని ప్రశ్నించారు. రెండోసారి అధికారంలోకి రాగానే పేదల ఖాతాల్లో రూ. 15 లక్షలు జమ చేస్తామని, 18 కోట్ల ఉద్యో గాలు ఇస్తామని చెప్పిన మాటలు ఏమయ్యా యని నిలదీశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేక.. బీజేపీ నేతలు లీకేజీ రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

మోదీ పర్యటనకు వ్యతిరేకంగా నేడు నిరసనలు

సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శుల పిలుపు

సాక్షి, హైదరాబాద్: మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. విభజన హామీలు అమలు చేయలేదని, సింగరేణి గనులను ప్రైవేటుకు అప్పగించేందుకు టెండర్లు పిలిచిన మోదీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదని కూనంనేని విమర్శించారు. విభజన చట్టం ప్రకారం దక్కాల్సిన హక్కులు, వాటాలను ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని తమ్మినేని వీరభద్రం ఆరోపించారు.



పరేడ్ గ్రౌండ్స్ మార్గంలో బీజేపీ ఫ్లెక్సీలు, కటౌట్లు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బండి సంజయ్

ప్రధాని పర్యటనకు సర్వం సన్నద్ధం

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, పరేడ్ గ్రౌండ్స్‌లో భారీగా ఏర్పాట్లు
- బీఆర్‌ఎస్, సీపీఐ నిరసన పిలుపులతో అప్రమత్తం
- 5 వేల మందితో భద్రత
- ప్రధాని ప్రయాణ మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు.. పరీక్షలు ఉన్న విద్యార్థులు ముందే వెళ్లాలన్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు సంబంధించి సర్వం సన్నద్ధమైంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్‌ఎస్, సీపీఐ పార్టీలు పిలుపునిచ్చిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయం 11.30కు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నప్పటి నుంచి తిరిగి 1.30 గంటలకు తిరిగి వెళ్లే వరకు ప్రధాని పర్యటించే ప్రాంతాలు, మార్గాల్లో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాని భద్రతను పర్యవేక్షించే ఎస్పీజీ (స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్)తోపాటు కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు, పోలీసులు కలిపి ఐదు వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని ప్రయాణించే మార్గాల్లో శుక్రవారమే రూట్ రిహార్సల్ కూడా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచే అంతా బందోబస్తు విధుల్లోకి రానున్నారు.

రైల్వేస్టేషన్, పరేడ్ గ్రౌండ్స్ ముస్తాబు

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శంకుస్థాపన కార్యక్రమాలు జరగనున్న పదో నంబర్ ప్లాట్‌ఫామ్‌ను అందంగా అలంకరించారు. శుక్రవారం నుంచే ఈ ప్లాట్‌ఫామ్ మీదుగా రైళ్ల రాకపోకలను నిలిపివేసి ఏర్పాట్లు చేపట్టారు.
- సైనిక అమర వీరుల వార్ మెమోరియల్ పక్కనే ఉన్న పశ్చిమ ప్రధాన ద్వారం నుంచి ప్రధాని నేరుగా సభా వేదిక వద్దకు వెళ్లేలా ఏర్పాటు చేశారు. ఆ మార్గం పక్కనే గోడను కూల్చి కేంద్ర మంత్రుల రాక కోసం మరో ప్రత్యేక మార్గం ఏర్పాటు చేశారు. ప్యాట్నీ చౌరస్తా నుంచి సికింద్రాబాద్ వెళ్లే రోడ్‌లో ఐదు ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేశారు. వాటి నుంచి వివిధ కేటగిరీల వారిని లోనికి అనుమతించనున్నారు.
- ప్రధాని అధికారిక కార్యక్రమం కావడంతో కేవలం లక్ష మంది మాత్రమే కూర్చునేందుకు వీలుగా 3 ప్రధాన షెడ్లను ఏర్పాటు చేశారు.
- ప్రధాన వేదిక ప్రాంగణంలోనే ప్రధాని కోసం ఆధునిక సదుపాయాలతో కూడిన ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు.
- మోదీ ప్రారంభించే/శంకుస్థాపన చేసే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నమూనాలను ప్రధాన వేదిక వెనుక భాగంలో ఏర్పాటు చేశారు.
- పరేడ్ గ్రౌండ్ చుట్టూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భారీ కటౌట్లు, హోర్డింగ్‌లు పెట్టారు.
- సభకు వచ్చేవారి కోసం ప్రాంగణంలో మొబైల్ టాయిలెట్లు సిద్ధం చేశారు. పదుల సంఖ్యలో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్‌లను అందుబాటులో ఉంచారు.
- ప్రధాని సభ అధికారిక కార్యక్రమం కావడంతో పరేడ్‌గ్రౌండ్ లోపల పార్టీ నేతల పోస్టర్లకు అవకాశం కల్పించలేదు. గ్రౌండ్ చుట్టూ రోడ్లు, మెట్రో పిల్లర్లు, భవనాలు అంతటా బీజేపీ నేతలు పోటాపోటీగా పోస్టర్లు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ ఆంక్షలు

బేగంపేట విమానాశ్రయం–సికింద్రాబాద్ స్టేషన్–పరేడ్ గ్రౌండ్స్ మధ్య మార్గాల్లో నిర్ణీత వేళల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జేఈఈ మెయిన్స్, ఎస్సై అభ్యర్థులకు సంబంధించిన పరీక్షలు శని, ఆదివారాల్లో జరగనున్నాయి. ప్రధాని ప్రయాణించే మార్గాల్లో చాలా స్కూళ్లు టెస్ట్ పరీక్షా కేంద్రాలుగా ఉన్నాయి. ఆంక్షలతో, సభకు వచ్చే వారితో ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉన్నందున విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఉదయం పరీక్ష ప్రారంభ సమయానికి ట్రాఫిక్ డైవర్షన్లు ఉండవని పోలీసులు అధికారులు చెప్తున్నారు. అభ్యర్థులు, విద్యార్థులు తమ ప్రయాణాన్ని ముందుగా ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు.



హోటల్‌ను ప్రింటేస్తూ..

మార్స్‌కు దారేస్తూ..

'స్పేస్'లో ఇళ్లకు రిహార్సల్‌గా భూమిపై త్రీడీ ప్రింటింగ్ హోటల్

ఇల్లు కట్టాలంటే.. ఇటుకలు, సిమెంటు, ఇసుక ఇలా ఎన్నోకావాలి. మరి భవిష్యత్తులో చందమామపైకో, అంగారకుడిపైకో వెళ్లినప్పుడు అక్కడ ఇళ్లు కట్టుకోవాలంటే ఎలా? దీనికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చెప్తున్న సమాధానం.. 'త్రీడీ ప్రింటింగ్' ఇళ్లు. కేవలం చెప్పడమే కాదు! చంద్రుడు, అంగారకుడిపై ఇళ్లు కట్టేందుకు ఓ ప్రైవేటు కంపెనీతో భాగస్వామ్య ఒప్పందమూ కుదుర్చుకుంది. ఆ కంపెనీ ఇందుకు రిహార్సల్‌గా.. భూమ్మీదే త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో విశాలమైన హోటల్‌ను కట్టేందుకు రెడీ అయింది. ఈ వివరాలేమిటో తెలుసుకుందామా?

–సాక్షి సెంట్రల్ డెస్క్



భవిష్యత్తుకు బాటలు వేసేలా..

మున్ముందు చంద్రుడిపైకి, అంగారకుడిపైకి మనుషులను పంపేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో మనుషులు అక్కడ జీవించేందుకు వీలుగా.. అక్కడి మట్టితోనే ఇళ్లు కట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందుకోసం త్రీడీ ప్రింటింగ్‌లో పేరెన్నికగన్న కంపెనీ 'ఐకాన్'తో భాగస్వామ్య ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఈ క్రమంలో ఐకాన్ సంస్థ తొలుత ప్రయోగాత్మకంగా భూమ్మీదే త్రీడీ ప్రింటింగ్‌తో ఇళ్లను నిర్మించి పరిశీలించాలని నిర్ణయించింది. అమెరికా టెక్సాస్ రాష్ట్రంలోని ఎడారిలో ఉన్న మర్ఫా పట్టణ శివార్లలో 60 ఎకరాల్లో త్రీడీ ప్రింటింగ్ భవనాలు, గదులు, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసింది.

ఏమిటీ హోటల్ ప్రత్యేకతలు?

- ఈ హోటల్‌లో త్రీడీ విధానంలో ప్రింట్ చేసే కొన్ని భవనాలు, దూరం దూరంగా కొన్ని ఇళ్లు, ఒక స్విమ్మింగ్ పూల్, స్పా, ఆరుబయట సేద తీరేందుకు పలు ఏర్పాట్లు ఉంటాయి.
- దూరం దూరంగా నిర్మించే ఇళ్లకు 'సండే హోమ్స్'గా పేరుపెట్టారు. రెండు నుంచి నాలుగు బెడ్రూమ్‌లు, బాత్రూమ్‌లతో ఆ ఇళ్లు ఉంటాయి.
- గుండ్రటి నిర్మాణాలు, డోమ్‌లు, ఆర్చ్‌ల డిజైన్లతో ఇళ్లు, భవనాలు ఉంటాయి. గదుల్లో బెడ్‌లు, టేబుల్స్ వంటి కొంత ఫర్నిచర్‌ను కూడా త్రీడీ విధానంలోనే ప్రింట్ చేయనున్నారు.
- చుట్టూ ఉన్న ఎడారి వాతావరణంలో కలిసిపోయేలా ఈ నిర్మాణాలకు రంగులను నిర్దేశించారు.
- ఎడారిలో క్యాంపింగ్ సైట్‌గా ఉన్న ప్రాంతంలో ప్రింట్ చేస్తున్న ఈ హోటల్‌కు 'ఎల్ కాస్మికో'గా పేరు పెట్టారు. ఇలాంటి త్రీడీ ప్రింటెడ్ హోటల్ ప్రపంచంలో ఇదే మొదటిది కానుందని చెప్తున్నారు.
- ప్రఖ్యాత ఆర్కిటెక్చర్ కంపెనీ 'బిగ్ (బ్జర్కే ఇంగెల్స్ గ్రూప్)' దీనికి డిజైన్లు రూపొందించగా.. ఐకాన్ సంస్థ త్రీడీ ప్రింటింగ్‌తో నిర్మాణాలు చేపట్టనుంది.





ఇక్కడ చేసి.. చూపించి..

"చంద్రుడు, మార్స్‌పై మొట్టమొదటి నివాసాలు కట్టేందుకు మా సంస్థ నాసాతో కలసి పనిచేస్తోంది. వాటికి రిహార్సల్‌గా అక్కడి ప్రాంతాలను పోలినట్టుగా భూమ్మీద ఉన్న ఎడారిలో త్రీడీ ప్రింటింగ్‌తో ఇళ్లను నిర్మించబోతున్నాం. కేవలం మట్టిని వాడి ఇళ్లను నిర్మించిన పురాతన మూలసూత్రాలను, ప్రస్తుత అత్యాధునిక త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీని వినియోగించి.. అద్భుతమైన నిర్మాణాలను రూపొందించనున్నాం.''

- 'ఐకాన్' సహ వ్యవస్థాపకుడు జేసన్ బల్లార్డ్, హోటల్ యజమాని లిజ్ లాంబర్ట్

ఇది ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్ట్



- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధిపై ప్రధాని మోదీ ట్వీట్
- అసంఖ్యాక ప్రజలు ప్రయోజనం పొందుతారని వెల్లడి
- సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌తో ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రయోజనమని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధితో అసంఖ్యాక ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరగనున్న కార్యక్రమాలపై శుక్రవారం డీడీ న్యూస్ చేసిన ట్వీట్‌ను ప్రధాని రీట్వీట్ చేస్తూ.. ''ఇదొక ముఖ్యమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టు. దీని వలన అసంఖ్యాక ప్రజలు ప్రయోజనం పొందుతారు''అని పేర్కొన్నారు. ఇక వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఆత్మగౌరవం, సౌకర్యం, అనుసంధానతలకు పర్యాయపదంగా మారిందని.. సికింద్రాబాద్–తిరుపతి మధ్య ప్రవేశపెట్టిన ఈ రైలు పర్యాటకానికి, ముఖ్యంగా ఆధ్యాత్మిక పర్యాటకానికి విశేష ప్రయోజనం చేకూరుస్తుందని ప్రధాని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇది ఆర్థిక వృద్ధిని కూడా ఇనుమడింపజేస్తుందని వ్యాఖ్యానించారు.



సికింద్రాబాద్‌లోని టివోలీ చౌరస్తాలో బీజేపీకి వ్యతిరేకంగా వెలిసిన ఫ్లెక్సీ

మళ్లీ పోస్టర్ల కలకలం

ప్రధాని రాకను నిరసిస్తూ.. బీజేపీని విమర్శిస్తూ ఫ్లెక్సీలు

కంటోన్మెంట్ (హైదరాబాద్): ప్రధానమంత్రి రాక నేపథ్యంలో పరేడ్‌గ్రౌండ్స్ చుట్టుపక్కల బీజేపీ నేతలు పెద్ద సంఖ్యలో పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. ప్రధాని రాకను నిరసిస్తూ టివోలీ చౌరస్తా, జేబీఎస్, మారేడుపల్లి మార్గాల్లో పోస్టర్లు, ఫ్లెక్సీలు వెలిశాయి. టివోలీ చౌరస్తాలో బీజేపీ నాయకురాలు, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి ప్రధాని రాకను స్వాగతిస్తూ హోర్డింగ్ ఏర్పాటు చేశారు. ఆ పక్కనే ఉన్న ఓ ప్రైవేటు హోర్డింగ్‌పై మోదీకి వ్యతిరేకంగా కొందరు ఫ్లెక్సీ పెట్టారు. వివిధ రాష్ట్రాల్లో నేతలకు వ్యతిరేకంగా ఈడీ దాడులు, బీజేపీ నేతల స్కామ్‌లు తదితర అంశాలపై వార్తలను దానిపై హైలైట్ చేశారు.

- జేబీఎస్ చౌరస్తాలో 'పరివార్ వెల్‌కమ్స్ యూ'అంటూ బీజేపీ నేతల వారసుల ఫొటోలతో వ్యంగ్యంగా హోర్డింగ్ పెట్టారు. అందులో వేద్‌ప్రకాశ్ గోయల్– పీయూష్ గోయెల్, అమిత్ షా– జైషా, రాజ్‌నాథ్‌సింగ్– పంకజ్‌సింగ్, దేవేంద్ర ప్రధాన్– ధర్మేంద్ర ప్రధాన్, ప్రేమ్‌కుమార్ ధుమాల్– అనురాగ్ ఠాకూర్, బీఎస్ యడ్యూరప్ప– రాఘవేంద్ర తదితర నేతలు, వారసుల ఫొటోలు ఏర్పాటు చేశారు.
- సికింద్రాబాద్ క్లబ్ ఎదురుగా ఉన్న రోడ్డుపై 'సేవ్ సింగరేణి'పేరిట మరో పోస్టర్‌ను ఏర్పాటు చేశారు.


నల్లమలలోని సలేశ్వర క్షేత్రంలో లింగమయ్య దర్శనానికి బారులు తీరిన భక్తులు

ముగిసిన సలేశ్వరం జాతర

- మూడు రోజులపాటు జరిగిన ఉత్సవాలు
- లింగమయ్యను దర్శించుకున్న మూడున్నర లక్షల మంది భక్తులు

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమలలోని సలేశ్వర క్షేత్రంలో కొలువుదీరిన లింగమయ్య స్వామి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలకు సుమారు మూడున్నర లక్షల మంది భక్తులు హాజరయ్యారు. ఏటా ఉగాది తర్వాత వచ్చే చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక చెంచులు నిర్వహించే లింగమ య్య ఉత్సవాలకు ఈసారి అటవీ శాఖ మూడు రోజులు మాత్రమే అవకాశం ఇచ్చింది. గురువారం లింగమయ్య దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు బారులు తీరగా ఊపిరాడక ఒకరు, గుండెపోటుతో మరొకరు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు చివరి రోజున సలేశ్వరానికి వచ్చే భక్తుల రద్దీ తగ్గింది.

భక్తుల అసంతృప్తి: సలేశ్వరం జాతర సందర్భంగా లోయ ప్రాంతంలో సౌకర్యాలు కల్పించకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రోజుకు లక్ష మందికి పైగా భక్తులు హాజరు కాగా, ఆరుగురు పోలీసులను మాత్రమే కేటాయించడంతో నియంత్రణ కరువైంది. దట్టమైన అటవీప్రాంతంలో సన్నని లోయ గుండా ప్రయాణించి లింగమయ్యను దర్శించుకోవాల్సి ఉంటుంది. వందల సంఖ్యలో భక్తులు మాత్రమే ఉండేందుకు అవకాశం ఉన్న చోట ఒకేసారి వేల మంది చేరుతుండటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్వామి దర్శనానికి మరిన్ని రోజులు అవకాశం ఇస్తూ, పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టాటూలు.. మెహందీలు వద్దు

- ఎస్సై తుది రాతపరీక్ష రాసే అభ్యర్థులకు అధికారుల సూచన
- నేటి ఉదయం పది గంటలకు పరీక్ష మొదలు
- బయోమెట్రిక్ విధానంలో అభ్యర్థుల హాజరు
- హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లో పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పొరపాట్లు లేకుండా సాంకేతికత వినియోగిస్తున్న పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు
- హాల్‌టికెట్‌పై ఫొటో అంటించడం తప్పనిసరి అని సూచించిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: పోలీస్ శాఖలో కొలువు కోసం కలలుకంటున్న యువత కీలక 'పరీక్ష'కు సమయం ఆసన్నమైంది. శనివారం(నేడు) ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఎస్సై తుదిరాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సివిల్ ఎస్సై, కమ్యూనికేషన్ ఎస్సై, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎస్సై, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులకు శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఈ తుది రాతపరీక్షకు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి(టీఎస్ఎల్పీఆర్బీ) పకడ్బందీగా చర్యలు చేపట్టింది. అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్



విధానంలో తీసుకోనున్నారు. ఇప్పటికే ప్రాథమిక రాతపరీక్ష, దేహదారుఢ్య పరీక్షల సమయంలో నమోదైన వేలిముద్రలతో సరిపోలితేనే పరీక్షకు అనుమతిస్తారు. ఒకరికి బదులు వేరొక అభ్యర్థి పరీక్షకు హాజరయ్యేందుకు చెక్ పెట్టడంతోపాటు పారదర్శకత కోసం ఈ విధానాన్ని పోలీస్ నియామక మండలి చైర్మన్ వీవీ శ్రీనివాసరావు గత రెండు రిక్రూట్‌మెంట్ల నుంచి అమల్లోకి తెచ్చారు. అభ్యర్థులు చేతులకు మెహందీ(గోరింటాకు), టాటూలు వేసుకోవద్దని, వాటి కారణంగా బయోమెట్రిక్ హాజరులో ఇబ్బంది తలెత్తితే పరీక్షకు అనుమతించబోరని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి విధిగా హాల్‌టికెట్ ఏ 4 సైజులో ప్రింటవుట్ తీసుకోవడంతోపాటు దానిలో సూచించిన ప్రాంతంలో పాస్‌పోర్ట్ సైజు ఫొటో(ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసింది) అతికించి తేవాలని, హాల్‌టికెట్‌పై ఫొటో అతికించకుండా వచ్చే అభ్యర్థులను పరీక్షకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు.

నిమిషం ఆలస్యంగా వచ్చినా నో ఎంట్రీ...

సివిల్ ఎస్సై పోస్టుకు 1,01,052 మంది, కమ్యూనికేషన్ ఎస్సై పోస్టుకు 11,151 మంది, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎస్సైకి 2,762 మంది, ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టుకు 4,820 మంది పార్ట్–2 దరఖాస్తులు(తుది రాతపరీక్ష కోసం దరఖాస్తు) పూర్తి చేశారు. వీరంతా శని, ఆదివారాల్లో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌ల్లో జరిగే తుది రాతపరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలికి అనుమతించబోమని అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు.

పూర్తి సాంకేతికత.. పక్కాగా ఏర్పాట్లు

లక్షకుపైగా యువత నెలలుగా తుది రాతపరీక్షకు సన్నద్ధమయ్యారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా పక్కాగా ఎస్సై తుది రాతపరీక్ష నిర్వహణకు పోలీస్ నియామక మండలి పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. ప్రతి అభ్యర్థికి బయోమెట్రిక్ విధానంలో హాజరు తీసుకోనున్నారు. పరీక్షకేంద్రాల్లో అవసరమైనచోట సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షపత్రాల లీకేజీల నేపథ్యంలో ఎస్సై తుది రాతపరీక్షలో పొరపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరీక్షకేంద్రాలున్న హైదరాబాద్, సికింద్రాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పోలీస్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలున్నాయి: డీజీపీ

ఎస్సై తుది రాత పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని డీజీపీ అంజనీకుమార్ సూచించారు. శనివారం ఉదయం హైదరాబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, చాలా రూట్లలో శనివారం ఉదయం 8–30 నుంచి 10–30 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు రెండు గంటల ముందే చేరుకునేలా జాగ్రత్తపడాలని సూచించారు.


శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, మల్లారెడ్డి

వ్యాక్సిన్ సరఫరాపై చేతులెత్తేసిన కేంద్రం

- కేంద్ర మంత్రి మాండవీయ ప్రకటనపై హరీశ్‌రావు మండిపాటు
- వ్యాక్సిన్ సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరిన మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కరోనా కట్టడికి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఓవైపు కరోనా కేసులు పెరుగుతున్నాయని రాష్ట్రాలను అప్రమత్తం చేస్తున్న కేంద్రం.. వ్యాక్సిన్లు సరఫరా చేయాలని రాష్ట్రాలు కోరితే, సొంతంగా కొనుగోలు చేసుకోవాలని సూచించడం ఏమిటని నిలదీశారు. అంటే వ్యాక్సిన్ సరఫరాపై కేంద్రం చేతులెత్తేసినట్టేనని స్పష్టం చేశారు. శుక్రవారం వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కరోనా పరిస్థితులు, సంసిద్ధతపై కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ దేశాలు, పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీటింగ్, వ్యాక్సినేషన్, అప్రాప్రియేట్ బిహేవియర్ తదితర ఐదంచెల వ్యూహాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు.

వ్యాక్సిన్లు పంపండి.. బయట కొనుక్కోవచ్చు..

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనంతో కరోనా కట్టడిలో, వ్యాక్సినేషన్‌లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. రాష్ట్రంలో కరోనా పరిస్థితులు పూర్తిగా అదుపులో ఉన్నాయని తెలిపారు. కానీ కేంద్రం నుంచి రాష్ట్రానికి వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోవడంతో నిల్వలు లేకుండా పోయాయని, వ్యాక్సినేషన్ నిలిచిపోయిందని వివరించారు. రాష్ట్రానికి అవసరమైన వ్యాక్సిన్ డోసులను తక్షణమే సరఫరా చేయాలని కోరారు. దీనిపై ఇప్పటికే కేంద్రానికి లేఖ కూడా రాశామని గుర్తుచేశారు. ఇతర రాష్ట్రాలు కూడా వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోవడంతో.. వ్యాక్సినేషన్ కార్యక్రమానికి అంతరాయం కలుగుతోందని కేంద్రమంత్రి దృష్టికి తెచ్చాయి. దీనిపై మాండవీయ స్పందిస్తూ.. ఆయా రాష్ట్రాలు కావల్సిన మేర వ్యాక్సిన్లు కొనుగోలు చేసుకోవచ్చని, బహిరంగ మార్కెట్లో వ్యాక్సిన్ నిల్వలు ఉన్నాయని చెప్పారు.

బయో–ఈ నుంచి వ్యాక్సిన్లు

రాష్ట్ర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా హైదరాబాద్ ఫార్మా సంస్థ బయోలాజికల్–ఈ సహకారంతో 15 లక్షల డోసుల వ్యాక్సిన్లు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని హరీశ్‌రావు తెలిపారు. వ్యాక్సిన్ సరఫరా చేసేందుకు ముందుకొచ్చిన బయోలాజిక్–ఈ ఎండీ మహిమా దాట్లకు ఈ సందర్భంగా హరీశ్‌రావు ధన్యవాదాలు తెలిపారు.


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మేడిన్ తెలంగాణ అద్దాలు

శంకర కంటి ఆసుపత్రి ప్రారంభోత్సవంలో కేటీఆర్

మణికొండ: రాష్ట్రంలో రెండు విడతలుగా కంటి వెలుగు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు వెల్లడించారు. రెండవ విడత కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే కోటి మందికి పరీక్షలు చేశామని చెప్పారు. కంటి అద్దాలు అవసరమైన వారికి మేడిన్ తెలంగాణ అద్దాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. శుక్రవారం మణికొండలో శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన శంకర సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రిని కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, జిల్లాకో మెడికల్ కళాశాల, పల్లె దవాఖాన, బస్తీ దవాఖానలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నగరం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. ఎక్కడా లేని విధంగా ఇటీవల నీతి ఆయోగ్ ప్రకటించిన వివరాల ప్రకారం దేశంలోనే వైద్య ప్రమాణాలలో రాష్ట్రం మూడవ స్థానంలో నిలిచిందని చెప్పారు.

ప్రపంచ స్థాయి ఆసుపత్రి రావటం శుభపరిణామం

హైదరాబాద్‌కు మరో ప్రపంచ స్థాయి కంటి వైద్య సేవలను అందించే శంకర ఆసుపత్రి రావటం శుభ పరిణామని, తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కేటీఆర్ భరోసానిచ్చారు. సమాజానికి శంకర కంటి ఆసుపత్రి అందిస్తున్న సేవలు అమోఘమని, ఆర్థికంగా లేని వారికి ఉచితంగా, సంపన్నులకు నామమాత్రపు రుసుములతో సేవలు అందించటం అభినందనీయమన్నారు. కంటివెలుగులో భాగంగా శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఈ ఆసుపత్రి తోడ్పాటునివ్వాలని మంత్రి కేటీఆర్ కోరారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కోరిక మేరకు ముందుగా రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచే సేవలను ప్రారంభించాలన్నారు. శంకర ఆసుపత్రి వాహనాలను ఎలాంటి ట్యాక్స్‌లు లేకుండా మినహాయింపులు ఇస్తామని హామీనిచ్చారు.

అంధత్వాన్ని తొలగించటమే లక్ష్యంగా..

దేశంలో అంధత్వాన్ని తొలగించటమే లక్ష్యంగా శంకర ఐ ఫౌండేషన్ ప్రారంభించామని, అదే మార్గంలో నిరంతరాయంగా కృషి చేస్తామని ఎస్ఈఎఫ్ యూఎస్ఏ వ్యవస్థాపకుడు మురళీ కృష్ణమూర్తి చెప్పారు. 2030నాటికి 5లక్షల మందికి ఉచిత శస్త్ర చికిత్సలు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. హైదరాబాద్ కేంద్రంగా 225 పడకల ఆసుపత్రి నిర్మించేందుకు సహకరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడి ఆసుపత్రి నిర్మాణానికి శంకర ఐ ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్ ఐకేర్‌లు దాతలుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, సంస్థ ప్రతినిధులు ఎస్‌వీ బాల సుబ్రమణ్యం, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో గిరిజన గురుకులానికి రూ. 5 కోట్లు

- 47 ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ. 235 కోట్లు మంజూరు
- కొత్తగా ప్రారంభం కానున్న రెండు గురుకులాలకు రూ. 24 కోట్లు మంజూరు
- ఎస్టీఎస్‌డీఎఫ్ నుంచి ఈ నిధుల వినియోగానికి ప్రభుత్వం ఆదేశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) పరిధిలోని గురుకుల పాఠశాలలకు అదనపు హంగులు దిద్దాలని గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయించింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు తెలంగాణలో 47 గిరిజన గురుకుల పాఠశాలలున్నాయి. ఇవన్నీ శాశ్వత భవనాల్లోనే నిర్వహిస్తున్నప్పటికీ... ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ భవనాల సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో శాశ్వత ప్రాతిపదికన అదనపు గదులు, డార్మిటరీలు, డైనింగ్ హాల్స్ ఏర్పాటు కోసం గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. గిరిజనుల కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్న షెడ్యూల్డ్ ట్రైబ్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్టీ ఎస్‌డీఎఫ్) ద్వారా సివిల్ పనులు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేయగా... రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే ఆమోదం తెలిపింది.

ఒక్కో పాఠశాలకు రూ. 5 కోట్లు...

గిరిజన గురుకుల సొసైటీ పరిధిలో పాత పాఠశాలల్లో నిర్మాణ పనుల కోసం ఒక్కో గురుకులానికి రూ.5 కోట్లు చొప్పున కేటాయించింది. చాలాచోట్ల తరగతి గదులతో పాటు డార్మిటరీ భవనాల ఆవశ్యకత ఎక్కువగా ఉంది. ఇదివరకు ఒక్కో పాఠశాలలో ఒక తరగతికి ఒక సెక్షన్ మాత్రమే ఉండేది. ఇప్పుడు విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయ్యింది. దీంతో పాటు ఇంటర్మీడియట్ కాలేజీలుగా దాదాపు అన్నీ అప్‌గ్రేడ్ అయ్యాయి. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా వసతి లేకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలతో ఇప్పటివరకు నెట్టుకొచ్చారు. తాజాగా ఎస్టీ ఎస్‌డీఎఫ్ ద్వారా నిధుల లభ్యతకు అనుగుణంగా నిధులు కేటాయించారు. మొత్తం 47 పాఠశాలలకు రూ.235 కోట్లు కేటాయించారు. అతి త్వరలో ఈ పనులకు సంబంధించి టెండర్లు ఖరారు చేసిన తర్వాత పనులు ప్రారంభించనున్నారు. గిరిజన విద్యార్థుల అడ్మిషన్ల డిమాండ్‌కు అనుగుణంగా 2023–24 వార్షికంలో కొత్తగా మరో రెండు పాఠశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో వీటికి శాశ్వత ప్రాతిపదికన భవనాలను నిర్మించేందుకు ప్రత్యేక నిధులను సైతం కేటాయించింది. ఒక్కో పాఠశాలకు రూ.12కోట్లు చొప్పున రెండింటికి కలిపి రూ.24కోట్లు కేటాయించింది. దీంతో గురుకుల పాఠశాలల నిర్మాణ పనులకు మొత్తంగా రూ.259 కోట్లు ఖర్చు చేయనుంది.

గిరిజన ఇంజనీరింగ్ పర్యవేక్షణ...

ఎస్టీ గురుకులాల్లో త్వరలో చేపట్టనున్న ఈ సివిల్ పనుల బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న గిరిజన ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించింది. టెండర్ల ఖరారు, పనుల కేటాయింపు, పర్యవేక్షణ, నాణ్యత పరిశీలన తదితర పూర్తిస్థాయి బాధ్యతలను గిరిజన ఇంజనీరింగ్ అధికారులే చూసుకుంటారు. గత మూడేళ్లుగా నిర్మాణ పనులకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంతో స్తబ్దుగా ఉన్న గిరిజన ఇంజనీరింగ్ విభాగానికి తాజాగా ఊరట లభించినట్లయింది.

నాలోనే మనసు నిలుపు. బుద్ధిని నాలోనే ఉంచు.
ఆ తరవాత నాలోనే నివసిస్తావు. ఇందులో సందేహం లేదు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, ఏప్రిల్, 8

చరిత్రాత్మకమైన తీర్పు

న్యాయం చేయటం మాత్రమే కాదు, అలా చేస్తున్నట్టు కనబడటం కూడా ముఖ్యం అంటారు. 'మీడియా వన్' కేసులో సుప్రీంకోర్టు బుధవారం వెలువరించిన తీర్పు ఈ సహజ న్యాయసూత్ర ప్రాధాన్యతనూ, దాపరికం లేని న్యాయవ్యవస్థ ఆవశ్యకతనూ నిర్మొహమాటంగా తెలియజేసింది. అంతేకాదు, ఈమధ్యకాలంలో 'జాతీయ భద్రత'ను అడ్డం పెట్టుకునే పోకడలను నిశితంగా విమర్శించింది. 'మీడియా వన్' కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే ఆ కేసు నిజానికి ఇంత దూరం రావాల్సిన అవసరం లేదని సులభంగానే అర్థమవుతుంది. దేశ భద్రతకు ముప్పు కలుగుతుందన్న ఆరోపణతో కేరళలోని 'మీడియా వన్' చానెల్ ప్రసారాల కొనసాగింపునకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించింది. దేశభద్రతకు ముప్పు తెచ్చే ఎలాంటి చర్యలనైనా అడ్డుకోవటానికీ, ప్రజల ప్రాణాలు కాపాడటానికీ ప్రభుత్వాలకు సర్వాధికారాలూ ఉంటాయి. ఆ విషయంలో రెండో మాటకు తావులేదు. కానీ అందుకు సహేతుక కారణాలను చూపటం ముఖ్యం. అలా కారణాలు చూపటంవల్ల వ్యక్తులు లేదా సంస్థలు లబ్ధి పొందుతాయా లేదా అన్నది ప్రధానం కాదు. ప్రజాస్వామ్యం నాలుగు కాలాలపాటు మనుగడ సాగించాలంటే ఇది ముఖ్యం. ఇలా చేయటంవల్ల దేశ ప్రజల్లో చట్టబద్ధ పాలనపై విశ్వసనీయత ఏర్పడుతుంది. పాలన పారదర్శకంగా సాగుతున్నదనీ, జవాబుదారీతనం అమల్లో ఉన్నదనీ భరోసా కలుగుతుంది.

కారణాలేమైనా గానీ ఇటీవలి కాలంలో కొన్ని కేసుల విషయంలో తన వాదనలకు మద్దతుగా కేంద్రం కొన్ని పత్రాలను సీల్డ్ కవర్‌లో అందజేయటం, న్యాయస్థానాలు ఆ ధోరణిని అంగీకరించటం కనబడుతుంది. ఇందుకు రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారం, అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్‌పై వచ్చిన లైంగిక ఆరోపణల కేసు తదితరాలు మొదలుకొని భీమా కోరెగావ్ కేసు వరకూ ఎన్నిటినో ఉదహరించవచ్చు. ఆఖరికి ఇదెంత వరకూ వచ్చిందంటే సీల్డ్ కవర్ అందజేయటం న్యాయవ్యవస్థలో ఒక సాధారణ విషయంగా మారింది. ఇందువల్ల కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తులకూ, సంస్థలకూ నష్టం జరుగుతుంది. తమపై ఉన్న ఆరోపణలేమిటో, వాటికిగల ఆధారాలేమిటో తెలియకపోతే ఏ ప్రాతిపదికన వారి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించాలి? ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం కాదా? నేరం రుజువయ్యేవరకూ ఎవరినైనా నిరపరాధులుగా పరిగణించాలన్నది అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలూ అనుసరించే విధానం. దానికి సీల్డ్ కవర్ పద్ధతి గండికొడుతోంది. అంతేకాదు, నిందితులకు అన్యాయం జరుగుతున్నదన్న భావన కలిగి ప్రజల్లో వారిపట్ల సానుభూతి ఏర్పడుతోంది. 'మీడియా వన్' కేసు విషయానికొస్తే ఆ సంస్థ ప్రసారాలను ఎందుకు నిలిపేయాల్సివచ్చిందో కేంద్రం చెప్పదు. హైకోర్టుకు పోతే అక్కడ ధర్మాసనం తనకు సమర్పించిన సీల్డ్ కవర్‌లో ఆ ఆరోపణలేమిటో చూస్తుంది. వీటిపై మీ వాదనేమిటని కక్షిదారును ప్రశ్నించదు. పైగా ఆ సీల్డ్ కవర్ సమాచారం ఆధారంగా తీర్పు వెలువడుతుంది. సింగిల్ బెంచ్ ముందూ, డివిజన్ బెంచ్ ముందూ కూడా 'మీడియా వన్'కు ఇదే అనుభవం ఎదురైంది. అయితే అసలు న్యాయస్థానాలు సీల్డ్ కవర్‌ను అంగీకరించే ధోరణి గతంలో లేనేలేదని చెప్పలేం. ప్రభుత్వోద్యోగుల సర్వీసు, పదోన్నతుల వ్యవహారాల్లో సంబంధిత అధికారుల ప్రతిష్ఠ కాపాడేందుకు... లైంగిక దాడుల కేసుల్లో బాధితుల గుర్తింపు రహస్యంగా ఉంచటానికి సీల్డ్ కవర్‌లో వివరాలు ఇచ్చే సంప్రదాయం ఉంది. ఆఖరికి రాఫెల్ యుద్ధ విమానాల కేసులో సాంకేతిక అంశాలు వెల్లడిస్తే శత్రు దేశాలకు ఉప్పందించినట్టవుతుందని చెప్పటం వరకూ అంగీకరించవచ్చు. కానీ బీసీసీఐ విషయంలో తానే నియమించిన కమిటీ నివేదికనూ, గుజరాత్‌కు సంబంధించిన నకిలీ ఎన్‌కౌంటర్ కేసు, అయోధ్య స్థల దస్తావేజు కేసువంటి అంశాల్లో సైతం గోప్యత పాటించాలని ప్రభుత్వం చేసిన వినతిని న్యాయస్థానాలు అంగీకరించటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? 2013లో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల పర్యవసానంగా ఈ స్థితి ఏర్పడింది. అయితే తాజా తీర్పులో సుప్రీంకోర్టు ప్రస్తావించినట్టు బ్రిటన్, కెనడా సుప్రీంకోర్టులు ఈ విషయంలో ఎన్నడగిన తీర్పులు వెలువరించాయి. కేసులకు సంబంధించిన సమాచారాన్ని దాచివుంచటం వల్ల ఆ కేసుల గురించి చర్చించుకోవటం, ప్రభుత్వ పనితీరును ప్రశ్నించటం ప్రజలకు నిరాకరించినట్టే అవుతుందని అక్కడి న్యాయస్థానాలు అభిప్రాయపడ్డాయి.

'మీడియా వన్' కేసులో జాతీయ భద్రతను సాకుగా చూపిన కేంద్రం దాన్ని సమర్థించుకునేందుకు సీల్డ్ కవర్‌లో ప్రస్తావించిన కారణాలు పేలవంగా ఉన్నాయి. అందుకే గాల్లోంచి ఆరోపణలు సృష్టిస్తే అంగీకరించబోమని ధర్మాసనం వ్యాఖ్యానించాల్సి వచ్చింది. ఇకపై ఇలాంటి కేసుల విషయంలో న్యాయస్థానాలు అనుసరించాల్సిన రెండు గీటురాళ్లను కూడా ప్రకటించింది. కేసులోని అంశాలు వెల్లడిస్తే జాతీయ భద్రతకు ముప్పు కలుగుతుందని భావించటానికి అవసరమైన సమాచారం ప్రభుత్వం అందించిందా లేదా అన్నది అందులో మొదటిది. వివేకవంతులైన వ్యక్తులు సైతం ఆ సమాచారం ఆధారంగా అలాగే భావించే అవకాశం ఉన్నదా లేదా అన్నది రెండోది. భావప్రకటనా స్వేచ్ఛకు పూచీపడే రాజ్యాంగంలోని 19వ అధికరణలోనే ఏయే అంశాల్లో నియంత్రణలు అమలు చేయవచ్చో వివరంగా ఉంది. వాటిని బేఖాతరు చేసి నచ్చని అభిప్రాయాలు ప్రకటించారన్న ఏకైక కారణంతో ఆ స్వేచ్ఛకు గండికొట్టడం రాజ్యాంగస్ఫూర్తిని దెబ్బతీస్తుంది. అందుకే 'మీడియా వన్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనది.

పాశ్చాత్య బాణీలకు నృత్యం చేయాలా?

విశ్లేషణ



డెన్నిస్ అలిపోవ్

యూఎన్ ఛార్టర్ ప్రకారం సార్వభౌమత్వం అన్ని దేశాలకు సమానంగా వర్తిస్తుంది. కానీ ఈ విషయాన్ని అంగీకరించేందుకు పాశ్చాత్య దేశాలు సిద్ధంగా లేవు. అందుకే ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తున్నాయి. నిజానికి ఉక్రెయిన్ వ్యవహారం ఐక్యరాజ్య సమితి పరిధి లోనిది. జీ20 అజెండాలో లేదు. కానీ పశ్చిమ దేశాలు దీన్ని చాలా దురుసుగా అజెండాలోకి చేర్చాయి. యూరప్ సమస్యలను ఉద్దేశపూర్వకంగానే ప్రపంచ సమస్యలుగా చూపెట్టే ప్రయత్నం జరుగుతోందని భారత్ స్పష్టం చేసింది. జీ20 అధ్యక్ష స్థానంలో భారత్ ప్రతిపాదించిన అజెండా అమలు చేయడం ద్వారా మాత్రమే భిన్నధ్రువ దౌత్యం విషయంలో నమ్మకం పెరుగుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ముక్కలు కాకుండా ఉంటుంది.

అంతర్జాతీయ అధికార పీఠాలిప్పుడు కదులుతున్నాయి. నిన్నమొన్నటివరకూ కొందరికి అనుకూలంగా ఉన్న ప్రపంచం కాస్తా భిన్న ధ్రువమవుతోంది. అధికారమిప్పుడు అన్ని దిక్కులా విస్తరిస్తోంది. మునుపటితో పోలిస్తే ప్రపంచ వ్యవహారాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల మాటలిప్పుడు ఎక్కువగా చెల్లుబాటు అవుతున్నాయి. అయితే ఈ మార్పులను జీర్ణించుకునే పరిస్థితుల్లో పశ్చిమ దేశాల్లేవు. దేశాల సర్వసమానత్వం ఆధారంగా ప్రస్తుతమున్న అధికార వ్యవస్థ వీరికిప్పుడు అకస్మాత్తుగా చేదవుతోంది.

యూఎన్ ఛార్టర్ ప్రకారం సార్వభౌమత్వం అన్ని దేశాలకు సమానంగా వర్తిస్తుంది. కానీ ఈ విషయాన్ని అంగీకరించేందుకు అవి సిద్ధంగా లేవు. అందుకే ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తున్నాయి. ఇతర దేశాల వ్యవహారాల్లో ప్రత్యక్షంగా కలుగచేసుకోవడం, పరోక్ష పద్ధతుల్లో యుద్ధం చేయడం... తమను ధిక్కరించే వారిపై పశ్చిమ దేశాలు చేసే ప్రయత్నాలన్నది తెలిసిన విషయమే. నిర్మాణాత్మక సహకారం కంటే పోటీతత్వానికి ఎక్కువ ఆదరణ ఉన్న సమయమిది. ఇంధన, ఆహార రంగాలు అస్థిరంగా ఉన్న పరిస్థితులను చూస్తున్నాం. వాతావరణ మార్పులు, అధిక ద్రవ్యోల్బణం లాంటి మానవీయ సంక్షోభాలిప్పుడు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ సంస్థలన్నీ అందరికీ ప్రయోజనకరమైన అంశాలపై, ఒప్పందాల అమలుపై దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

ఎనభై శాతం జీడీపీ జీ20 దేశాల్లోనే....

అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య అంశాల్లో సహకారం కోసం జీ20 ఏర్పాటైంది. ఈ ఇరవై దేశాల జాతీయ స్థూల ఉత్పత్తి ప్రపంచ స్థూల ఉత్పత్తిలో దాదాపుగా 80 శాతం వరకూ ఉండటం గమనార్హం. అంతర్జాతీయ వాణిజ్యం, కర్బన ఉద్గారాలూ ఎక్కువే. ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల జనాభా ఈ జీ20 దేశాల్లోనే ఉంది. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సంక్షోభాల పరిష్కారానికి తగిన సామర్థ్యమూ కలిగి ఉందీ వేదిక. ప్రపంచం మాంద్యం ముంగిట్లో నిలిచిన ఈ తరుణంలో జీ20 మరింత ఆలస్యం చేయడం ఏమాత్రం తగదు. జీ20 అధ్యక్ష స్థానంలో భారత్ ప్రతిపాదించిన అజెండా అమలు చేయడం ద్వారా మాత్రమే భిన్నధ్రువ దౌత్యం విషయంలో నమ్మకం పెరుగుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ముక్కలు కాకుండా ఉంటుంది. పారిశ్రామిక వృద్ధి మళ్లీ పట్టాలు ఎక్కుతుంది. అభివృద్ధి చెందిన దేశాలతోపాటు ఎదుగుతున్న మార్కెట్లతోనూ భారత్‌కు సత్సంబంధాలున్నాయి. కాబట్టి భారత్ ప్రతిపాదించిన అజెండాతో లక్ష్యాల సాధన కష్టమేమీ కాబోదు. భారత్ ప్రాథమ్యాలతో రష్యా పూర్తిగా ఏకీభవిస్తోంది. ఎంచుకున్న లక్ష్యాలను పూర్తి చేయడం వల్ల అనూహ్యమైన సాంఘిక, ఆర్థిక సమస్యలు, ప్రపంచస్థాయి సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చునని రష్యా కూడా భావిస్తోంది.



మార్చి 1, 2 తేదీల్లో జరిగిన జీ20 దేశాల విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల సమావేశాలు ఐక్యరాజ్యసమితి పాత్రతోపాటు బహుముఖ ప్రపంచ ప్రాముఖ్యతను మరోసారి స్పష్టం చేశాయి. అజెండాలో కీలకమైన అంశాలను జొప్పించేందుకు భారత్ అనుసరించిన నిర్మాణాత్మక విధానం, సమతౌల్యతలను ప్రశంసించి తీరాలి.

ఐక్యరాజ్యసమితి అంశం జీ20లోనా?

నిజానికి ఉక్రెయిన్ వ్యవహారం ఐక్యరాజ్య సమితి పరిధి లోనిది. జీ20 అజెండాలో లేదు. కానీ పశ్చిమ దేశాలు దీన్ని చాలా దురుసుగా అజెండాలోకి చేర్చాయి. రష్యాని తెగనాడటంపైనే ప్రపంచ భవిష్యత్తు ఆధారపడిందేమో అన్నంత హడావుడి చేశాయి. వ్యూహాత్మకంగా రష్యా ఓటమిని చూడాలని పాశ్చాత్య దేశాలు బహిరంగంగా ప్రకటించిన విషయం తెలిసిందే. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జయశంకర్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. యూరప్ సమస్యలను ఉద్దేశపూర్వకంగానే ప్రపంచ సమస్యలుగా చూపెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. రష్యాతో సహా యూరప్ దేశాలు ఇప్పటికే విదేశీ బాణీలకు నృత్యం చేస్తూ వస్తున్నాయి. అయితే ఇది భద్రతకు సంబంధించిన అంశం. 'నాటు నాటు' డ్యాన్స్ కాదు. ఈ విషయంలో ప్రధాన ముద్దాయి కచ్చితంగా అమెరికా. దీని లక్ష్యం ఒక్కటే. తనను ఎవరూ ప్రశ్నించరాదు! రష్యాను అణచివేసేందుకు ఉక్రెయిన్‌ను ఒక పనిముట్టుగా వాడుకునే ప్రయత్నం చేస్తోంది. తద్వారా ప్రపంచం మొత్తం పరోక్షంగా తన ఆధిపత్యాన్ని అంగీకరించాలన్నది అమెరికా లక్ష్యం.

2009 సెప్టెంబరులో జీ20 వేదిక లక్ష్యాల్లో అంతర్జాతీయ ఆర్థిక సహకారం ఒకటని తీర్మానించారు. ఇందుకు తగ్గట్టుగా జీ20 తన దృష్టిని ప్రపంచ ఆర్థిక, సామాజిక సమస్యలపై కేంద్రీకరించాలి. ఉక్రెయిన్ వంటి అంశాలను చేర్చడం వల్ల జీ20 లక్ష్యం విఫలమవుతుంది. రష్యా దీన్ని కోరుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితి భద్రతా సమితిలో ఈ అంశాలన్నింటిపై చర్చలు జరిపేందుకు రష్యా సిద్ధంగానే ఉంది. జీ20 అజెండా మాత్రం హైజాక్ కారాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. భారత్ లేవనెత్తిన ఉగ్రవాదం, మత్తుమందులు, ప్రకృతి వైపరీత్యాల విషయం మరీ ముఖ్యంగా చెప్పుకోవాలి. ఉగ్రవాదం పెరుగుదలకు సార్వభౌమ దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే కారణమని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అత్యధికులు అంగీకరిస్తారు. ఇందుకు ఒకప్పటి యుగోస్లేవియాతోపాటు లిబియా, ఇరాక్, సిరియా, అఫ్గానిస్తాన్‌లే ప్రత్యక్ష ఉదాహరణలు. ఈ దేశాల్లో 'నాటో' వ్యవహారాలు మరీ ముఖ్యంగా చెప్పుకోవాలి. ఇప్పుడు అది అటు పసిఫిక్‌లో, ఇటు ఆసియాలో తూర్పుదిక్కుగా మరింతగా విస్తరించాలని అనుకుంటోంది. ఈ పరిణామం మరిన్ని ఘర్షణలకు దారితీస్తుంది. యూరప్ దేశాల్లో మాదిరిగా విభజనకు దారితీస్తుంది. నార్డ్ స్ట్రీమ్ గ్యాస్ పైపులైన్‌ను అనూహ్యంగా ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి అసలు దోషులెవరన్నది ఎప్పటికైనా కచ్చితంగా తెలుతుంది. ఇరాక్‌లో నాటో చేసిన ఇతర 'మంచి పనుల' విషయం కూడా!

అన్యాయమైన ఆంక్షలు, దేశాల మధ్య సరుకుల రవాణాను కృత్రిమంగా పాడు చేయడం వంటివి ఉక్రెయిన్ సమస్యకు మూల కారణాలు... తనను తాను రక్షించుకోవాలనుకుంటున్న రష్యా కాదు. ఈ విషయంపై ప్రజల్లో అపోహలు ఉన్న నేపథ్యంలో ఒక్క విషయాన్ని స్పష్టం చేయాలి. ఉక్రెయిన్ పై సైనిక దాడి చేయాలన్నది రష్యా ముందున్న అవకాశాల్లో ఒకటి కానేకాదు. రష్యా సార్వభౌమత్వానికి నేరుగా ముప్పు ఏర్పడటం, ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టడం వంటి చర్యలకు ప్రతిగా తీసుకున్న నిర్ణయం మాత్రమే.

పాశ్చాత్య దేశాల చేతుల్లో ఆర్థిక సంబంధాలు ఆయుధాలుగా మారిపోయాయి. ఫలితంగా ఇప్పటికే అంతర్జాతీయ ఆహార రంగం గతి తప్పి ధరలు పెరిగాయి. రష్యాతోపాటు ప్రపంచదేశాలన్నీ ఇప్పుడు ఆ భారాన్ని మోయాల్సిన పరిస్థితి వచ్చింది. నెపం మొత్తం రష్యాపై నెట్టాలన్నది నిలబడేది కాదు. జీ20 అజెండా అమలు కావాలనుకుంటే దాన్ని తిరస్కరించాలి కూడా. జీ20 అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్‌తో కలిసి పనిచేసేందుకు రష్యా కట్టుబడి ఉంది. మంత్రుల స్థాయి సమావేశాలన్నింటిలో చురుకుగా పాల్గొంటోంది. లక్ష్యాల సాధనలో భారత్‌తో కలిసి పనిచేసేందుకు, తగిన ఫలితాలు రాబట్టేందుకు తగినంత వెసులుబాటుతో వ్యవహరించేందుకు సిద్ధంగా ఉన్నాం. దక్షిణాది దేశాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కంటే తమ వ్యూహాత్మక అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చే వారు నిర్ణయం తీసుకోవాల్సిన తరుణం కూడా ఇదే!

వ్యాసకర్త భారత్‌లో రష్యా రాయబారి
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అవి ముఖ్యం కాదా?



తాజ్‌మహల్ ఎవరు నిర్మించారన్నది ఒక్కటే మన మునిమనవలు తెలుసుకోవాల్సిన విషయం కాదు. బృహదీశ్వరాలయం, ఖజురహో, రాజస్థాన్ ఆలయాలు, గుజరాత్ ఆలయాలు, బెంగాల్, ఒడిషా, అస్సాం, కశ్మీర్, హిమాచల్, యూపీ, ఉత్తరాఖండ్, బిహార్, తెలంగాణ ఆలయాలన్ని కూడా ఎవరు నిర్మించారో తెలుసుకోవాలి.

– మణిదీపా బోస్, కాలమిస్ట్

ఆగిపోవాల్సిన వ్యాధి



జన్యుపరంగా ఒక మగవాడు ఒక మహిళ పుర్రెను పగలగొట్టాడు (బాక్సింగ్ పోటీ వీడియో షేర్ చేశారు). దీన్ని మనం ఒకప్పుడు మహిళల పట్ల జరుగుతున్న హింస అనేవాళ్లం. ఇప్పుడు దాన్ని 'ట్రాన్స్' హక్కుల విజయం అంటున్నాం. ఈ ట్రాన్స్ కల్ట్ అనేది మన దేశంలో ఒక మానసిక ఆరోగ్య అంటువ్యాధి. అది ఆగిపోవాలి.

– వివేక్ రామస్వామి, అమెరికా 'అధ్యక్ష' అభ్యర్థి

ఆ భావన పుట్టించడానికే...



ఊహించినట్టే, మరింతమంది కాంగ్రెస్ నాయకులు బీజేపీవైపు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఈరోజు పార్టీ మారారు. రెడ్డి గానీ, అనిల్ ఆంటోనీ(మాజీ రక్షణ మంత్రి ఏకే ఆంటోనీ కుమారుడు) గానీ ఏ రకంగా చూసినా పెద్ద నాయకులు కాదు. కానీ కాంగ్రెస్ మునిగిపోయే ఓడ అన్న భావనను నిర్మించడంలో వీళ్లు సాయపడతారు. ఇంకొన్ని పెద్ద పేర్లు ఈ బాటలో నడుస్తాయి.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

వద్దు పోట్లాటలు



హిందువులందరూ వెళ్లి 'ఫరాజ్' సినిమా చూడండి. ముస్లింలందరూ వెళ్లి ఫరాజ్ సినిమా చూడండి. పోట్లాటలు, ట్విట్టర్ వేదికగా రోతపుట్టించే వ్యాఖ్యానాలు చేయడం మానండి. (దర్శకుడు) హన్సల్ మెహతా సర్ అత్యంత సంక్లిష్టమైన ఉద్వేగాన్ని చాలా సున్నితంగా చూపారు. అది ఇవాళ్టి సత్యం.

– మీరా చోప్రా, నటి

ఇన్‌బాక్స్

న్యాయానికి మానవీయ స్పర్శ

ప్రముఖ ప్రజాపక్ష న్యాయమూర్తి జస్టిస్ ఓ. చిన్నప్పరెడ్డి న్యాయ వ్యవస్థ లోపల ఉంటూ కూడా ప్రజల హక్కుల కోసం బాహాటంగా నిలిచిన ధైర్యశాలి. ఆయన శతజయంతి సంవత్సరం నడుస్తోంది. ఈ ఏప్రిల్ 13న పదవ వర్ధంతి కూడా. జస్టిస్ చిన్నప్పరెడ్డి 1922 సెప్టెంబర్ 25న కర్నూలు జిల్లా జంబులదిన్నె గ్రామంలో జన్మించారు. విద్యాభ్యాసం అనంతరం మద్రాస్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల్లో న్యాయవాదిగా పనిచేశారు. తర్వాత అవే హైకోర్టుల్లో న్యాయమూర్తిగానూ తీర్పులిచ్చారు. 1978లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయన ఏ స్థాయిలో పనిచేసినా గ్రామిక ప్రజల గొంతుకగా ఉన్నారు. ఎన్నో చారిత్రాత్మక తీర్పులిచ్చారు. మార్క్సిజం అత్యున్నత స్థాయి మానవతా వాదమని ఆయన నమ్మారు.



జస్టిస్ ఓ. చిన్నప్పరెడ్డి

రాజ్యాంగ సంబంధ కేసుల్లోనే కాకుండా సివిల్, క్రిమినల్, సర్వీస్ 'లా', ఖైదీల హక్కులు, దళితులు, వెనుక బడిన కులాలవారి హక్కుల విషయంలో అపరిమిత పరిజ్ఞానం, గొప్ప నైపుణ్యం కనిపిస్తుంది. 'సమాన పనికి సమాన వేతనం' విషయంలో ఆయన ఇచ్చిన తీర్పు ఒక మైలు రాయి.

జాతీయ భద్రత పేరుతో ప్రజలను జైలు పాలు చేయడానికి వీల్లేదనీ, వాటిని రాజ్యాంగ కోర్టులు పరిశీలించాలనీ అన్నారు. మనిషికి ఉన్న భావాల ఆధారంగా శిక్షలు వేయడం, ఉద్యోగాల నుండి తొలగించడం వంటి వాటిని నిరోధిస్తూ సుదీర్ఘ తీర్పునిచ్చారు. కవిత్వం రాసినందుకు చెరబండరాజు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌లను రాజ్యం డిటెన్యూలుగా చేసినప్పుడు జస్టిస్ చిన్నప్పరెడ్డి ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనది. జాతీయగీతం పాడలేదని స్కూల్ పిల్లలను పాఠశాల నుండి తొలగిస్తూ ఇచ్చిన ఆర్డర్‌ను రద్దుపరుస్తూ 'అందరూ జాతీయగీతం పాడాల్సిన అవసరం లేదు. అయితే జాతీయగీతం పాడే సందర్భంగా నిశ్శబ్దంగా ఉంటే సరిపోతుంది' అని పిల్లలను కాపాడి వారి చదువులు కొనసాగేలా తీర్పునిచ్చారు.

జస్టిస్ చిన్నప్పరెడ్డి సుదీర్ఘ కృషిని గుర్తు చేసుకుంటూ రేపు (ఆదివారం) సభ నిర్వహిస్తున్నాం. దీనికి అందరూ ఆహ్వానితులే.

– తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్
(రేపు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జస్టిస్ ఓ. చిన్నప్పరెడ్డి శతజయంతి సభ)

చెవుల పూలు – పంగ నామాలు

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల లైటు బుగ్గలు ఎల్గినయి. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులందరు పాన్ డబ్బ కాడ జమైతరు. గా దాని మీద గీ దాని మీద అనకుంట అన్నిటి మీద మాట్లాడుతుంటరు. రాజకీయాల మీద ముచ్చట బెట్టుకుంట మాటల తోనే కొట్లాడుతుంటరు. గా దినం నేను బోకముందు గాల్లు ఏం మాట్లాడుకున్రో నా కెర్క లేదు. గని నేను బోయినంక గాల్లు గీ తీర్గ మాట్లాడుకుంట్రు.

''మన దేసంల ముప్పై లచ్చల మంది పోరగాల్లు మందుగొట్టి ఊగుతున్నా సర్కార్ ఏం జేస్త లేదు'' అని యాద్గిరి అన్నడు.

''ఎంతమంది మందు గొట్టినా, ఎవలు మందుగొట్టినా సర్కార్ ఏమనది'' అని సత్నారి అన్నడు.

''ఎందుకనది?''

''మందుతోనే సర్కార్‌కు ఆమ్దాని వొస్తున్నది. ఉగ్గపాల లెక్క ఇక ముంగట ఉగ్గు మందు తాపియ్యాలని సర్కార్ అంటున్నది.''

''మొక్కై వొంగనిది మాన్నై వొంగదు. ఆ ఉగ్గు మందు అల్వాటు చేస్తేనే పెగ్గు మందుకు అల్వాటైతరని చెప్తున్నది.''

''మొన్న శ్రీరామనవమి నాడు కేసీఆర్ బద్రాచలం ఎందుకు బోలేదు. సీతా, రాముని పెండ్లికి ముఖ్యమంత్రి ముత్యాల తలంబ్రాలు గొంచబోవాలె గదా'' అని ఇస్తారి అడిగిండు.

''గిప్పుడేంది. ఎప్పటి సందో గాయిన గొంచ బోత లేడు.''

''రాముడనంగనే కేసీఆర్‌కు అయోధ్య గుర్తు కొస్తది. అయోధ్య గుర్తుకు రాంగనె బీజేపీ యాదికొస్తది. బీజేపీ యాదికి రాంగనే గాయినకు మండుతది.''

''ఇక ముందు అయోధ్య అంటె ముఖ్యమంత్రికి కాంగ్రెస్ గుడ్క యాదికొస్తదేమో.''

''గదెట్ల?''

''సంటర్ రాహుల్ గాంధిని పుజాల్ల ఎంపి కుర్సి మీదికెల్లి దించింది. ఇగ దాంతోని డిల్లిల సర్కార్ ఇచ్చిన బంగ్లను గాయిన కాలి జేసిండు. మీరేం ఫికర్ జెయ్యకుంట్రి. అయోధ్యకు రాంట్రి. మాతోని కల్సి ఉండుంట్రి అని జ్ఞాన్ దాస్ అనేటి స్వామిజీ రాహుల్ తోని అన్నడు.''

''గిది ఎలచ్చన్ల యాడాది అయ్యె బట్కి ఆత్మీయ సమ్మేళనాలు పేరు మీద బీఆర్ఎస్ మీటింగ్‌లు బెడ్తున్నది. బీఆర్ఎస్సోల్లందరు ఒక్క మాట మీద ఉంటున్నరు అని జెప్పెతందుకు కోషిస్ జేస్తున్నది. గని బీఆర్ఎస్సోల్లందరు ఒక్కమాట మీద ఉంటున్నరా?''

''గా మీటింగ్‌లు జెయ్యబట్కె బీఆర్ఎస్ లీడర్ల నడ్మ ఉన్న కొట్లాటలు బయట పడుతున్నయి.''

''గదెట్ల?''

''జన్గాం జిల్ల స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గంల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం బెట్టింట్రు. గా దానికి



గాయినను బిల్వ లేదనుకుంట ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఒక్క తీర్గ మొత్తుకుండు. గాయిన నల్లగొండ జిల్ల ఇంచార్జి. నల్లగొండ జిల్ల ఇంచార్జిని జన్గాం జిల్ల ఆత్మీయ సమ్మేళనంకు ఎట్ల బిలుస్తం అని ఎమ్మెల్యే రాజయ్య అడిగిండు. గాల్లిద్దరూ ఉప్పు, నిప్పు అసుంటోల్లు. ఆత్మీయ సమ్మేళనం అనే పచ్చ గడ్డి జెయ్యబట్కె గాల్ల నడ్మ బగ్గుమని మంట లేసింది.''

''జన్గాం జిల్లలనే గాకుంట ఇంకే జిల్లల అసమ్మతి మంటలు లేసినయి?''

''ఆదిలాబాద్ జిల్లల గుడ్క అసమ్మతి మంటలు లేసినయి. ఆత్మీయ సమ్మేళనాలు బెట్టి అందరిని కల్పుకోని బోవాలని సి.ఎం. జెప్పిండు. గని మంత్రి ఇంద్రకరన్ రెడ్డి అందరిని కల్పుకోని బోతలేడు. గాయిన చెంచ గాల్లతోనే బోతున్నడని బీఆర్ఎస్ లీడర్ శ్రీహరి రావు అంటున్నడు.''

''హన్మంతున్ని జెయ్యబోతె బోడ కోతి అయిన తీర్గ ఆత్మీయ సమ్మేళనాలు బెడితె గవి అసంతృప్తి సమ్మేళనాలు అయినయా?''

''అయినయా అని అడుగుతవేంది? అయినట్టు ఎర్కైత లేదా? గివి జెయ్యబట్కెనే సర్పంచి, జెడ్‌పిటిసి అసువంటి కుర్సిలకు ఎలచ్చన్లు బెడ్త లేరు. గవిగిన బెడ్తె గ్రూపుల నడ్మ కొట్లాటలు ఎక్వ అయితయని బీఆర్ఎస్ బుగులు బడుతున్నది.''

''బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంల హుజూర్ నగర్ ఎమ్మెల్యే ఆత్మీయ సేవ జేసిండట గదా.''

''అవ్ జేసిండు. బువ్వ గిన్నె మోస్కోని వొచ్చిండు. మోస్కోని వొచ్చుడే గాకుంట బీఆర్ఎస్సోల్లకు బువ్వ వొడ్డిచ్చిండు.''

''గట్ల జేసుడు తప్పు గాదా?''

''తప్పు ఎందుకైతది. ఎమ్మెల్యే పబ్లిక్ సర్వెంట్. పబ్లిక్ అంటె జెనం. సర్వెంట్ అంటె జీతగాడు. బీఆర్ఎస్సోల్లు పబ్లిక్ గాదా? పబ్లిక్ అయిన బీఆర్ఎస్సోల్ల సర్వెంట్ గదే జీతగాడైన ఎమ్మెల్యే బువ్వ వొడ్డిస్తె తప్పేమున్నది. వొడ్డిచ్చకపోతెనే తప్పు.''

''నిజామాబాద్ జిల్లల బీఆర్ఎస్, బీజేపీ నడ్మ ఫ్లెక్సి విద్దం నడ్సింది?''

''ఏందా గా విద్ద?''

''పచ్చ బోర్డు బెట్టి బీజేపీ ఎంపీ అర్వింద్ దెచ్చిన పసుపు బోర్డు అని బీఆర్ఎస్ రాసింది. బీఆర్ఎస్ గట్ల బెడ్తె బీజేపీ ఊకుంటదా? ఆర్గీజ్ ఊకోదు. కేసీఆర్‌కు ఫాంహౌజ్, కవితకు బుర్జ్–ఖలీఫా, ఎమ్మెల్యేలకు జీ మాల్, బీదోల్లకు డబల్ బెడ్‌రూం ఇండ్లు యాడ అని రాసిన ఫ్లెక్సీ ఏ గాకుంట 500 కోట్ల రూపాయలతో కెసిఆర్ ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ సెల్ అని రాసిన దాన్కి ఎదురుంగ ఒక సెల్ బొమ్మ దించిన ఫ్లెక్సిని గుడ్క బీజేపీ బెట్టింది.''

''గివ్విటిని జూసి జెనం ఏంజేసింట్రు?''

''చెవుల పూల తోని ఉన్న ఫ్లెక్సీనే గాకుంట, పంగ నామాలతోని గూడిన ఫ్లెక్సీని జెనం బెట్టి బిజెపి, బీఆర్ఎస్ మాకు బెట్టినయి అని గవ్విట్ల జెనం రాసింట్రు.''

గీ తీర్క నాత్రి తొమ్మిది గొట్టెదాంక మా దోస్తులు ముచ్చట బెట్టింట్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

రోజా దివ్యౌషధం

పవిత్ర రమజాన్ మాసం వరాల వసంతం. ఇందులో అన్నీ శుభాలే. దైవాదేశాలను పాటిస్తూ, సత్కార్యాలు ఆచరిస్తూ, దుర్మార్గాలకు దూరంగా ఉండే వారికి ప్రతినెలా, ప్రతిరోజూ, ప్రతి క్షణమూ శుభ సూచకమే. కారుణ్య భరితమే. అయితే రమజాన్‌లో మాత్రం దైవ కారుణ్యం విశేషంగా వర్షిస్తుంది. అందుకని ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మనస్ఫూర్తిగా, ఆత్మసంతోషంతో వ్రతం పాటించాలి. నియమబద్ధంగా నమాజులు చేయాలి. తరావీహ్‌లు ఆచరించాలి. నఫిల్ ఆరాధనల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.



పవిత్ర ఖురాన్‌ను అర్థం చేసుకుంటూ చదివే ప్రయత్నం చెయ్యాలి. నిజానికి ఆరాధనల ద్వారా మనిషి సంపూర్ణ మానవతావాదిగా మారాలన్నది అసలు ఉద్దేశ్యం.

అందుకే దైవం సృష్టిలో ఏ జీవరాశికీ ఇవ్వనటువంటి ప్రత్యేకతనూ, బుద్ధి కుశలతనూ, విచక్షణా జ్ఞానాన్నీ ఒక్క మానవుడికే ప్రసాదించాడు. అందుకని మనిషి తన స్థాయిని గుర్తించాలి. మానవ సహజ బలహీనతల వల్ల జరిగిన తప్పుల్ని తెలుసుకోవాలి. దైవం ముందు వాటిని ఒప్పుకోవాలి. పశ్చాత్తాపం చెందుతూ క్షమాపణ కోసం దైవాన్ని వేడుకోవాలి. పవిత్ర రమజానే దీనికి సరైన తరుణం.

ఒక విద్యార్థి పరీక్షల తరుణంలో ఎలా శ్రమిస్తాడో... విశ్వాసులు రమజాన్‌లో అలా శ్రమించాలి. చదువును నిర్లక్ష్యం చేసి పరీక్షలను పట్టించుకోకపోతే విద్యార్థి ఎలా నష్టపోతాడో, రమజాన్ శుభతరుణంలో అలక్ష్యంగా వ్యవహరిస్తే విశ్వాసులు కూడా అలాగే నష్టపోతారు. అందుకని ఉపవాసం ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొని పాటించాలి.

కళ్లు, చెవులు, కాళ్లు, చేతులు, నోరు అన్ని అవయవాలూ ఉపవాసం ఉండాలి. కేవలం పస్తులుండడమే రోజా కాదు. రోజా స్థితిలో కళ్లు చెడు చూడకూడదు. చెవులు చెడు వినకూడదు. నోరు అసభ్యాన్ని పలకకూడదు. కాళ్లు, చేతులతో చెడువైపునకు వెళ్ళకూడదు. మనసులో చెడు తలంపులు రాకూడదు. అప్పుడే 'రోజా' పరిపూర్ణ మవుతుంది.

– మదీహా అర్జుమంద్

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.విదియ ఉ.10.02 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** స్వాతి ప.1.56 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.7.31 నుండి 9.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.53 నుండి 7.32 వరకు, **అమృతఘడియలు:** ఉ.4.59 నుండి 6.40 వరకు (తెల్లవారితే ఆదివారం); **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమేనా?


రవీందర్‌సింగ్

కరీంనగర్: 'పదోతరగతి ప్రశ్నపత్రాలు బయటకు రావడంలో నీ ప్రమేయం లేకుంటే, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అందించి విచారణకు సహకరించాలి'అని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్..బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. 'సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరావు కదా.. నీవు చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నా. సంక్షేమ పథకాలతోపాటు సింగరేణి ప్రైవేటీకరణపై కూడా బహిరంగ చర్చకు రావడానికి సిద్ధంగా ఉన్నా'అని రవీందర్‌సింగ్ ప్రకటించారు. శుక్రవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్ సింగ్ మాట్లాడారు. పదోతరగతి పరీక్ష పత్రాలు బయటకు రావడంలో ఏ–1గా పోలీసులు సంజయ్‌పై కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తే బెయిల్‌పై విడుదలై వచ్చి ఎంపీ హోదాను మరిచి మాట్లాడిన తీరు గర్హనీయమన్నారు.

అనారోగ్య తెలంగాణగా మార్చారు: షర్మిల



సాక్షి, హైదరాబాద్: జబ్బు చేస్తే వైద్యం కోసం అప్పులు చేసి ఆస్తులు అమ్ముకునేలా చేస్తున్నారని, ఆరోగ్య తెలంగాణ పేరుతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అనారోగ్య తెలంగాణగా మార్చారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల మండిపడ్డారు. ఆరోగ్య తెలంగాణ అంటే ఒక్కో బెడ్డు మీద ఇద్దరు, ముగ్గురిని పడేయడమా? లక్ష మందికి ఒక డాక్టర్, 10వేల మందికి ఒక నర్సు ఉండటమా అని శుక్రవారం ట్విట్టర్‌లో నిలదీశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో బాలింతలను పొట్టన పెట్టుకోవడమా అని ప్రశ్నించారు. జిల్లాకో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి హామీ ఏమైందో చెప్పాలన్నారు. ఆరోగ్యశ్రీకి నిధులు ఎగ్గొట్టిన ఘనత సీఎం కేసీఆర్‌ది అని మండిపడ్డారు. ఆస్పత్రి భవనాలు పాతబడి, పెచ్చులూడుతున్నా ఈ ప్రభుత్వానికి సోయి లేదని విమర్శలు గుప్పించారు.

బీఆర్ఎస్, బీజేపీని గద్దె దించుతాం


ప్రవీణ్‌కుమార్

నల్లగొండ టౌన్: నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీఆర్ఎస్, బీజేపీలను గద్దె దించే వరకు పోరాడుతామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులు వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నల్లగొండలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీతో సీఎం కేసీఆర్ కుటుంబానికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. పదో తరగతి పేపర్ లీకేజీ విషయంలో 24 గంటల్లోపే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్టు చేయించిన ముఖ్యమంత్రి... టీఎస్‌పీఎస్సీ విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వంలోని పెద్దల హస్తం ఉండటం వల్లే.. టీఎస్‌పీఎస్సీపై దర్యాప్తు నత్తనడకన సాగుతోందని ఆరోపించారు. వెంటనే కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని, ఆ తరువాతే ఇతర పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

డీఏఓ పేపరూ అమ్మేశాడు!

- ప్రవీణ్ లీలల్లో కొత్త కోణం
- 'గ్రూప్–1 కరెక్షన్స్'కోసం వచ్చిన సాయి సుస్మిత
- ఆ పరిచయం నేపథ్యంలోనే డీఏఓ పరీక్ష పత్రం విక్రయం
- రూ.10 లక్షలకు కుదిరిన బేరం
- భార్య కోసం ఖరీదు చేసిన ఖమ్మం వ్యాపారి లౌకిక్
- అడ్వాన్స్‌గా రూ.6 లక్షలు ప్రవీణ్ ఖాతాకు బదిలీ


ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజ్ కేసులో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) క్వశ్చన్ పేపర్లతో పాటు డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) ప్రశ్నపత్రాలనూ సూత్రధారి పి.ప్రవీణ్ కుమార్ విక్రయించినట్లు తాజాగా బయటపడింది. ఈ విషయం గుర్తించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శుక్రవారం ఖమ్మం ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు సాయి సుస్మిత, సాయి లౌకిక్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కమిషన్ నిర్వహించిన, నిర్వహించాల్సిన ఆరు పరీక్షలకు సంబంధించి 15 ప్రశ్న పత్రాలు లీకైనట్లు ఇప్పటికే సిట్ అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. వీటిలో గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలకు పంచుకున్నారని, ఏఈ పరీక్షలవి విక్రయించారని, మిగిలినవి ఏ అభ్యర్థుల వద్దకూ వెళ్లలేదని భావించారు. అయితే కమిషన్ కార్యదర్శి అనిత రామ్‌చంద్రన్ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేసిన ప్రవీణ్ కుమార్ బ్యాంకు ఖాతాను విశ్లేషించిన అధికారులు డీఏఓ పరీక్ష పత్రాన్ని కూడా ఇతడు విక్రయించాడని గుర్తించారు. సాయి లౌకిక్ ఖమ్మంలో కార్ల వ్యాపారం చేస్తుండగా, ఈయన భార్య సుస్మిత గతంలో హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేశారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించే గ్రూప్–1, డీఏఓ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న సుస్మిత ఉద్యోగం మాని వీటికోసం సిద్ధమయ్యారు. గతేడాది అక్టోబర్‌లో జరిగిన గ్రూప్–1 ప్రిలిమ్స్ రాసిన ఈమె ఓఎంఆర్ షీట్‌ను రాంగ్ బబ్లింగ్ చేశారు. అంటే నిబంధనలకు విరుద్ధంగా రెండు చోట్ల పెన్నుతో మార్కింగ్ చేశారు. దీంతో ఈమె జవాబు పత్రాన్ని కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదు. ఈ అంశంలో తనకు న్యాయం చేయాలని కోరడానికి సుస్మిత పలుమార్లు టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి వచ్చి, పలువురు అధికారులను కలిశారు. ఇలా కమిషన్ కార్యదర్శి వద్దకు వచ్చిన సందర్భంలోనే ఈమెకు ప్రవీణ్‌తో పరిచయం ఏర్పడింది. మాటల సందర్భంలో తాను డీఏఓ పరీక్షకు సిద్ధమవుతున్నట్లు చెప్పింది.

జవాబులతో కూడిన మాస్టర్ పేపర్‌నే ఇస్తా..

ఫిబ్రవరి మూడో వారంలో డీఏఓ పేపర్ చేజిక్కించుకున్న ప్రవీణ్ ఆమెను సంప్రదించారు. తన వద్ద డీఏఓ పరీక్ష పత్రం ఉందని, రూ.10 లక్షలకు విక్రయిస్తానని చెప్పాడు. దీంతో ఆమె విషయాన్ని తన భర్త లౌకిక్‌కు చెప్పింది. ఇద్దరూ కలిసి ప్రవీణ్‌ను కలిసి బేరసారాలు చేశారు. తాను ఇచ్చేది జవాబులతో కూడిన మాస్టర్ పేపర్ అని చెప్పిన అతగాడు రేటు తగ్గించడానికి ససేమిరా అన్నాడు. దీంతో అడ్వాన్స్‌గా రూ.6 లక్షలు ప్రవీణ్ ఖాతాకు బదిలీ చేసిన లౌకిక్ డీఏఓ ప్రశ్నపత్రం ప్రింటెడ్ కాపీ తీసుకున్నాడు. మిగిలిన రూ.4 లక్షలు ఫలితాలు వెలువడిన తర్వాత ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాడు. ఈ ప్రశ్న పత్రం ఆధారంగానే తర్ఫీదు పొందిన సుస్మిత ఫిబ్రవరి 26న డీఏఓ పరీక్ష రాసింది. నాటకీయ పరిణామాల మధ్య గత నెలలో ఈ పేపర్ల లీకేజ్ వ్యవహారం వెలుగులోకి రావడం, ప్రవీణ్ సహా మొత్తం 15 మంది అరెస్టు కావడం జరిగిపోయాయి. ప్రవీణ్‌ను సిట్ పోలీసులు రెండు సార్లు కస్టడీలోకి తీసుకుని విచారించినా సుస్మిత వ్యవహారం చెప్పలేదు. కేవలం ఏఈ పేపర్లు మాత్రమే విక్రయించానని పదేపదే చెప్తూ సిట్ అధికారులను నమ్మించే ప్రయత్నం చేశాడు.

రూ. 6 లక్షలపై తీగ లాగితే...

అతడి బ్యాంకు ఖాతాలోకి నగదు లావాదేవీలు పరిశీలించిన అధికారులు రూ.6 లక్షలు ఫిబ్రవరి మూడో వారంలో డిపాజిట్ అయినట్లు గుర్తించారు. ఆ నగదు లావాదేవీల వివరాలు చెప్పాలంటూ విచారణ సందర్భంలో ప్రవీణ్‌ను తమదైన శైలిలో అడిగారు. తన కారు ఖమ్మంలోని కార్ల వ్యాపారి లౌకిక్‌కు విక్రయించానని, దానికి సంబంధించిన మొత్తమే అది అంటూ తొలుత నమ్మించే ప్రయత్నం చేశాడు. దీనిపై సందేహాలు వ్యక్తం చేసిన సిట్ లౌకిక్‌కు సంబంధీకులు ఎవరైనా టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారా? అనే అంశంపై దృష్టి పెట్టారు. కమిషన్ నుంచి తీసుకున్న ఆయా పరీక్షల అభ్యర్థుల జాబితాలోని వివరాలను సరి చూశారు. దీంతో లౌకిక్ భార్య సుస్మిత గ్రూప్–1తో పాటు డీఏఓ పరీక్ష రాసినట్లు వెల్లడైంది. దీంతో భార్యాభర్తలను సిట్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. శుక్రవారం ఇరువురినీ అరెస్టు చేసిన సిట్ కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. వీరి నుంచి ఈ పేపర్ ఇంకా ఎవరికైనా చేరిందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ దంపతుల్ని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని సిట్ నిర్ణయించింది.

పీఎంపై సీఎం విమర్శలా?


పార్టీలో చేరినవారితో మర్రి శశిధర్‌రెడ్డి, రఘునందన్, ఈటల, కిషన్‌రెడ్డి, అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- కేసీఆర్ రాజకీయ ఎజెండాతో పనిచేయడం సరికాదు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హితవు
- బీజేపీలో చేరిన దివంగత జస్టిస్ బి.సుభాషణ్‌రెడ్డి కుమారుడు సహా మరికొందరు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ ఎజెండా పెట్టుకొని పనిచేయడం మంచి సంప్రదాయం కాదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హితవు పలికారు. ప్రధాని స్థాయి, పదవికున్న గౌరవాన్ని కూడా మరిచిపోయి సీఎం విమర్శలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ బంగారు తెలంగాణను పక్కకుపెట్టి బంగారు కుటుంబం నిర్మించుకొని దేశంలో తెలంగాణను నవ్వులపాలు చేశారని విమర్శించారు. కుట్రలు చేసి బీజేపీని అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ప్రశ్నించినందుకే తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని నిందించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సమక్షంలో దివంగత జస్టిస్ బి.సుభాషణ్‌రెడ్డి కుమారుడు బి.ఇంద్రసేనారెడ్డితోపాటు నగరానికి చెందిన ఆడం విజయ్‌కుమార్, సోషల్ వర్కర్ కీర్తిరెడ్డి, టీజేఎస్ మాజీ నేత గంగాపురం వెంకటరెడ్డి తదితరులు పార్టీలో చేరారు.

పీఎం వస్తుంటే నిరసనలా..

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని రాష్ట్రానికి వస్తే స్వాగతం పలకాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిరసనలకు దిగడం విచారకరమన్నారు. వ్యాక్సిన్ల కొరత లేదని తెలంగాణ ప్రభుత్వం పెట్టిన ఇండెంట్ త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. తెలంగాణకు అన్యాయం జరుగుతోందని చెప్పడం వాస్తవ విరుద్ధమని, కేంద్రం అంకితభావంతో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, సీనియర్ నేతలు దుగ్యాల ప్రదీప్‌కుమార్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

'హిందీ' లీకేజీపై విచారణ షురూ!

- ఎమ్మెల్యే రాజేందర్ పీఏల స్టేట్‌మెంట్ రికార్డు
- 10న హాజరుకానున్న ఎమ్మెల్యే ఈటల

సాక్షి ప్రతినిధి, వరంగల్: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం కేసులో వరంగల్ కమిషనరేట్ పోలీసులు లోతైన విచారణ చేస్తున్నారు. తమకున్న సమాచారానికి తోడు సాంకేతిక ఆధారాలను జోడించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో ఏ1గా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా, హనుమకొండ కోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులోనే ప్రశ్నపత్రం ఫొటోలు తీసిన బాలుడు జువైనల్ హోమ్‌కి తరలించగా, మరో ముగ్గురు నిందితులు బూర ప్రశాంత్, గుండెబోయిన మహేష్, మౌటం శివ గణేష్ జైలులో ఉన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న పోగుల సుభాష్, పోగు శశాంక్ అలియాస్ రింకు, దూలం శ్రీకాంత్, పెరుమాండ్ల క్రామిక్ అలియాస్ నాని, పోతనబోయిన వర్షిత్ అలియాస్ చందుల కోసం పోలీస్ ప్రత్యేక బృందం గాలిస్తోంది.

ఈటల పీఏల స్టేట్‌మెంట్ రికార్డు: హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పీఏలు నరేందర్, రాజిరెడ్డిలు శుక్రవారం సెంట్రల్ జోన్ డీ సీపీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. డీసీపీ ఎంఏ.బారీ ఆధ్వర్యంలో పోలీసులు వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. హిందీ పేపర్ లీకేజీ, వాట్సాప్ గ్రూపులలో చక్కర్లపై సమాచారం సేకరించారు. అనంతరం ఆ ఇద్దరి సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని పంపించారు. కాగా ఎమ్మెల్యే ఈటల సోమవారం హాజరుకానున్నట్టు చెబుతున్నారు.

మరో 20 మందికి నోటీసులు

పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకయ్యిందన్న సమాచారం మేరకు గత మంగళవారం రోజు సాయంత్రం నుంచి దూకుడు పెంచిన పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఎస్ఎస్‌సీ 2019–20 వాట్సాప్ గ్రూప్‌తోపాటు రెండు మీడియా గ్రూపుల పోస్టింగ్‌ల వివరాలు సేకరించారు. అదేవిధంగా ఈ కేసులో నిందితులు.. నాయకులు, వ్యక్తులకు చేసిన పోస్టింగ్‌ల వివరాలపై కూడా కూపీ లాగారు. కీలక వ్యక్తుల అరెస్టులు పోనూ మొదటగా ఎనిమిది మందికి నోటీసులు ఇచ్చిన పోలీసులు.. శుక్రవారం నాటికి మరో 20 మందికి విచారణకు హాజరుకావాల్సిందిగా తాఖీదులు పంపారు.

త్వరలో రాష్ట్రానికి మరోసారి మోదీ!

- కాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీ శంకుస్థాపనకు రానున్న ప్రధాని
- మరోసారి పర్యటనకు వీలుగా నేటి షెడ్యూల్ నుంచి తొలగింపు

సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలోనే మరోసారి రాష్ట్రానికి వచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాజీపేటలో రైల్వేశాఖ నిర్మించనున్న సరుకు రవాణా వ్యాగన్ తయారీ ఫ్యాక్టరీకి ప్రధాని శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన, వందే భారత్ రైలు ప్రారంభోత్సవం కోసం శనివారం హైదరాబాద్‌కు వస్తున్నారు. వీటితోపాటు కాజీపేట ఫ్యాక్టరీకి కూడా శంకుస్థాపన చేయాల్సి ఉంది. కానీ ప్రధాని మోదీ మరోసారి రాష్ట్ర పర్యటనకు వీలు కల్పించేలా.. ఆ కార్యక్రమాన్ని ప్రస్తుతానికి వాయిదా వేసినట్టు తెలిసింది.

ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కావటంతో..

గతంలో కేంద్రం కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇస్తామన్నా దానిస్థానంలో వ్యాగన్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాపును మంజూరు చేసింది. దీంతో కేంద్రంపై రాజకీయ విమర్శలను ఎక్కుపెట్టడంతో.. వర్క్‌షాపు స్థానంలో వ్యాగన్ తయారీ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అది ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా మారడంతో.. ఇతర కార్యక్రమాలతో కలిపి సింపుల్‌గా శంకుస్థాపన చేయటం సరికాదని కేంద్ర పెద్దలు ఆలోచనకు వచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలోనే విడిగా శంకుస్థాపన చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

వచ్చే నెలలో శంకుస్థాపనకు చాన్స్..

కాజీపేటకు తొలుత మంజూరు చేసిన పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్ అంచనా వ్యయం రూ.269 కోట్లు. అయితే ఇటీవల కేంద్ర బడ్జెట్ ముగిసిన తర్వాత రైల్వేశాఖ.. ఈ వర్క్‌షాప్ ప్రతిపాదనను వ్యాగన్ తయారీ ఫ్యాక్టరీగా మారుస్తూ, అంచనాను రూ.521 కోట్లుగా ప్రకటించింది. రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే భూమిని రైల్వేశాఖకు బదలాయించిన నేపథ్యంలో.. నిర్మాణ పనులకు వీలుగా ఏర్పాట్లను ప్రారంభించింది. వచ్చే నెలలో పనులు ప్రారంభించాలని భావిస్తోంది. ఈ క్రమంలో ప్రధాని మోదీ వచ్చే నెలలోనే రాష్ట్ర పర్యటనకు వచ్చి.. వ్యాగన్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నారని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

రాష్ట్రంలో రాజకీయ అస్థిరతకు బీజేపీ కుట్ర


వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రాజకీయ అస్థిరత సృష్టించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని, రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసేందుకు ఆ పార్టీ నాయకులు మతతత్వ బీజాలు నాటుతున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ పట్ల ఆ పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రానికి జాతీయ రహదారులు, కొత్త జిల్లాల్లో నవోదయ విద్యాలయాల మంజూరు విషయంలో కేంద్రం వివక్షతో వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రానికి మంజూరు చేయాల్సిన 14 జాతీయ రహదారుల గురించి ప్రధాని మోదీ స్పష్టతనివ్వాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణలో కేవలం 9 నవోదయ విద్యా సంస్థలు మాత్రమే ఉన్నాయని, మరో 24 జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని వినోద్ కోరారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీది సంకుచిత మనస్తత్వమని, ప్రొటోకాల్‌ను ఉల్లంఘించింది ఆయనేనని వినోద్ కుమార్ విమర్శించారు. కరోనా నియంత్రణ వ్యాక్సిన్‌ను కనుగొన్న భారత్ బయోటెక్ సంస్థ సందర్శనకు ప్రధాని 2020 నవంబర్ 26న వచ్చిన సమయంలో స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రావద్దని ప్రధాని కార్యాలయం ఖరాఖండిగా చెప్పిందని గుర్తు చేశారు.

మత్స్య సొసైటీల్లో సభ్యత్వానికి ఆధార్ లంకె!

- దీంతో సభ్యత్వం నమోదు చేసుకోలేకపోతున్న అనేకమంది గంగపుత్రులు
- 18 ఏళ్లు నిండిన ప్రతీ మత్స్యకారుడికి సభ్యత్వం ఇవ్వాలన్న ప్రభుత్వం
- ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని అధికారులు
- పట్టణాలకు వలస వెళ్లిన మత్స్యకారుల్లో ఆందోళన
- షరతులు లేకుండా సభ్యత్వం ఇవ్వాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన మత్స్య సహకార సొసైటీల సభ్యత్వ నమోదు కార్యక్రమం వివిధ రకాల కొర్రీలతో కుంటుపడుతోంది. ప్రభుత్వ ఆదేశాలను అధికారులు పట్టించుకోపోవడంతో గంగపుత్రులకు ఇబ్బందిగా మారింది. 18 ఏళ్లు నిండిన ప్రతీ మత్స్యకారుడి సభ్యత్వాన్ని నమోదు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అధికారులు 'ఆధార్'అనే లంకె పెట్టి తుంగలో తొక్కుతున్నారు. సొంత గ్రామంలో ఆధార్ ఉంటేనే మత్స్య సొసైటీల్లో సభ్యత్వం నమోదు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో అనేక మంది మత్స్యకారులు ఈ సొసైటీల్లో సభ్యత్వానికి దూరమవుతున్నారు. ఏప్రిల్ చివరి నాటికి కొత్తగా లక్ష మంది మత్స్యకారులను సభ్యులుగా చేర్చాలని స్వయంగా మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. అయితే అధికారులు ఇవన్నీ పట్టించుకోకుండా ఆధార్ అనే కొర్రీతో మత్స్యకారులను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. గ్రామంలో ఉన్న ఇళ్లు, పట్టాదార్ పాసు పుస్తకం, లేదా మత్స్యకారుల సంఘంలో పేరు ఆధారంగా సహకార సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం కొత్తగా జీవో ఇవ్వాలని, 18 ఏళ్లు నిండిన ప్రతీ మత్స్యకారుడికి ఎలాంటి షరతులు లేకుండా సభ్యత్వాన్ని ఇవ్వాలని కోరుతున్నారు.

గతంలో సొంత ఊళ్లలో పనిలేక పట్టణానికి..

గతంలో అనేక గ్రామాల మత్స్యకారులు ఉన్న ఊరిలో పనిలేక జీవనోపాధి కోసం పట్టణాలకు వలస వచ్చారు. ఆయా పట్టణాల్లోనే ఆధార్ నమోదు చేసుకున్నారు. ఇప్పుడు ఆధార్‌ను గ్రామానికి మార్చుకోవాలని అధికారులు చెబుతున్నారు. దీంతో కొంత మంది మత్స్యకారులు మార్చుకున్నారు. మరి కొంత మంది మార్చుకున్నా.. ఆధార్ అడ్రస్ మారడంలేదు. ఇప్పటికే రెండు మూడు సార్లు అడ్రస్ మార్చుకున్న వారికి మళ్లీ మార్చుకుంటే రిజెక్ట్ అవుతోంది. ఇదేమిటని ఆధార్ సెంటర్ నిర్వాహకులను అడిగే ఎక్కువ సార్లు మార్చుకుంటే రిజెక్ట్ అవుతుందని చెబుతున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోవడంలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పట్టణాల్లో ఉన్న మత్స్యకారులు వివిధ రకాల లోన్లు, గ్యాస్ సిలిండర్‌లు, ఇతర వాటికి చిరునామా ధ్రువీకరణకు ఆధారే ఉండడంతో చాలా మంది ఆధార్‌ను మార్చుకోలేపోతున్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామాల్లో ఏదో ఒక అడ్రస్ ప్రూఫ్‌తో సభ్యత్వాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మత్స్యకారుల డిమాండ్లు ఇలా..

- గ్రామంలో ఆధార్ లేకుంటే సొంత ఇల్లు, ఓటర్ ఐడీ, ఏదైనా అడ్రస్ ప్రూఫ్ ఉంటే సభ్యత్వం నమోదు చేయాలి
- ఆధార్‌కు లంకె పెట్టవద్దు
- ఉదయం సమయంలోనే లైవ్ పరీక్ష పెట్టాలి
- ఏ గ్రామానికి ఆ గ్రామంలోనే పరీక్ష నిర్వహించాలి
- గ్రామ మత్స్యసంఘం, గ్రామ పంచాయతీ నుంచి లెటర్ ఇచ్చినా సభ్యత్వ నమోదు చేయాలి

షరతులు పెట్టవద్దు

సభ్యత్వ నమోదులో ఎలాంటి కొర్రీలు పెట్టొద్దు. ఆధార్ అనేది దేశంలో ఎక్కడైనా ఉండొచ్చు. సొంత గ్రామంలో ఆధార్ ఉండాలనే షరతులు పెట్టవద్దు. ఆంక్షలతో సభ్యత్వం నమోదు చేయకుంటే దీనిపై పోరాటం చేస్తాం. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పాటించాలి.

– పూస సత్యనారాయణ, తెలంగాణ గంగపుత్ర చైతన్య సమితి చైర్మన్

క్లుప్తంగా...

‘ఒబాన్’ దొరికింది



షియోపూర్: మధ్యప్రదేశ్ రాష్ట్రం షియోపూర్‌లోని కునో నేషనల్ పార్క్(కేఎన్‌పీ) నుంచి ఈనెల 2న తప్పించుకుపోయిన మగ చీతా ఒబాన్ ఎట్టకేలకు దొరికింది. పొరుగునే శివ్‌పురి జిల్లా బైరాడ్ ఏరియా అటవీ ప్రాంతంలో ఇది కృష్ణజింకను వేటాడిందని అధికారులు తెలిపారు. దాని జాడలు తెలుసుకుని గురువారం సాయంత్రం పట్టుకుని తిరిగి కేఎన్‌పీలో వదిలిపెట్టినట్లు చెప్పారు. గత ఏడాది నమీబియా నుంచి తీసుకువచ్చిన 8 చీతాల్లో ఒబాన్ ఒకటి.

గర్వించదగిన రోజు

సుధామూర్తి పద్మభూషణ్ స్వీకరించడంపై యూకే ప్రధాని రిషి సునాక్ హర్షం



లండన్: ఇన్ఫోసిస్ సంస్థ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి భార్య, రచయిత, సంఘ సేవకురాలు సుధా నారాయణమూర్తి ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ పురస్కారం స్వీకరించడం పట్ల వారి అల్లుడు, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్, కుమార్తె అక్షతా మూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా సుధా నారాయణమూర్తి పద్మభూషణ్ అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి అక్షతా మూర్తి కూడా హాజరయ్యారు. తన తల్లి అవార్డు అందుకుంటున్న ఫొటోను అక్షతా మూర్తి తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ‘‘భారత రాష్ట్రపతి నుంచి మా అమ్మ పద్మభూషణ్ అవార్డు అందుకుంటున్న క్షణాలను చూసి నేను ఎంతో గర్వించాను. సమాజానికి ఆమె చేసిన సేవలకు గాను ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆమె జీవితం నాకొక ఉదాహరణ. గత 25 ఏళ్లుగా సమాజ సేవలో నిమగ్నమయ్యారు. నా తల్లి కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలు నాకెంతో స్ఫూర్తిని కలిగిస్తున్నాయి’’ అంటూ అక్షతా మూర్తి తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. ఈ పోస్టుపై ఆమె భర్త రిషి సునాక్ స్పందించారు. ‘‘గర్వించదగిన రోజు’’ అంటూ కామెంట్ చేశారు.



దగ్గరవుతున్న సౌదీ అరేబియా, ఇరాన్

- చైనా మధ్యవర్తిత్వం
- మధ్య ప్రాచ్యంపై పట్టుకు యత్నం
- అమెరికా పెత్తనాన్ని అడ్డుకునేందుకే

విద్వేష గీతం

వరుస మారింది

బద్ధ విరోధులైన సౌదీ అరేబియా, ఇరాన్ క్రమంగా దగ్గరవుతున్నాయి. దశాబ్దాల వైరానికి తెర దించే దిశగా సాగుతున్నాయి. దౌత్య బంధాలను పునరుద్ధరించుకోవడంతో పాటు ఆర్థిక సంబంధాలను కూడా బలోపేతం చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చాయి. మధ్య ప్రాచ్యంపై పట్టు పెంచుకునే యత్నాల్లో భాగంగా ఈ సయోధ్యకు చైనా మధ్యవర్తిత్వం వహిస్తోంది. అంతర్జాతీయంగా అత్యంత ఆసక్తి రేపుతున్న ఈ పరిణామాన్ని చైనాకు కీలక దౌత్య విజయంగా భావిస్తున్నారు. రెండు శత్రు దేశాల మధ్య సయోధ్య యత్నాల్లో డ్రాగన్ దేశం నేరుగా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాపై అమెరికా పెత్తనానికి బీటలు వారుతున్నట్టేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది...

పశ్చిమాసియాలో చిరకాల ప్రత్యర్థులైన సౌదీ అరేబియా, ఇరాన్ మధ్య మొగ్గతొడుగుతున్న కొత్త దోస్తీ ఒక రకంగా అనూహ్యమే. ఇది ప్రపంచ దేశాలను కాస్త ఆశ్చర్యపరిచింది కూడా. 2016లో షియా మత పెద్దను సౌదీ చంపేయడం, ప్రతిగా ఇరాన్‌లోని ఆ దేశ దౌత్య కార్యాలయాలపై దాడులతో దశాబ్దాల వైరం తారస్థాయికి చేరింది. దౌత్య తదితర సంబంధాలన్నీ తెగిపోయాయి. మారుతున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాలూ దగ్గరయ్యే ప్రయత్నాలు 2021 నుంచీ జరుగుతున్నాయి. చైనా చొరవతో అవి రెండు నెలలుగా ఊపందుకున్నాయి. నెల రోజులుగా బీజింగ్ వేదికగా ఇరు దేశాల మధ్య జరుగుతున్న మంత్రుల స్థాయి భేటీలు సయోధ్యకు గట్టి పునాదులే వేశాయి. విదేశాంగ మంత్రులు హొస్సైన్ అమిరబ్దొల్లాహియాన్ (ఇరాన్), ఫైజల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ (సౌదీ) బీజింగ్‌లో తాజాగా చర్చలు జరిపారు. ఇరు దేశాల్లో పరస్పరం దౌత్య కార్యాలయాలను తిరిగి తెరిచేందుకు అంగీకారానికి వచ్చారు. రెండు దేశాల మధ్య విమాన సర్వీసులతో పాటు వీసా జారీకి అవకాశాలను పరిశీలించనున్నట్టు హొస్సైన్ తెలిపారు. ఈ పరిణామాలు పశ్చిమాసియా ప్రాంతీయ, భౌగోళిక రాజకీయాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపవచ్చంటున్నారు. ‘‘యెమెన్ నుంచి లెబనాన్ దాకా వేర్పాటువాద పోరాటాల్లో చెరో వైపుండి ఇరాన్–సౌదీ చేస్తున్న ప్రచ్ఛన్న యుద్ధానికి తెర పడుతుంది. ఇది పశ్చిమాసియాలో రాజకీయ స్థిరత్వానికి దారి తీయవచ్చు’’అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇదంతా సౌదీ–ఇరాన్ బంధం ఏ మేరకు గట్టిపడుతుందనే దానిపై ఆధారపడి ఉంటుందన్నది వారి అభిప్రాయం.

దశాబ్దాల వైరం

సౌదీ అరేబియా, ఇరాన్ వైరం ఈనాటిది కాదు. 1979 విప్లవంతో ఇరాన్‌లో రాచరికానికి తెర పడి మతవాద శక్తుల ఆధిపత్యంతో కూడిన ప్రభుత్వం ఏర్పడటంతో అది మరింత ముదిరింది.

- ఇరాన్ ప్రధానంగా షియా ఆధిపత్య దేశం కాగా సౌదీ అరేబియా సున్నీ ప్రాబల్య దేశం.
- ప్రాంతీయంగా ఆధిపత్య కాంక్ష తదితరాలు వాటి శత్రుత్వానికి మరింత ఆజ్యం పోశాయి.
- 2016లో ప్రముఖ షియా నేత షేక్ నిమ్ర్ అల్ నిమ్ర్‌ను ఉగ్రవాద ఆరోపణలపై సౌదీ తల నరికి చంపడంతో ఇరాన్ భగ్గుమంది. భారీ మూల్యం తప్పదని హెచ్చరించింది. మధ్య ప్రాచ్యంలోని పలు దేశాల్లో సౌదీ వ్యతిరేక పోరాట గ్రూపులకు బాసటగా నిలవసాగింది.
- ఇరాక్, సిరియా, యెమన్, లెబనాన్ వంటి పలు దేశాల్లో జరుగుతున్న అంతర్యుద్ధాల్లో సౌదీ, ఇరాన్ చెరో వర్గం వైపు నిలిచి ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నాయి. సిరియాలో రెబెల్ గ్రూపులకు సౌదీ మద్దతిస్తుండగా అధ్యక్షుడు అల్ బషర్‌కు ఇరాన్ దన్నుగా నిలిచింది.
- సరిహద్దు దేశమైన యెమన్‌లో తాము అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న హౌతీ తిరుగుబాటుదారులకు ఇరాన్ సాయుధ, ఆర్థిక సాయం చేస్తోందని సౌదీ గుర్రుగా ఉంది.
- 2003లో అమెరికా ఇరాక్‌పై దాడి చేసి సద్దాం హుస్సేన్‌ను గద్దె దించడంతో అక్కడ సున్నీల ఆధిపత్యానికి తెర పడింది. అప్పటినుంచీ ఇరాక్‌లోని షియా ప్రాబల్య ప్రభుత్వంపైనా ఇరాన్ పట్టు పెరిగింది. తాజా చర్చల అనంతరం యెమెన్‌లోని హౌతీలకు సాయాన్ని నిలిపేసేందుకు ఇరాన్ అంగీకరించిందని సమాచారం.
- పశ్చిమాసియాలో ఇటీవల మార్పు పవనాలు వీస్తున్నాయి. వైరి దేశాలు స్పర్ధలను పక్కన పెట్టి ఒక్కటవుతున్నాయి. అరబ్ దేశమైన యూఏఈ 2020లో ఇజ్రాయెల్‌తో సంబంధాలను మెరుగుపరుచుకునే దిశగా ముందడుగు వేసింది.

చైనా.. పశ్చిమాసియాలో పవర్ బ్రోకర్


అమెరికా స్థానంలో పశ్చిమాసియాలో పెద్దన్న పాత్రను పోషించేందుకు చైనా కొన్నేళ్లుగా గట్టి ప్రయత్నాలే చేస్తోంది.

- 2015లో ఇరాన్ అణు ఒప్పందం వంటి బహుపాక్షిక శాంతి చర్చల్లో చైనా చురుగ్గా పాల్గొంది. తొలుత అమెరికా కూడా భాగస్వామిగా ఉన్నా 2018లో ఉన్నట్టుండి వైదొలగింది.
- చైనా ప్రపంచంలో అతి పెద్ద చమురు దిగుమతిదారు. అందుకే చమురు నిల్వలు బాగా ఉన్న పశ్చిమాసియాపై పట్టు కోసం ప్రయత్నిస్తోంది.
- అటు ఇరాన్‌తో, ఇటు సౌదీ అరేబియాతో చైనాకు ముందునుంచీ మంచి సంబంధాలే ఉన్నాయి. మరోవైపు ఇరాన్, అమెరికా మధ్య ముందునుంచీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి! సౌదీతో కూడా అమెరికా సంబంధాలు కొంతకాలంగా క్షీణిస్తున్నాయి. ముఖ్యంగా బైడెన్ హయాంలో అవి మరీ దిగజారాయి.
- పొరుగునున్న యెమెన్‌లోని హౌతీ మూకలతో చిరకాల పోరాటంతో అలసిన సౌదీ శాంతి మంత్రం జపిస్తోంది. అమెరికా ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఇరాన్ కూడా ఆర్థికంగా ఊపిరి పీల్చుకునే అవకాశాల కోసం చూస్తోంది. ఈ పరిస్థితులు చైనాకు కలసి వచ్చాయి.
- చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ గత డిసెంబర్‌లో రియాద్ వెళ్లి సౌదీ–ఇరాన్ నాయకత్వంతో మంతనాలు జరిపారు. తర్వాత ఫిబ్రవరిలో ఇరాన్ అధ్యక్షునితో బీజింగ్‌లోనూ చర్చలు జరిపి ఇరు దేశాల చర్చలకు రంగం సిద్ధం చేశారు.
- మధ్య ప్రాచ్యంతో అమెరికా వర్తకమూ క్రమంగా క్షీణిస్తోంది. 2019లో 120 బిలియన్ డాలర్ల నుంచి 2021లో 80 బిలియన్ డాలర్లకు తగ్గింది.
- మరోవైపు మధ్య ప్రాచ్య దేశాలతో వాణిజ్య సంబంధాలను చైనా నానాటికీ పెంచుకుంటూ దూకుడు ప్రదర్శిస్తోంది. ఈజిప్ట్, ఇరాన్, జోర్డాన్, కువైట్, సౌదీ అరేబియా, యూఏఈలకు అతి పెద్ద వ్యాపార భాగస్వామిగా చైనా అవతరించింది.

-సాక్షి, నేషనల్ డెస్క్

టైమ్ 100 అగ్రస్థానంలో బాలీవుడ్ బాద్‌షా

- లియోనల్ మెస్సీ, హ్యారీ–మేఘన్‌లను మించి ఓట్లు
- పోలైన 12 లక్షల ఓట్లలో 4% ఓట్లు షారుఖ్ ఖాన్‌కే
- వెల్లడించిన టైమ్ మ్యాగజీన్



న్యూఢిల్లీ: ‘పఠాన్’సినిమాతో మాంచి ఊపుమీదున్న బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్(57)కు ఓ అరుదైన గౌరవం దక్కింది. టైమ్ మ్యాగజీన్ 2023 సంవత్సరానికి నిర్వహించిన ప్రభావశీల వ్యక్తుల జాబితా 100లో అత్యధిక ఓట్లతో ఆయన అగ్రస్థానంలో నిలిచారు. ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ, ప్రిన్స్ హ్యారీ–మేఘన్ దంపతులు, ఆస్కార్ విజేత మిచెల్ యియోహ్, మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌లకు మించి ఆయనకు ఓట్లు పడ్డాయని టైమ్ మ్యాగజీన్ తెలిపింది. ఈ ఏడాది ప్రభావశీల వ్యక్తుల జాబితాలో అర్హులుగా ఎవరుండాలని అను కుంటున్నారన్న ప్రశ్నకు ప్రపంచవ్యాప్తంగా అనేక మంది స్పందించారని పేర్కొంది. మొత్తం 12 లక్షల ఓట్లలో ‘పఠాన్’స్టార్‌కు 4%పైగా ఓట్లు పోలయ్యాయని వెల్లడించింది. ఈ నెల 13న తమ ఎడిటర్స్ టాప్100 జాబితాపై అభిప్రాయాలను వెల్లడించాక అంతిమ ఫలితాన్ని ప్రకటిస్తామని తెలిపింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత లీడ్ రోల్‌లో షారుఖ్ నటించిన పఠాన్ సినిమా జనవరిలో ప్రపంచవ్యాప్తంగా విడుదలై పెద్ద హిట్టయ్యింది. ఇప్పటి వరకు వెయ్యి కోట్లకు పైగా వసూలు చేసింది. టాప్ 100 రెండో స్థానంలో కఠిన ఇస్లామిక్ పాలన నుంచి స్వేచ్ఛ కావాలని ఉద్యమిస్తున్న ఇరాన్ మహిళలకు 3 శాతం ఓట్లు పోలయ్యాయి. టైమ్ 2022 జాబితాలోనూ హీరోస్ ఆఫ్ ది ఇయర్‌ను ఇరాన్ మహిళలే గెలుచుకోవడం గమనార్హం. ఆ తర్వాత బ్రిటన్ ప్రిన్స్ హ్యారీ, మేఘన్ మార్కెల్ దంపతులు 1.9% ఓట్లతో వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో నిలిచారు. గత ఏడాది ఖతార్‌లో జరిగిన ప్రపంచ కప్ ఫుట్‌బాల్ మ్యాచ్ ఫైనల్‌లో ఫ్రాన్స్‌పై అర్జెంటీనాకు చారిత్రక విజయం సాధించి పెట్టిన లియోనల్ మెస్సీ 1.8% ఓట్లతో ఐదో స్థానంలో నిలిచారు. ఆ తర్వాతి స్థానాల్లో నిలిచిన ప్రముఖుల్లో ఈ ఏడాది ఆస్కార్ ఉత్తమ నటి విజేత యియోహ్, టెన్నిస్ క్రీడాకారిణి సెరీనా విలియమ్స్, జుకర్‌బర్గ్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా ఉన్నారని టైమ్ మేగజీన్ తెలిపింది.

జోడో యాత్రతో కొత్త జాతీయ ఒరవడి

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ ఒక బలమైన నూతన జాతీయ ఒరవడిని సృష్టించారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్వీట్ చేశారు. దేశంలో నానాటికీ పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలు, ద్రవ్యోల్బణం పెరుగుదలను యాత్ర సందర్భంగా రాహుల్ ప్రముఖంగా లేవనెత్తారని గుర్తుచేశారు. 2013తో పోలిస్తే 2023లో నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోయానని వెల్లడించారు. గత పదేళ్లలో ఇంటి బడ్జెట్ తీవ్రంగా ప్రభావితమైందని తెలిపారు. ఈ మేరకు పట్టికను ట్విట్టర్‌లో షేర్ చేశారు. ఈ పట్టికను గమనించాలని ప్రజలను కోరారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను, నిర్వాకాలను రాహుల్ గాంధీ ప్రజల్లోకి తీసుకెళ్లడంతో అధికార బీజేపీ బెంబేలెత్తిపోతోందని వెల్లడించారు. అందుకే రాహుల్‌పై బురద చల్లుతోందని జైరామ్ రమేశ్ మండిపడ్డారు. రాహుల్ సృష్టించిన నూతన ఒరవడి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ కుతంత్రాలు పన్నుతోందని ఆరోపించారు.

కూలిన జపాన్ ఆర్మీ హెలికాప్టర్..10 మంది గల్లంతు

టోక్యో: జపాన్ దక్షిణ దీవుల్లో కుమమోటో నుంచి నిఘా విధుల్లో భాగంగా గురువారం బయలుదేరిన బ్లాక్‌హాక్ రకం హెలికాప్టర్ 10 నిమిషాల అనంతరం రాడార్ నుంచి అదృశ్యమైంది. అది మియాకో, ఇరాబు మధ్య సముద్రజలాల్లో కూలి ఉంటుందని భావిస్తున్నారు. ఆ హెలికాప్టర్‌కు చెందిన లైఫ్‌బోట్‌ను, ఒక తలుపు, తదితర భాగాలను శుక్రవారం సహాయక సిబ్బంది కనుగొన్నారు. హెలికాప్టర్‌లోని డివిజన్ కమాండర్ సహా 10 మంది సిబ్బంది కోసం గాలింపు కొనసాగుతోంది. వీరిలో ఎవరూ ప్రాణాలతో ఉండేందుకు అవకాశం లేదంటూ జపాన్ రక్షణ మంత్రి యసుకాజు హమదా శుక్రవారం మీడియా సమావేశంలో కన్నీటి పర్యంతమయ్యారు. వారికోసం గాలింపు కొనసాగిస్తామన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని చెప్పారు. నష్టాన్ని అంచనా వేసే పనిలో నిమగ్నమైనట్లు చెప్పారు. చైనా నుంచి ఎదురవుతున్న భద్రతా పరమైన సవాళ్ల నేపథ్యంలో జపాన్ ప్రభుత్వం ఇటీవలి కాలంలో రక్షణ సన్నద్ధత కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే హెలికాప్టర్ ప్రమాదానికి గురికావడం గమనార్హం.

కరోనాతో జాగ్రత్త

నిర్ధారణ పరీక్షలు, వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలి

- నియంత్రణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ
- రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులతో సమీక్ష

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కోవిడ్‌–19 మహమ్మారి వ్యాప్తి మళ్లీ వేగంగా పెరిగిపోతుండడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ శుక్రవారం రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, అదనపు ముఖ్య కార్యదర్శులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. తాజా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలన్నీ అప్రమత్తంగా వ్యవహరించాలని, కోవిడ్‌–19 మేనేజ్‌మెంట్ కోసం సన్నద్ధం కావాలని సూచించారు. కరోనా లక్షణాలు ఎక్కడ అధికంగా వ్యాప్తిలో ఉన్నాయో ఎప్పటికప్పుడు గుర్తించాలని చెప్పారు. ఎమర్జెన్సీ హాట్‌స్పాట్లలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలతోపాటు వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన నమూనాల జినోమ్ సీక్వెన్సింగ్‌ను పెంచాలని కోరారు. కోవిడ్‌–19 వ్యాప్తి, నియంత్రణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. ప్రజా చైతన్యం ద్వారానే వైరస్ నియంత్రణ సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

కేంద్రం, రాష్ట్రాలు కలిసి పని చేయాలి

గతంలో కరోనా వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేశాయని, చక్కని ఫలితాలు సాధించాయని మాండవీయ గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అదే తరహాలో సమన్వయంతో పనిచేయాలన్నారు. పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆరోగ్య శాఖ సన్నద్ధతపై ఈ నెల 8, 9న జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించాలని రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులకు పిలుపునిచ్చారు. 10, 11న ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలపై మాక్‌డ్రిల్స్ నిర్వహించాలన్నారు. కొత్త వేరియంట్లతో సంబంధం లేకుండా వైరస్ నియంత్రణకు ఐదు అంచెల వ్యూహాన్ని అమలు చేయాలని వివరించారు. టెస్ట్‌–ట్రాక్‌–ట్రీట్‌–వ్యాక్సినేట్‌తో పాటు కోవిడ్‌–19 నియంత్రణ చర్యల పటిష్ట అమలుతో సత్ఫలితాలు లభిస్తాయని వెల్లడించారు. అర్హులైన వారందరికీ కరోనా టీకాలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారిపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. కోవిడ్‌–19 బాధితులకు ఆసుపత్రుల్లో సరిపడా పడకలు సిద్ధంగా ఉండేలా, ఔషధాలు లభ్యమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమీక్షా సమావేశంలో పుదుచ్చేరి సీఎం ఎన్.రంగస్వామి, తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావుతోపాటు వివిధ రాష్ట్రాల ఆరోగ్య మంత్రులు పాల్గొన్నారు.



6 వేల మార్కు దాటిన కోవిడ్ కేసులు

దేశంలో కరోనా కేసులు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా శుక్రవారం 203 రోజుల తర్వాత 24 గంటల వ్యవధిలో కొత్తగా 6,050 కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో యాక్టివ్ కేసులు 28,303కు చేరుకున్నట్లు శుక్రవారం కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. గత ఏడాది సెప్టెంబర్ 16న 6,298 కేసులు వెలుగులోకి వచ్చినట్లు పేర్కొంది. మొత్తం కేసులు 4.47 కోట్లకు చేరాయి. దీంతోపాటు, మరో 14 మరణాలు నమోదు కావడంతో మొత్తం మరణాలు 5,30,943కు చేరాయి. రోజువారీ పాజిటివిటీ రేట్ 3.39%కాగా, మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసులు 0.06%గా ఉంది.

ప్రతి 10 లక్షల జనాభాకు 100 టెస్టులు

ఎక్స్‌బీబీ.1.5తోపాటు బీక్యూ.1, బీఏ.2.75, సీహెచ్.1.1, ఎక్స్‌బీబీ, ఎక్స్‌బీఎఫ్, ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) నిశితంగా పరిశీలిస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఒమిక్రాన్, దాని ఉప వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని వెల్లడించింది. ఇతర వేరియంట్ల ప్రభావం బాగా తగ్గిందని పేర్కొంది. ఎక్స్‌బీబీ.1.16 అనే వేరియంట్ వ్యాప్తి ఫిబ్రవరిలో 21.6 శాతం ఉండగా, మార్చిలో 35.8 శాతానికి చేరిందని వివరించింది. అయితే, వైరస్ వ్యాప్తి పెరిగినప్పటికీ ఆసుపత్రుల్లో చేరికలు, మరణాలు పెద్దగా నమోదు కాలేదని స్పష్టం చేసింది. దేశంలో ప్రతి 10 లక్షల జనాభాకు నిత్యం సగటున 100 కరోనా నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలియజేసింది. నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలని కోరింది. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, హరియాణాలో కరోనా వైరస్ వ్యాప్తి అధికంగా ఉన్నట్లు పేర్కొంది.

క్రైస్తవ మిషనరీల కంటే హిందూ ఆధ్యాత్మిక సంస్థల సేవలు అపారం

ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్



జైపూర్: దక్షిణ భారతదేశంలో క్రైస్తవ మిషనరీల కంటే హిందూ ఆధ్యాత్మిక సంస్థలే ప్రజలకు ఎక్కువ సేవలు అందిస్తున్నాయని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) సర్‌సంఘ్ చాలక్ మోహన్ భగవత్ చెప్పారు. మిషనరీలతో పోలిస్తే హిందూ ఆధ్యాత్మిక గురువులు సమాజ సేవలో ఎన్నో రెట్లు ముందంజలో ఉంటున్నారని ప్రశంసించారు. అయితే, ఇది పోటీకి సంబంధించిన విషయం కాదని అన్నారు. రాజస్తాన్ రాజధాని జైపూర్ సమీపంలోని జామ్‌డోలీలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ అయిన కేశవ్ విద్యాపీఠ్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ సేవ సంగమ్ సదస్సును మోహన్ భగవత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజ సేవ గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా మన దేశంలో మేధావులు క్రైస్తవ మిషనరీల గురించి మాట్లాడుతుంటారని చెప్పారు. మిషనరీలు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో విద్యాసంస్థలను, ఆసుపత్రులను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు తమ వంతు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. కానీ, దక్షిణ భారతదేశంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలు మాట్లాడే హిందూ మత గురువులు, ఆచార్యులు, సన్యాసులు అంతకంటే ఎన్నోరెట్లు ఎక్కువ సేవలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. సేవ అంటే సేవ మాత్రమేనని, ఇది పోటీ కాదని వివరించారు. నిస్వార్థంగా ప్రజలకు అందించే సేవలను కొలవలేమని వ్యాఖ్యానించారు. సేవ అనేది సహజ మానవత్వ వ్యక్తీకరణ అని మోహన్ భగవత్ తెలియజేశారు. మనమంతా సమాజంలో భాగమేనని, ఐక్యంగా లేకపోతే మనం పరిపూర్ణం కాదని తేల్చిచెప్పారు. సమాజంలో అసమానతలు ఎంత మాత్రం వాంఛనీయం కాదన్నారు. దురదృష్టవశాత్తూ అసమానతలు కొనసాగుతున్నాయని వివరించారు. సేవ అనేది ఆరోగ్యకరమైన మనుషులను, ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందిస్తుందని చెప్పారు.

ప్రమాదం వారసత్వ రాజకీయాలకే.. ప్రజాస్వామ్యానికి కాదు!: అమిత్ షా



కౌశాంబి: వారసత్వ రాజకీయాలు, కులవాదానికే ప్రమాదం తప్ప దేశ ప్రజాస్వామ్యానికి ఎటువంటి ప్రమాదం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. కులతత్వం, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు అనే మూడు అల్సర్లతో కాంగ్రెస్ పార్టీ భారత ప్రజాస్వామ్యాన్ని చుట్టుముట్టిందని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీ ఈ మూడింటినీ తొలగించి వేసినందుకే, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు భయపడుతోందని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ యూకేలో ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు బదులిచ్చారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబిలో ‘కౌశాంబి మహోత్సవ్’ను ప్రారంభించి, అనంతరం జరిగిన సభలో అమిత్ షా ప్రసంగించారు. తమ నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటుపడిందనే ఒకే ఒక్క కారణంతో పార్లమెంట్ సమావేశాలను సవ్యంగా సాగనీయని కాంగ్రెస్‌ను దేశం క్షమించదని అమిత్ షా ఆరోపించారు. ఎటువంటి కార్యకలాపాలు, చర్చ లేకుండానే బడ్జెట్ సమావేశాలు ముగియడం పార్లమెంట్ చరిత్రలో ఇదే మొదటిసారన్నారు. గతంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టంలోని నిబంధనల ప్రకారమే రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దయిందని ఆయన చెప్పారు. ఒక్క రాహుల్ గాంధీయే కాదు, ఈ చట్టం కింద ఇప్పటి వరకు 17 మంది ఎమ్మెల్యేలు, ఎంపీల సభ్యత్వాలు రద్దయ్యాయన్నారు. చట్టానికి లోబడి నడుచుకుని, హైకోర్టులో అనర్హత వేటు నుంచి బయటపడాలని రాహుల్‌కు సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల సమగ్ర సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రధాని మోదీని 2024 ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు.

సర్కారు బడి కూల్చివేతకు బీజేపీ యత్నాలు: ఆప్

న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్‌లో కొత్తగా నిర్మించే పార్టీ కేంద్ర కార్యాలయం కోసం బీజేపీ ప్రభుత్వ పాఠశాలను కబ్జా చేస్తోందని ఆప్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఆరోపించారు. పార్టీ కార్యాలయాన్ని అనుకుని ఉన్న పాఠశాల స్థలాన్ని ఇప్పటికే కొంత ఆక్రమించిన బీజేపీ..ఇప్పుడు అభివృద్ధి పేరుతో భవనాన్ని సైతం కూలగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆప్ అలా జరగనీయబోదని సంజయ్ సింగ్ స్పష్టం చేశారు. స్కూలు భవనాన్ని కూలగొడితే 350 మంది పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని చెప్పారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు ఒక్క స్కూల్‌ను కూడా ధ్వంసం కానివ్వమన్నారు.

పేద ఖైదీలకు ఆర్థిక భరోసా

న్యూఢిల్లీ: జరిమానా సొమ్ము గానీ, బెయిల్ రుసుము గానీ చెల్లించే స్తోమత లేక జైళ్లలో మగ్గిపోతున్న ఖైదీలకు ఆర్థిక భరోసా కల్పించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. దీనివల్ల అర్హులైన ఖైదీలకు జైళ్ల నుంచి విముక్తి లభించనుంది. జైళ్లపై భారం తగ్గనుంది. కొత్త పథకంతో నిమ్న కులాలు, పేద కుటుంబాలు, బలహీన వర్గాలకు చెందిన ఖైదీలకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర హోంశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. వారికి ఆర్థిక భరోసా కల్పించే పథకంపై భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొంది. ఆధునిక టెక్నాలజీ సాయంతో పథకాన్ని పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేసింది. ఇందులో భాగంగా ఈ–ప్రిజన్స్ వేదిక ఏర్పాటు, జిల్లా న్యాయ సేవా సంస్థలను బలోపేతం చేస్తామంది.

దక్షిణ లెబనాన్, గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు



గాజా స్ట్రిప్‌లో ఎగిసిపడుతున్న మంటలు

జెరూసలేం: దక్షిణ లెబనాన్‌తో పాటు పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడింది. ఆయా ప్రాంతాల్లోని హమాస్ ఉగ్రవాద శిబిరాలపై శుక్రవారం తెల్లవారుజామున వైమానిక దాడులు నిర్వహించింది. బాంబుల వర్షం కురిపించింది. దీంతో పాలస్తీనా, ఇజ్రాయెల్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో యూదులు పాస్‌ఓవర్ అనే వేడుకలు జరుపుకుంటున్నారు. మరోవైపు ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. గురువారం దక్షిణ లెబనాన్ భూభాగం నుంచి ఉగ్రవాదులు ఇజ్రాయెల్ వైపు 30కిపైగా రాకెట్లు ప్రయోగించారు. ఈ ఘటనలో ఇజ్రాయెల్‌లో ఇద్దరు గాయపడ్డారు. స్వల్పంగా ఆస్తి నష్టం వాటిల్లింది. రాకెట్ల ప్రయోగానికి ప్రతీకార చర్యగా ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లో పాతుకుపోయిన పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్ శిబిరాలే లక్ష్యంగా వైమానిక దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. యుద్ధ విమానాల ద్వారా ఇజ్రాయెల్ సైన్యం ప్రయోగించిన క్షిపణులు లెబనాన్‌లో టైర్ సమీపంలోని రషీదియా పాలస్తీనా కాందిశీకుల క్యాంప్ వద్ద నేలను తాకాయని అసోసియేటెడ్ ప్రెస్ ఫొటోగ్రాఫర్ ఒకరు వెల్లడించారు. లెబనాన్‌లోని హిజ్బుల్లా మిలీషియాకు ఇరాన్ అండదండలు అందిస్తోంది. ఇజ్రాయెల్ సైన్యంపై హిజ్బుల్లా మిలీషియా దాడులు చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. అయితే, తాము కేవలం పాలస్తీనా మిలిటెంట్ల శిబిరాలపైనే వైమానిక దాడులు జరిపామని ఇజ్రాయెల్ సైన్యం స్పష్టం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంకులో పాలస్తీనా వాసి ఒకరు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మహిళలు మృతి చెందారు.



శుక్రవారం అసోంలోని కజిరంగ నేషనల్ పార్కులో గజ్ ఉత్సవ్‌–2023 ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



తెలంగాణలో అభివృద్ధి నవ శకం ఆరంభం

రూ.11,300 కోట్లకు పైగా విలువ గల ప్రాజెక్టులతో



రైల్వేలు, రహదారులు మరియు ఆరోగ్య రంగాలకు చెందిన ప్రాజెక్ట్‌ల ప్రారంభోత్సవం, శంకుస్థాపన మరియు జాతికి అంకితం చేసే కార్యక్రమం

ప్రారంభోత్సవం

సికింద్రాబాద్ - తిరుపతి మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్

- తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయ దర్శనానికి సౌకర్యవంతం
- ప్రస్తుతం సరాసరి 12 గంటలతో పోల్చుకుంటే సికింద్రాబాద్ నుండి తిరుపతికి 8 గంటల 30 నిమిషాలలో చేరుకుంటుంది.
- నల్గొండ, గుంటూరు, ఒంగోలు మరియు నెల్లూరులలో ఆగుతుంది.
- వారంలో ఆరు రోజులు
- 160 Kmph గరిష్ఠ వేగాన్ని అందుకునే సామర్థ్యం ఉంది.
- KAVACH (ట్రైన్ కొలైజన్ అవాయిడెన్స్ సిస్టమ్) కలిగి ఉంది.
- 'మేక్ ఇన్ ఇండియా' ప్రాజెక్ట్

&

హైదరాబాద్ - సికింద్రాబాద్ జంట నగరాల రీజియన్‌లోని శివారు ప్రాంతాలకు 13 కొత్త MMTS సర్వీస్‌లు

- సికింద్రాబాద్ – మేడ్చల్ మరియు ఫలక్‌నుమా – ఉమ్దానగర్ శివారు ప్రాంతాలలో మొదటిసారి MMTS కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.
- MMTS సర్వీస్‌ల నెట్‌వర్క్ ప్రస్తుతం గల 48 కి.మీ.ల నుండి 90 కి.మీ.లకు విస్తరించబడింది.
- శివారు ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన విధానం.
- లేడీస్ కోచ్‌లలో ఆన్ బోర్డ్ CCTVలతో సురక్షితంగా ప్రయాణం సాగించవచ్చు.
- ఎక్కువ సామర్థ్యం గల కోచ్‌లు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులు మరియు మహిళలకు సౌకర్యవంతం.

శంకుస్థాపనలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి

- మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్, రూఫ్ ప్లాజా, దివ్యాంగులకు సౌకర్యవంతమైనది, గ్రీన్ బిల్డింగ్

NH-150C లోని అకల్‌కోట్ - కర్నూల్ సెక్షన్‌లో 6-లేన్ యాక్సెస్ కంట్రోల్డ్ హైవే

- సూరత్ మరియు చెన్నై మధ్య దూరం 280 కి.మీ.లు, ప్రయాణ సమయం 06 గంటలు తగ్గుతుంది.

NH-167Nలోని మహబూబ్‌నగర్ - చించోలి సెక్షన్‌లో పేవ్డ్ షోల్డర్స్‌తో 2 లేన్/ 4 లేన్‌కు వెడల్పు చేయుట

- ఆ ప్రాంతం యొక్క సామాజిక–ఆర్థికాభివృద్ధి మెరుగుపడుతుంది.
- పర్యాటకం అభివృద్ధి చెందుతుంది.

NH-167Kలోని కల్వకుర్తి - కొల్లాపూర్ సెక్షన్‌లో పేవ్డ్ షోల్డర్స్‌తో 2 లేన్‌కు వెడల్పు చేయుట

- హైదరాబాద్ నుండి తిరుపతి, నంద్యాల నుండి చెన్నై వరకు 80 కి.మీ. దూరం మరియు ప్రయాణ సమయం తగ్గుతుంది.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 4 లేన్ యాక్సెస్ కంట్రోల్డ్ కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే సెక్షన్ (NH-365BGలోని ఖమ్మం - దేవరపల్లె సెక్షన్) నిర్మాణం

- తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలకు మెరుగైన అనుసంధానత
- హైదరాబాద్ నుండి విశాఖపట్నంకి మెరుగైన అనుసంధానత
- రాజమండ్రి నుండి హైదరాబాద్ మధ్య దూరాన్ని 56 కి.మీ.లు తగ్గిస్తుంది.

NH-161Bలోని నిజాంపేట్ - నారాయణఖేడ్ - బీదర్ సెక్షన్‌లో పేవ్డ్ షోల్డర్స్‌తో 2 లేన్‌కు వెడల్పు చేయుట

- అవాంతరాలు లేని ప్రయాణీకుల రాకపోకలు మరియు వ్యవసాయ ఉత్పత్తులు, తయారీ సరుకుల వేగవంతమైన, చవకైన రవాణా

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బీబీనగర్

- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఎక్సలెన్స్ ఇన్ మెడికల్ కేర్, అకడమిక్స్ & రీసెర్చ్
- తెలంగాణ ప్రజానీకానికి సమగ్రమైన, నాణ్యమైన మరియు సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ సేవలందించేందుకు

జాతికి అంకితం

సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ మధ్య రైల్వే లైన్ విద్యుదీకరణతో డబ్లింగ్ (85 కి.మీ.లు)

- మెరుగైన సరాసరి వేగాన్ని అందుకునేందుకు సికింద్రాబాద్ నుండి చెన్నై మరియు సికింద్రాబాద్ నుండి బెంగళూరు వరకు ఎలక్ట్రిక్ ఇంజిన్ ద్వారా రాకపోకలు.

ప్రారంభకులు

నరేంద్ర మోదీ

ప్రధాన మంత్రి

8 ఏప్రిల్ 2023 | పరేడ్ గ్రౌండ్, సికింద్రాబాద్ | ఉ॥ 11:15 గం॥లు

వీరి సమక్షంలో

తమిళిసై సౌందరరాజన్	కె.చంద్రశేఖర్ రావు	అశ్విని వైష్ణవ్	జి. కిషన్ రెడ్డి
గవర్నర్, తెలంగాణ	ముఖ్యమంత్రి తెలంగాణ	రైల్వేలు, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కేంద్ర మంత్రి	పర్యాటక, సాంస్కృతిక మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి

DD News: కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని డిడి న్యూస్‌లో వీక్షించండి



ఫైర్ వస్తే ఫైటర్ రెడీ!

సాక్షి, హైదరాబాద్: ఏదైనా బహుళ అంతస్తుల భవనంలో మంటలు చెలరేగుతుంటే ఎవరైనా ఏం చేస్తారు? వెంటనే అత్యవసర నంబర్ '101'కు ఫోన్ చేసి ఫలానా చోట అగ్నిప్రమాదం సంభవించిందని చెబుతారు. కానీ ఘటనాస్థలికి ఫైరింజన్లు చేరుకొనేలోగా భవనంలో చిక్కుకున్న వారికి ప్రాణాపాయం క్షణక్షణానికీ పెరుగుతుంటుంది. ఆస్తినష్టమూ అంతకంతకూ ఎక్కువ అవుతూ ఉంటుంది. అయితే ఒకవేళ ప్రమాదం జరిగిన మరుక్షణమే భవనానికి కాపలాగా ఉండే ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందే ఫైర్‌ఫైటర్ల అవతారం ఎత్తగలిగితే ప్రాణ, ఆస్తినష్టాన్ని వీలైనంత మేర తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. సరిగ్గా ఈ ఆలోచనతోనే అగ్నిమాపకశాఖ వినూత్న కార్యాచరణకు శ్రీకారం చుట్టింది.

ఎక్కడికక్కడే ఫైర్ ఫైటర్లు



- ప్రైవేటు వ్యక్తులకు తొలిసారిగా శిక్షణ ఇస్తున్న అగ్నిమాపకశాఖ
- 30 రోజులపాటు ట్రైనింగ్
- అగ్నిమాపకశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొనే అవకాశం

ఫస్ట్ రెస్పాండర్స్ కోసం ప్రత్యేకంగా..

అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ఎంత త్వరగా స్పందిస్తే అంత నష్ట తీవ్రత తగ్గుతుంది. అగ్నిప్రమాద స్థలంలో ఉన్న వారి అప్రమత్తత సైతం ప్రాణాలు కాపాడటంలో, మంటల వ్యాప్తిని నియంత్రించడంలో కీలకం. అలాంటి ఫస్ట్ రెస్పాండర్స్ అయిన వారిని గుర్తించి అగ్నిప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర అగ్నిమాపకశాఖ నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక జీఓను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ప్రైవేటు వ్యక్తులకు 30 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఇప్పటికే మొదటి బ్యాచ్‌లో 29 మందికి శిక్షణ మార్చి 29న ప్రారంభించినట్లు అగ్నిమాపకశాఖ డీజీ వై. నాగిరెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉండే ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, పరిశ్రమలు, నివాస సముదాయాల్లో అందుబాటులో ఉండే వారికి అగ్నిప్రమాదాల నియంత్రణ, ప్రమాద సమయంలో ప్రాణ, ఆస్తినష్టం నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి నేర్పడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని నాగిరెడ్డి వివరించారు.

ఫీజు రూ. 5,000

గతంలో అగ్నిమాపక శాఖ నుంచి ప్రైవేటు వ్యక్తులకు శిక్షణ ఇచ్చేవారు. కానీ అది మూడు రోజులు మాత్రమే ఉండేది. దీనివల్ల పెద్దగా ప్రయోజనం లేకపోవడంతో అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా 30 రోజుల శిక్షణకు అనుమతి తీసుకున్నారు. దాని ప్రకారం వట్టినాగులపల్లిలోని తెలంగాణ రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రైవేటు వ్యక్తులకు శిక్షణ ప్రారంభించారు. 30 రోజులపాటు ఇచ్చే ఈ శిక్షణలో అన్ని రకాల అగ్నిప్రమాదాలు, ప్రమాదాల నియంత్రణలో అనుసరించాల్సిన విధానాలు, నివాసాలు, వ్యాపార సముదాయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాల నిర్వహణ, అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన తదితర అంశాలను వారికి నేర్పుతున్నారు. బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపట్టే బిల్డర్లు, ప్రైవేటు ఆస్పత్రులు, పరిశ్రమలు, ఇతర రెసిడెన్షియల్ సొసైటీలలో ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి ఈ శిక్షణ అందిస్తున్నారు. తమ సిబ్బందికి శిక్షణ ఇప్పించాలనుకొనే ప్రైవేటు సంస్థలు అగ్నిమాపకశాఖ వెబ్‌సైట్‌లో ముందుగా దరఖాస్తు చేసుకుంటే బ్యాచ్‌లవారీగా శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ కోసం ఒక్కో వ్యక్తి నుంచి ఫీజు కింద రూ. 5 వేలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇలా స్పాన్సర్స్ నుంచి తీసుకున్న మొత్తాన్ని శిక్షణ కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.


శిక్షణలో ఓ భాగం

క్లుప్తంగా...

సమస్యలపై మహిళా కాంగ్రెస్ విస్తృత పోరాటాలు

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం
- సీఎం కేసీఆర్, సబిత దిష్టిబొమ్మలు దగ్ధం చేసిన నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృత పోరాటాలు చేయాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నిర్ణయించింది. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు నేతృత్వంలో శుక్రవారం గాంధీ భవన్‌లో జరిగిన మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో రాష్ట్రంలోని మహిళల సమస్యలపై చర్చించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సమన్వయకర్త నీలం పద్మ, పగడాల మంజులతో పాటు పలువురు రాష్ట్ర నాయకురాళ్లు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం టీఎస్‌పీఎస్సీ, టెన్త్ పరీక్ష పేపర్ల లీకేజీలకు నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిల దిష్టిబొమ్మలను గాంధీభవన్ ఎదుట దగ్ధం చేశారు.

మోదీకి కట్టడి.. ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యార్థుల జీవితాలతో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు చెలగాటమాడుతున్నందుకు నిరసనగా శనివారం ప్రధాని నరేంద్ర మోదీని అడ్డుకుంటామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి వెల్లడించారు. తెలంగాణలోని విద్యార్థి, నిరుద్యోగుల పక్షాన పోరాడి జైలుకు వెళ్లి వచ్చిన యూత్‌కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నేతలను శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ తరపున సన్మానించారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో శివసేనారెడ్డి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీకి నిరసనగా రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లను సోమవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని చెప్పారు. లీకేజీలను నిలువరించలేని ప్రభుత్వ అసమర్థతను నిరసిస్తూ ఈ నెల 18న ఇందిరా పార్కు వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ పేపర్ లీకేజీ విషయంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మాట్లాడుతూ ఉద్యోగాలు కోరుతున్న రాష్ట్ర యువతకు న్యాయం చేయాలని పోరాడితే జైళ్లలో పెట్టారని విమర్శించారు.

ప్రభుత్వ జాప్యంతోనే ధాన్యం రైతుకు దుస్థితి

టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్న కారణంగానే క్వింటాలుకు రూ.1,700 చొప్పున అమ్ముకునే దుస్థితి ధాన్యం రైతులకు ఏర్పడిందని టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు వరి పంట ముందుగానే కోతకు వస్తుందనే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకుండాపోయిందని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పంట చేతికి వచ్చిన ప్రాంతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ధాన్యం వర్షానికి తడవకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తరుగు పేరుతో రైతును దోచుకునే విధానాన్ని నిలువరించాలని, తూకం పెట్టగానే పట్టీని కొనుగోలు కేంద్రం వద్ద ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

టీటీడీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తెలుగు దేశం పార్టీ అనుబంధ సంఘాలకు రాష్ట్ర అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో అధ్యక్షుల వివరాలను వెల్లడించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా పొగాకు శ్రీరాంచందర్, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీపతి సతీశ్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా పోలంపల్లి అశోక్, టీఎస్‌ఎన్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్లపల్లి రవీందర్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా ఎం.కె. బోస్‌ను నియమించినట్లు తెలిపారు.

సింగరేణిపై చర్చకు రెడీ.. దమ్ముంటే రండి

బీఆర్‌ఎస్ నేతలకు ఈటల సవాల్


మీడియా సమావేశంలో ఈటల, విశ్వేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సింగరేణి విషయంలో ఏ వేదికపై అయినా చర్చకు తాము సిద్ధమని, బీఆర్‌ఎస్ నేతలకు నిజాయతీ ఉంటే ముందుకు రావాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సవాల్ చేశారు. ప్రధాని మోదీ రూ.11 వేలకోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర పర్యటనకు వస్తుంటే.. సింగరేణిపై బీఆర్‌ఎస్ నేతలు అబద్ధపు ప్రచారానికి దిగారని ఆరోపించారు. ప్రధాని పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ నిరసనలకు పిలుపునివ్వడాన్ని తప్పుపట్టారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు, పార్టీనేతలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, విజయశాంతి, ఏనుగు రవీందర్‌రెడ్డి, అశ్వత్థామరెడ్డి, ఎన్వీ సుభాష్ తదితరులతో కలసి ఈటల మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేతకానితనాన్ని పక్కవారిపైకి నెట్టడం అలవాటుగా మారిందని విమర్శించారు.

ప్రధాని స్పష్టత ఇచ్చినా అదే తీరా?

రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించిన సందర్భంగా సింగరేణి విషయంలో ప్రధాని మోదీ స్పష్టతనిచ్చారని ఈటల చెప్పారు. సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్కువగా 51 శాతం వాటా, కేంద్రానికి తక్కువగా 49 శాతం వాటానే ఉన్నప్పుడు.. కేంద్రం ఎలా నిర్ణయం తీసుకోగలుగుతుందని మోదీ ప్రశ్నించారని గుర్తు చేశారు.

గనుల పాలసీకి బీఆర్‌ఎస్ మద్దతిచ్చి కూడా..

యూపీఏ హయాంలో ఇష్టానుసారం గనుల కేటాయింపుతో రూ.లక్షా 86 వేల కోట్ల నష్టం జరిగిందని కాగ్ రిపోర్ట్ ఇవ్వడం.. 216 గనుల కేటాయింపులను రద్దు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతోనే మోదీ సర్కారు 2015లో గనుల చట్టాన్ని సవరించిందని ఈటల గుర్తు చేశారు. దానికి అప్పుడు బీఆర్‌ఎస్ మద్దతు ఇచ్చిందన్నారు. కొత్త చట్టం ప్రకారమే దేశంలో బొగ్గుగనుల కేటాయింపులు చేస్తున్నా కేంద్రాన్ని తప్పుపట్టడం ఏమిటని ప్రశ్నించారు. అసలు తెలంగాణలోని నాలుగు గనుల కోసం సీఎం కేసీఆర్ ఒక్కసారి కూడా అడగలేదని.. 2019 తర్వాత సింగరేణి గనుల వేలంలో పాల్గొననే లేదని వివరించారు. దీనిపై ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలన్నారు. కాగా.. బీజేపీ నేతల పట్ల బీఆర్‌ఎస్ సర్కార్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి మండిపడ్డారు. సింగరేణిపై ప్రధాని గతంలోనే క్లారిటీ ఇచ్చినా.. కేసీఆర్ మళ్లీ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు.

ఎవరో వాట్సాప్ చేస్తే.. నాకు నోటీసులా: ఈటల

పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ కేసులో పోలీసులు తనకు నోటీసులు ఇవ్వడాన్ని ఈటల రాజేందర్ తప్పుపట్టారు. తాను టెక్నాలజీకి అప్‌డేట్ కాలేదని, మెసేజీలకు రిప్లై కూడా ఇవ్వనని చెప్పారు. ''ఎవరో ఒక వ్యక్తి నాకు వాట్సాప్ చేస్తే.. అది నేను చూడకపోయినా నోటీసులు ఇచ్చారు. ఈ కేసుతో నాకు సంబంధం లేకున్నా నోటీసు ఇవ్వడాన్ని ఖండిస్తున్నా. నాకు చట్టం మీద గౌరవం ఉంది కాబట్టి.. నోటీసులకు వివరణ ఇస్తా..'' అని ఈటల వివరించారు. బీఆర్‌ఎస్ తాటాకు చప్పుళ్లకు తాను భయపడబోనని వ్యాఖ్యానించారు.

సింగరేణి ఏరియాలో బీజేపీ నేతలను తిరగనివ్వం

మీడియా సమావేశంలో ఎర్రబెల్లి, బాల్క సుమన్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

- అదానీకి అప్పగించే కుట్రలను అడ్డుకునేందుకే ధర్నాలు
- బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ నేడు బీఆర్‌ఎస్ ఆందోళన

సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థను ప్రైవేటీకరించబోమని ఓ వైపు చెప్తూనే మరోవైపు కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలానికి పెట్టిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆరోపించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఇక్కడి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. లాభాల్లో ఉన్న సింగరేణిని నిర్వీర్యం చేసి పారిశ్రామికవేత్త అదానీకి అప్పగించాలని కేంద్రం చూస్తోందని, సింగరేణి ప్రైవేటీకరణపై ప్రధాని మోదీ మాట తప్పారని అన్నారు. ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించేలా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురాని పక్షంలో సింగరేణి ఏరియాలో ఆ పార్టీ నేతలను తిరగనివ్వబోమని హెచ్చరించారు. బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ భారత్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేస్తున్నట్లు ప్రకటించారు. పదో తరగతి పరీక్షపత్రాల లీకేజీ వ్యవహారం వెనుక ఢిల్లీ బీజేపీ నేతల హస్తం ఉందని, అందులో తెలంగాణ బీజేపీ నాయకులు కేవలం పాత్రధారులేనని అన్నారు.


మీడియాతో బాల్క సుమన్, మంత్రి ఎర్రబెల్లి

విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ విజయోత్సవ ర్యాలీలా?

పేపర్ లీక్ చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీ విజయోత్సవ ర్యాలీలు ఎందుకు తీస్తుందో చెప్పాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. ఎస్సెస్సీ హిందీ పేపర్ లీకేజీ కేసులో బెయిల్ వచ్చినంత మాత్రాన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ నిర్దోషి కాదని, ఆయన తప్పు చేసినందునే పోలీసులకు ఫోన్ ఇవ్వడం లేదన్నారు. ఎన్ని పాపాలు చేసైనా సరే అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీని బ్రోకర్, జుమ్లా, పేపర్ లీక్ పార్టీ అని అన్నారు.

తెలంగాణపై ఎందుకింత కక్ష?

- కాళేశ్వరం, మిషన్ భగీరథ అవినీతిని ఎందుకు బయటపెట్టడం లేదు?
- ప్రధాని మోదీకి సీఎల్పీ నేత భట్టివిక్రమార్క బహిరంగ లేఖ



జైపూర్: 'రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా పార్లమెంటు సాక్షిగా విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను తొమ్మిదేళ్ల పాలనలో ఎన్ని నెరవేర్చారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. వీటిపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము, ధైర్యం కేంద్ర ప్రభుత్వానికి ఉందా' అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. పార్లమెంటులో తెలంగాణ ప్రజలకు కల్పించిన హక్కులను ఏళ్లుగా ఎందుకు అమలు చేయడం లేదని, తెలంగాణపై ఎందుకింత కక్ష అని నిలదీశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్రకు స్వల్ప విరామం ఇచ్చి మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం దుబ్బపల్లి శిబిరంలో ఆయన బస చేశారు. ఈ నెల 8న రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీనుద్దేశించి రాసిన 30 ప్రశ్నలతో కూడిన బహిరంగ లేఖను విక్రమార్క విడుదల చేశారు. అందులోని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విక్రమార్క శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీని నెలకొల్పాల్సి ఉండగా, దానిని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఏర్పాటు చేశారని విమర్శించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, వెనుకబడ్డ జిల్లాల అభివృద్ధికి పెండింగ్‌లో ఉన్న రూ.450 కోట్లను విడుదల చేయకుండా విస్మరించారని పేర్కొన్నారు. ఒక్క తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదాను ఎందుకు కల్పించలేదో, ఐటీఐఆర్‌ను ఎందుకు రద్దు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

18 కోట్ల ఉద్యోగాలేవీ?

ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇస్తామన్న హామీని ఎందుకు నెరవేర్చలేదని భట్టి ప్రశ్నించారు ఐఐటీ, మెడికల్ కళాశాలలు, గిరిజన యూనివర్సిటీ ఎందుకు ఏర్పాటు చేయలేదో సమాధానం చెప్పిన తర్వాతే ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథలో జరిగిన అవినీతిని బయటపెడతామని ప్రకటించిన కేంద్రం ఎందుకు దర్యాప్తు చేయడం లేదని ప్రశ్నించారు. సింగరేణి సంస్థకు చెందాల్సిన కోల్‌మైన్స్ బీజేపీ కొన్ని, బీఆర్‌ఎస్ కొన్ని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ ప్రజల సంపదను అక్రమంగా దోచుకుంటున్నాయని ఆరోపించారు.

మైనారిటీలను విస్మరించింది

ఇఫ్తార్ విందులో బీఆర్‌ఎస్‌పై ధ్వజమెత్తిన రేవంత్‌రెడ్డి


ఇఫ్తార్ విందులో రేవంత్, షబ్బీర్

దూద్‌బౌలి: మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ హయాంలో చేసినంత అభివృద్ధి ఏ ప్రభుత్వమూ చేయలేదని టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలకు శుక్రవారం కులీకుతుబ్ షా స్టేడియంలో పీసీసీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనారిటీలను విస్మరించిందని ఆరోపించారు. ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రటరీ తారిఖ్ అన్వర్, ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ ఘడీ, నదీమ్ జావీద్, అజహరుద్దీన్, షబ్బీర్ అలీ, పొన్నాల లక్ష్మయ్య, వీహెచ్ పాల్గొన్నారు.

కవిత, కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయం!

జైలు నుంచి విడుదలయ్యాక బండి సంజయ్ వ్యాఖ్యలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సీఎం కేసీఆర్ కుటుంబంలోనే పరీక్ష పేపర్ల లీకు వీరులు, ప్రజలకు తాగించే లిక్కర్ వీరులు ఉన్నారని.. సీఎం కుమార్తె కవిత లిక్కర్ స్కాంలో, డ్రగ్స్ కేసులో కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. టీఎస్‌పీఎస్సీ విషయంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టినందుకే తనపై కక్షగట్టి, పథకం ప్రకారం పదో తరగతి పేపర్ లీకేజీలో అన్యాయంగా అరెస్టు చేశారని ఆరోపించారు. తనపై పీడీ యాక్ట్ పెట్టాలంటున్న మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు ఎంతో మంది మరణాలకు కారణమని.. వాస్తవానికి వారిపైనే పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పదో తరగతి పేపర్ లీక్ కేసులో రిమాండ్ అయిన సంజయ్.. శుక్రవారం ఉదయం 9 గంటలకు కరీంనగర్ జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం జైలు బయట ఆయన మీడియాతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ల లీకేజీతో 30 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్ నాశనమైతుంటే సీఎం కేసీఆర్ స్పందించడం లేదేమని నిలదీశారు. లీకేజీపై త్వరలోనే వరంగల్‌లో భారీఎత్తున నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు.

వారిపైనే కేసులు పెట్టాలి..

మంత్రి హరీశ్‌రావుపై హత్యానేరం కేసు పెట్టాలని సంజయ్ అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మాహుతి చేసుకునేందుకు అగ్గిపెట్టె దొరకని మంత్రి హరీశ్‌రావు అని ఎద్దేవాచేశారు. ఆయన ధోరణితోనే 1,400 మంది బలిదానాలు చేసుకున్నారని పేర్కొన్నారు. అయితే కేటీఆర్‌ను సీఎం చేస్తే ముందు పార్టీ మారే జంప్ జిలానీ హరీశ్‌రావేనని ఎగతాళి చేశారు. రాష్ట్రంలో 27 మంది ఇంటర్ విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్‌పై పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుమార్తె కవిత లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్లడం ఖాయమని.. త్వరలో కేటీఆర్ కూడా డ్రగ్స్ కేసులో అరెస్టు అవుతారని వ్యాఖ్యానించారు.

పోలీసుల తీరు సరికాదు..

కొందరు పోలీసులు పోస్టింగులు, ప్రభుత్వ పెద్దల మెప్పుకోసం పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ''అసలు పదో తరగతి పేపర్‌ను ఎవరో షేర్ చేస్తే నాకేం సంబంధం? ప్రభుత్వం, పోలీసుల చేతగానితనాన్ని మాపై నెడతారా? వరంగల్ పోలీస్ కమిషనర్ సీపీ రంగనాథ్ తన టోపీపై ఉన్న మూడు సింహాలపై ప్రమాణం చేసి నిజాయితీ నిరూపించుకోవాలి. కరీంనగర్, వరంగల్ పోలీసులపై పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తా'' అని పేర్కొన్నారు. తన సెల్‌ఫోన్ ఎక్కడుందో తనకే తెలియదని, టెక్నాలజీలో ఘనులమని చెప్పుకునే పోలీసులు అందులో ఏముందో తెలుసుకోలేరా? అని ప్రశ్నించారు. కమలాపూర్ పేపర్ లీకేజీలో బాలుడిని ఐదేళ్లపాటు డీబార్ చేయడాన్ని సంజయ్ తప్పుబట్టారు. లీకేజీకి బాధ్యులను గుర్తించకుండా అమాయక విద్యార్థి భవిష్యత్‌ను దెబ్బతీయడం సరికాదన్నారు.


జైలు నుంచి బయటకు వస్తున్న ఎంపీ సంజయ్

సంజయ్‌కు అమిత్ షా ఫోన్

జైలు నుంచి విడుదలైన సంజయ్‌కు కేంద్రమంత్రులు అమిత్ షా, స్మృతి ఇరానీ, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, పలువురు సీనియర్ నేతలు ఫోన్ చేసి పరామర్శించారు. పోరాటం ఆపవద్దని.. కేంద్రం, జాతీయ నాయకత్వమంతా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సీఎం సభకు వస్తే గజమాల వేస్తాం

రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాని సభకు సీఎం కేసీఆర్ రావాలని సంజయ్ అన్నారు. కేసీఆర్ వస్తే గజమాల వేసి, శాలువా కప్పి సన్మానం చేస్తామన్నారు. రాకుంటే మాత్రం కేసీఆర్ తెలంగాణ ద్రోహిగా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు.

ఒక్క గింజా వదలం.. నయా పైసా పోనియ్యం

- మిల్లర్ల నుంచి సీఎంఆర్ డెలివరీపై మంత్రి గంగుల స్పష్టీకరణ
- సీఎంఆర్ 90 శాతం రికవరీ... మిగతా 10 శాతాన్ని పూర్తి చేస్తాం
- అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల నుంచి 125 శాతం క్యాష్ రికవరీతో పాటు క్రిమినల్ కేసులు, సీఎంఆర్ నిలిపివేత
- పౌరసరఫరాల శాఖపై ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి గంగుల కమలాకర్

సాక్షి, హైదరాబాద్: కస్టమ్ మిల్లింగ్ కోసం మిల్లర్లకు కేటాయించిన ధాన్యంలో ఒక్క గింజను వదులుకోబోమని, ఒక్క రూపాయిని కూడా ఊరికే పోనివ్వమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ధాన్యం అమ్ముకునే మిల్లర్లను, రేషన్ బియ్యం పక్కదారి పట్టడాన్ని గుర్తించి సమాచారం అందించిన పౌరులకు సైతం రివార్డులు అందజేయడంతోపాటు వారి వివరాల్ని గోప్యంగా ఉంచుతామన్నారు. శుక్రవారం పౌర సరఫరాల శాఖ, సంస్థల అధికారులతో హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సూర్యాపేట, నల్లగొండ, వనపర్తి, మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లోనే అధికంగా మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారని, సీఎంఆర్ అప్పగింతలో కూడా ఈ జిల్లాల్లో డిఫాల్టర్లు అధికంగా ఉన్నారని వెల్లడించారు. ఈ మేరకు ఆయా జిల్లాల్లో పటిష్టమైన టాస్క్‌ఫోర్స్‌ను తక్షణమే ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. మిగతా అన్ని జిల్లాల్లోనూ రిటైర్డ్ పోలీస్, రెవెన్యూ ఉన్నతాధికారులతో కట్టుదిట్టమైన టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.


సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, కమిషనర్ అనిల్‌కుమార్

ఆరు రెట్లు ధాన్యం దిగుబడి.. రెండు రెట్లు మాత్రమే పెరిగిన మిల్లింగ్ కెపాసిటీ

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వ్యవసాయ అభివృద్ధికి చేసిన కృషితో 24 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 141 లక్షల మెట్రిక్ టన్నులకు ధాన్యం సేకరణ పెరిగిందని మంత్రి కమలాకర్ తెలిపారు. ఆరింతలుగా పెరిగిన ఈ ధాన్యం సేకరణకు అనుగుణంగా మిల్లింగ్ కెపాసిటీ పెరగలేదని, కేవలం గతానికి ఇప్పటికి 2 రెట్లు మాత్రమే పెరిగిందన్నారు. అందువల్ల మిల్లర్లకు అదనంగా ధాన్యం కేటాయింపులు చేయడం జరుగుతుందని, ఇదే అదనుగా కొన్ని చోట్ల మిల్లర్లు ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులతోపాటు రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను ప్రయోగించి 125 శాతం నగదు రికవరీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్ల నుంచి 90 శాతం రికవరీ చేశామని, మిగతా పది శాతం సైతం రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రెండు లారీల బియ్యం మిల్లుకు అక్రమంగా తరలిస్తుండగా, విజిలెన్స్ బృందాలు పసిగట్టి పట్టుకున్నాయని చెప్పారు. పెద్దపల్లితో పాటు సూర్యాపేట, ఇతర జిల్లాల్లో జరిగిన బియ్యం అక్రమాలపై కూడా కేసులు బుక్ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

ధాన్యం నిల్వ కోసం ఇంటర్మీడియట్ గోదాంలు

ఈ యాసంగిలో ఇంటర్మీడియట్ గోదాములను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి గంగుల తెలిపారు. సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో ఖాళీగా ఉన్న మిల్లింగ్ కెపాసిటీని వాడుకునేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ డిఫాల్టర్లకు, అక్రమ మిల్లర్లకు ఈసారి ఒక్క గింజను కూడా కేటాయించబోమని చెప్పారు. సమీక్షలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంత్రి గంగులను కలిసిన గెల్లు శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన హుజూరాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 15న ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ఆయన్ను కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని, సీఎం కేసీఆర్ అప్పగించిన బాధ్యతల్ని విజయవంతంగా నిర్వహించి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని గంగుల సూచించారు.

తెలంగాణలో జంగిల్ రాజ్!

పేపర్ లీకేజీ నుంచి దృష్టి మళ్లించేందుకే సంజయ్ అరెస్టు: తరుణ్‌ఛుగ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణలో ఆటవిక పాలన సాగుతోందని, ఇక్కడ జరుగుతున్న అకృత్యాలపై గళమెత్తినవారిని చట్టవ్యతిరేకంగా అరెస్టు చేసి గొంతు నొక్కాలని చూస్తున్నారని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ ఆరోపించారు. శుక్రవారం జైలు నుంచి విడుదలైన బండి సంజయ్‌ను ఆయన పరామర్శించారు. అనంతరం సంజయ్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో అరాచకం రాజ్యమేలుతోందని తరుణ్ ఛుగ్ మండిపడ్డారు. ఇది చంబల్ లోయనా, కరీంనగర్ పట్టణమా? అని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. లీకేజీపై ప్రభుత్వతీరును ఎండగట్టేందుకు వరంగల్‌లో నిరుద్యోగ మార్చ్ చేపడతామన్నారు.


మీడియాతో తరుణ్ ఛుగ్

అది పోలీసుల పనే!

దేశంలోనే అతిపెద్ద పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీగా ఉన్న సంజయ్‌ను ఎలాంటి వారెంట్, ఎఫ్ఐఆర్ లేకుండా అరెస్టు చేయడం ఏమిటని తరుణ్ ఛుగ్ ప్రశ్నించారు. అరెస్టు సమయంలో సంజయ్ ఫోన్ ఆయన దగ్గరే ఉందని, తరలించే సమయంలో దాన్ని పోలీసులు తస్కరించారని ఆరోపించారు. సంజయ్ ఫోన్ డేటా తీయాల్సి వస్తే.. కేటీఆర్ డేటా కూడా తీయాలన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతుందన్నారు. ఆ వ్యవహారంలో ఎవరు ఢిల్లీలో కూర్చుని వ్యవహారాన్ని చక్కబెట్టారో? ఎవరు లిక్కర్ క్వీనో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ క్షీణిస్తోందన్నారు.

సాక్షి కరీంనగర్

శనివారం | 8 | ఏప్రిల్ | 2023



అశేష జనవాహిని నడుమ సాగుతున్న శ్రీసీతారామచంద్రస్వామి రథోత్సవ వేడుక



స్వామివారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



దర్శనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులు

రమణీయం.. రథోత్సవం

ఘనంగా శ్రీ సీతారామచంద్రస్వామి పెద్దరథం పండుగ • తరలివచ్చిన వేలాది భక్తులు

ఇల్లందకుంట: అపరభద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి రథోత్సవ వేడుక శుక్రవారం రమణీయంగా సాగింది. శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చంద్రరథోత్సవం (పెద్దరథం) వైభవంగా ముగిసింది. కిక్కిరిసిన భక్తజన సందోహం మధ్య రథాన్ని తాళ్లతో లాగుతూ ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తుల దర్శనార్థం రథంపై ఉత్స వమూర్తులను ఉంచారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయతో పాటు సుమారు 80వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ జువ్వాజి సురేశ్, ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఇన్‌చార్జి ఈవో ఉడుత వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. సర్పంచ్ కంకణాల శ్రీలత సురేందర్‌రెడ్డి, జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వర్‌రావు, తహసీల్దార్ మాధవి, యుప్‌టీవీ అధినేత పాడి ఉదయానంద రెడ్డి, ఏసీపీ కోట్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ విజయకుమార్, ఎక్కటి సంజీవరెడ్డి, తుమ్మేటి సమ్మిరెడ్డి, కదారి కుమారస్వామి, కందాల కొమురెల్లి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



సందేశం వింటున్న క్రైస్తవులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): గుడ్‌ఫ్రైడేను జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిలకు అధిక సంఖ్యలో హాజరై, ఏసుక్రీస్తు సిలువ మీద పలికిన ఏడుమాటలను ధ్యానించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విశ్వాసులు ఉపవాసంతో ఆరాధించారు. పలువురు పాస్టర్లు సందేశాన్నిచ్చారు. బైబిల్ పఠనాలు, ప్రార్థనలు, ప్రత్యేక గీతాలు ఆలపించి జీసస్ పట్ల భక్తిని ప్రకటించుకున్నారు. అనంతరం ఉపవాస దీక్షలను విరమించారు. దానధర్మాలతో పాటు బహుమతులను పంచారు. సీపీ కార్యాలయం వద్దఉన్న సీఎస్ఐ వెస్లీ కెథడ్రిల్ చర్చ్‌లో పాస్టరేట్ చైర్మన్ శ్రీనివాస్ నాయక్ సందేశాన్ని ఇచ్చారు. దేవదాస్, జాకబ్, విల్సన్, రవిపాల్ పాల్గొన్నారు. క్రిస్టియన్ కాలనీలోని సీఎస్ఐ సెంటినరీ వెస్లిచర్చ్‌లో పాస్టరేట్ చైర్మన్ డాక్టర్ ఎస్‌జాన్ సందేశాన్ని ఇచ్చారు. సి.నారాయణ, ఏ.సంజయ్, కరుణాకర్, మాణిక్యం, జ్యోత్స్న ప్రసాద్, స్వాతికుమార్, రణధీర్, సాల్మన్ రాజు, ప్రవీణ్ సాగర్, జి.కృపాదానం పాల్గొన్నారు. విజయ రఘునందన్ రోడ్‌లోని సెయింట్ మార్క్‌చర్చ్, జ్యోతినగర్‌లోని లూర్ధుమాత చర్చిలో, జగిత్యాలరోడ్‌లోని బేతేలు చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నర్సింగ్ సూపరింటెండెంట్లకు ఉత్తమ సేవా అవార్డులు



అవార్డులు అందుకున్న సూపరింటెండెంట్లు

కరీంనగర్‌టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఐఎంఏ హాల్‌లో ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందిని సన్మానించారు. జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో పనిచేస్తున్న నలుగురు నర్సింగ్ సూపరింటెండెంట్లు అందిస్తున్న ఉత్తమ సేవలను గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేశారు. అవార్డులు అందుకున్న వారిలో నర్సింగ్ సూపరింటెండెంట్లు విజయలక్ష్మి, అంజమ్మ, సులోచన, సరళ ఉన్నారు. వీరికి శాలువాలు, మెమోంటోలు అందించి ఘనంగా సత్కరించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు పాల్గొన్నారు.

ఎస్సై రాత పరీక్ష నేపథ్యంలో 144సెక్షన్

కరీంనగర్‌క్రైం: ఎస్సై అభ్యర్థుల రాత పరీక్ష నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలో ఆదివారం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. ఎస్సై అభ్యర్థుల రాత పరీక్ష జరగనున్న కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో జనం గుమికూడి ఉండారాదని,ధర్నాలు, రాస్తారోకోలు, సమావేశాలు, ఆందోళనలు నిర్వహించకూడదన్నారు.

రేపు 'ఓ ప్రచేతసా' పుస్తకావిష్కరణ

సప్తగిరికాలనీ: సమైక్యసాహితి, తెలంగాణా సాహితీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాకవి సందర్శనం వేణుశ్రీ రాసిన 'ఓ ప్రచేతసా' పుస్తకావిష్కరణ, అంకితోత్సవాన్ని ఆదివారం సాయంత్రం భగత్‌నగర్ భగవతి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు కేఎస్. అనంతాచార్య, బీఎస్ఆర్. శర్మ తెలిపారు. మాడిశెట్టి గోపాల్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, అతిథులుగా వారాల ఆనంద్, డాక్టర్ తంగిరాల చక్రవర్తి, బి.రమణారావు, మాడుగుల రాములు, సీహెచ్. రమణాచార్యులు, డాక్టర్ బీవీఎన్. స్వామి హాజరవుతారని తెలిపారు. బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు డాక్టర్ సంజీవరావుకు పుస్తకం అంకితం చేస్తారని, కూకట్ల తిరుపతి పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఎస్సారార్ కాలేజ్ వైపు ర్యాలీగా సాగుతున్న సంజయ్, బీజేపీ శ్రేణులు, భారీ కాన్వాయ్

ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతా

- కరీంనగర్ పోలీసుల తీరుపై మండిపడ్డ బండి
- కోర్టుకు సైతం ఈడుస్తానని ప్రతిన
- కర్మ జరుగుతున్న ఇంట్లో విధ్వంసం సృష్టించారని ఆక్రోశం
- సంజయ్ విడుదలతో బీజేపీలో ఉత్సాహం
- భారీ ఊరేగింపు, గజమాలలతో సత్కారం
- జైలు పరిసరాల్లో 144వ సెక్షన్



అంబేద్కర్‌కు నివాళి అర్పించిన బండి సంజయ్



గజమాలతో బండి సంజయ్‌కి సత్కారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ క్రైం/ కరీంనగర్‌టౌన్: ఇటీవల మరణించిన తన అత్తమ్మ కర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన తనతో దురుసుగా వ్యవహరించిన కరీంనగర్ పోలీసులను పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతానని ఎంపీ బండి సంజయ్ అన్నారు. పదో తరగతి పేపర్ లీకేజీ కుట్రలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో కరీంనగర్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం బండి సంజయ్ పోలీసులు, ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన అత్తమ్మ మరణిస్తే.. తొమ్మిదవ రోజు (కర్మ) కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన తనని ఎలాంటి నోటీసులు లేకుండా అరెస్టు చేయడంపై మండిపడ్డారు. వారెంట్లు లేకుండా చట్టవిరుద్ధంగా కనీసం పార్లమెంటు సభ్యుడిని అన్న గౌరవం లేకుండా దురుసుగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఇంట్లో తన అత్తమ్మ కార్యక్రమం కోసం తెచ్చిన సామగ్రి, టెంట్లు చిందరవందర చేశారన్నారు. తనను గంటలకొద్దీ జీపుల్లో తిప్పి వరంగల్ పోలీసులకు అప్పగించినందుకు కరీంనగర్ పోలీసులను ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతానన్నారు. వీలుంటే కోర్టుకు కూడా ఈడుస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరీంనగర్‌లో హై అలర్ట్

- బండి సంజయ్ విడుదల నేపథ్యంలో.. కరీంనగర్‌లో హై అలర్ట్ నెలకొంది. పదోతరగతి పేపర్ లీకేజీ కేసులో అరెస్టయిన భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ శుక్రవారం కరీంనగర్ జిల్లా జైలు నుంచి ఉదయం 9.02 గంటలకు విడుదలయ్యారు.
- జైలు పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ అమలు చేయడంతో మీడియా మినహా కార్యకర్తలెవరినీ జైలువద్దకు అనుమతించలేదు. కేవలం నలుగురైదుగురు బీజేపీ ముఖ్య నాయకులు మాత్రమే జైలు వద్దకు చేరుకున్నారు.
- బండి విడుదల సందర్భంగా జైలుకు దారి తీసే రోడ్లన్నీ పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన సంజయ్ మొదటగా మీడియాతో మాట్లాడారు. అనంతరం నేరుగా మహాలక్ష్మి దేవాలయానికి చేరుకొని అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్కడి నుంచి సంజయ్ తన అత్తగారింటికి వెళ్లారు.
- ఇటీవల సంజయ్ అత్తమ్మ చిట్ల వనజ మృతిచెందగా ఆమె ఫొటోకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులతో కొద్దిసేపు మాట్లాడారు. సంజయ్ జైలు నుంచి విడుదలైన విషయం తెలుసుకొని జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు సంజయ్ వద్దకు చేరుకున్నారు.
- జ్యోతినగర్‌లోని సంజయ్ అత్తమ్మ ఇల్లు కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. అక్కడి నుంచి కార్యకర్తలతో కలిసి భారీ ఊరేగింపుగా కోర్టు చౌరస్తాకు చేరుకున్నారు. అప్పటికే సంజయ్ కోర్టు చౌరస్తాకు వస్తారనే విషయం తెలుసుకుని భారీ సంఖ్యలో కార్యకర్తలు చేరుకున్నారు.
- కార్యకర్తల కోలాహలం మధ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడే క్రేన్ ఏర్పాటు చేసిన బీజేపీ శ్రేణులు సంజయ్‌ను భారీ గజమాలతో సత్కరించారు. కోర్టు చౌరస్తా నుంచి రేకుర్తి రాజశ్రీ గార్డెన్ వెళ్లే క్రమంలో భారీ ఊరేగింపుతో సంజయ్ ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు పాదయాత్ర నిర్వహించారు.
- రేకుర్తి చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సైతం పూలమాల వేసి నివాళి అర్పించి, రాజశ్రీగార్డెన్‌కు చేరుకొని కార్యకర్తలతో మాట్లాడారు. సాయంత్రం 3.30 గంటలకు బీజేపీ రాష్ట్ర ఇంచార్జి తరుణ్‌చుగ్ సంజయ్ అత్తమ్మ ఇంటికి చేరుకొని వనజ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అక్కడే 4 గంటలకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
- బండి సంజయ్ జైలు నుంచి ఇంటికి వచ్చిన అనంతరం బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి తరుణ్‌చుగ్ బండికుటుంబ సభ్యులను పరామర్శించారు. సంజయ్ తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా 'మీరు బాధపడాల్సిన పనిలేదు, మీ కొడుకు వారియర్' అని అభివర్ణించారు.
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విడుదల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ డీసీపీలు శ్రీనివాస్, చంద్రమోహన్, ఏసీపీలు తుల శ్రీనివాస్‌రావు, కరుణాకర్‌రావు, విజయ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు గట్టి బందోబస్తు నిర్వహించారు.
- మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, వాసుదేవారెడ్డి, బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, నాయకులు కటుకం లోకేశ్, పుల్లెల పవన్‌కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణపై జంగ్ సైరన్

- ప్రధాని పర్యటన నేపథ్యంలో కోల్‌బెల్ట్ ప్రాంతంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా
- పార్టీ అధిష్టానం ఆదేశాలతో గోదావరిఖనిలో విస్తృత ఏర్పాట్లు
- కోల్‌బెల్టు నేతలకు ఫోన్‌లో దిశానిర్దేశం చేసిన సీఎం

సాక్షి, పెద్దపల్లి: ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో కోల్‌బెల్ట్ ప్రాంతంలో మహాధర్నాకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోంది. సింగరేణి బొగ్గుగనుల వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా కోల్‌బెల్టు ప్రాంతాల్లో 'మహా ధర్నాలతో' జంగ్ సైరన్ మోగించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బొగ్గు గనులకు నిలయమైన గోదావరిఖనిలో శనివారం సింగరేణి కార్మికులు, కార్మికసంఘాల నేతలు, మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, పార్టీ శ్రేణులతో మహాధర్నా నిర్వహించనున్నారు. జెడ్పీ చైర్మన్ పుట్టమధు భూపాలపల్లి జిల్లాలో నిర్వహించే మహాధర్నాలో పాల్గొననున్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ప్రజాక్షేత్రంలో బీజేపీకి గుణపాఠం చెప్పేలా మహాధర్నా విజయవంతం చేసేందుకు శ్రేణులు సమాయత్తం అవుతున్నాయి.

కోల్‌బెల్టు నేతలకు సీఎం ఫోన్..!

సింగరేణి సమస్య కేవలం ఆరు జిల్లాల సమస్య కాదని, తెలంగాణ ఆర్థిక ప్రగతిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే బొగ్గు గనుల వేలంకు కేంద్రం యత్నిస్తుందని ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానం పోరుబాటను ఎంచుకుంది. దీనిలో భాగంగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత గురువారం మహాధర్నాకు సంబంధించి కేటీఆర్ సింగరేణి పరిధిలోని పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో మాట్లాడగా, శనివారం నిర్వహించే నిరసన కార్యక్రమాలపై శుక్రవారం సీఎంవో కార్యాలయం నుంచి సీఎం కేసీఆర్ ఫోన్‌లో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. దీంతో గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశమై మార్గనిర్దేశం చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గోదవరిఖని ప్రధాన చౌరస్తాలో నిర్వహించే మహాధర్నాకు కార్మికులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన



డీఐఈవో రాజ్యలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కరీంనగర్: రెండు దశాబ్దాలకుపైగా చాలీచాలని జీతాలతో లక్షలాదిమంది పేద,మధ్యతరగతి విద్యార్థులకు విద్యనందిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డీఐఈవో కార్యాలయం ఎదుట కాంట్రాక్టు లెక్చరర్లు నిరసన చేపట్టారు. కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జగిత్యాల, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల కాంట్రాక్టు లెక్చరర్లు కరీంనగర్ మూల్యాకన కేంద్రం ఎదుట తమ మనోవేదనను వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగంపల్లి దేవేందర్ మాట్లాడుతూ.. ఏనాటికైనా తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరణ అవుతాయని గంపెడాశతో ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలోని కాంట్రాక్టు లెక్చరర్ల బాధను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం 2016లో జీవో నెంబర్ 16 విడుదల చేసి కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేస్తున్నట్టు ప్రకటించిందని, ఆ ఉత్తర్వులు న్యాయస్థానం పరిధిలోకి వెళ్లడంతో క్రమబద్ధీకరణ తాత్కాలికంగా ఆగిపోయిందన్నారు. చివరకు 2022 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు కాంట్రాక్టు ఉద్యోగులకు సానుకూలమైన తీర్పును ఇవ్వడంతో ఫిబ్రవరి 6న రాష్ట్ర శాసనసభలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్రంలోని 11,103 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు దాటినప్పటికీ క్రమబద్ధీకరణ ఉత్తర్వులు వెలువడకపోవడంతో కాంట్రాక్టు లెక్చరర్లు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3658 మంది కాంట్రాక్టు లెక్చరర్లు రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా బోధన కొనసాగిస్తున్నారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 624 మంది కాంట్రాక్టు లెక్చరర్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్నారన్నారు. అనంతరం డీఐఈవో టి.రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేమిడి మల్లారెడ్డి, సుంకెపాక నాంపల్లి, ప్రేమ్‌కుమార్, సునీల్, పవన్‌కుమార్, వివేకానంద, విక్రమాదిత్య, విజయ్‌కుమార్, సంపత్, శ్రీని వా స్, తిరుపతిరెడ్డి, ఉమాదేవి, జ్యోతి, రచన, సంధ్య, ఉమామహేశ్వరి, జోత్స్న తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పథంలో తిమ్మాపూర్

- 2023 సంవత్సరానికి జాతీయ ఉత్తమ మండలంగా ఎంపిక
- నానాజీ దేశముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న మండలవాసులు, ప్రజాప్రతినిధులు

తిమ్మాపూర్(మానకొండూర్): తిమ్మాపూర్ మండలం అభివృద్ధిపథంలో దూసుకెళ్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో జాతీయస్థాయిలో ఉత్తమ మండలంగా ఎంపికైంది. నేషనల్ పంచాయతీ అవార్డుల్లో భాగంగా శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రకటించింది. ఈనెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందిస్తారు. జాతీయస్థాయిలో తొమ్మిది అంశాల్లో ప్రతిభ కనబరిచినందుకు గానూ తిమ్మాపూర్‌ను ఉత్తమ మండలంగా ఎంపిక చేశారు.

జోరుగా పల్లెప్రగతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో జోరుగా సాగుతోంది. సంపూర్ణ లక్ష్యాలను సాధించినందుకు, జరిగిన అభివృద్ధిని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ లెవెల్ బెస్ట్ మండల్ పంచాయతీ అవార్డును ప్రకటించడం జరిగింది. మహాత్మానగర్, అల్గునూర్, చేపలకాలనీ మీదుగా రాజీవ్ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటికే రాజీవ్‌రహదారి నుంచి మహాత్మనగర్ వరకు రూ.20 కోట్లతో సెంట్రల్‌లైటింగ్ పనులుపూర్తయ్యాయి.

ఆకర్షణగా పర్లపల్లి, నుస్తులాపూర్

తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి, నుస్తులాపూర్ గ్రామాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్లపల్లిలో క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణం, హైదరాబాద్ బంజారాహిల్స్‌ని తలపించే రోడ్లు, రాజభవనంలా పంచాయతీ కార్యాలయం మెరిపిస్తోంది. నుస్తులాపూర్‌లో సెంట్రల్ లైటింగ్, నూతన హంగులతో గ్రామపంచాయతీ కార్యాలయం, వీధివీధినా సీసీ రోడ్లు, గ్రామంలో పేదవారికి ఉచిత దహన సంస్కారాలు నిర్వహించడం అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి.



పర్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం



నుస్తులాపూర్‌లో ఆకర్షణగా సెంట్రల్ లైటింగ్

సమష్టి విజయం



రాష్ట్రంలోనే అభివృద్ధికి కేరాఫ్‌గా తిమ్మాపూర్ నిలుస్తోంది. మండలంలోని 23 గ్రామాల సర్పంచులు అభివృద్ధిలో పోటీ పడుతున్నారు. ఇప్పటికే చాలా గ్రామాలు ఉత్తమ పంచాయతీలుగా జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నాయి. మండలానికి జాతీయస్థాయి అవార్డు వరించడం అందరి సమష్టి విజయం. ఈ అవార్డు సాధనకు కృషిచేసిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కలెక్టర్ కర్ణన్, జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు. – కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డి, ఎంపీపీ తిమ్మాపూర్

క్లుప్తంగా

పూర్వీకుల జీవనశైలే ఆరోగ్యానికి రక్ష..

- మెడికవర్ ఆసుపత్రిలో ఆరోగ్య అవగాహన సదస్సు



కరీంనగర్‌టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో శుక్రవారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఫిజీషియన్లు డాక్టర్ కార్తీక్, డాక్టర్ నాగరాజు హాజరై మాట్లాడారు. ఆధునిక వైద్యంతో ప్రయోజనాలున్నప్పటికీ మన పూర్వీకుల జీవనశైలి ఆరోగ్యానికి రక్షగా నిలుస్తుందన్నారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా ఆరోగ్యసూత్రాలను వివరించారు. మంచి ఆహారం తీసుకోవాలని, బాగా నిద్రపోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సహజసిద్ధమైన ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా జీవించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచిపడి గీత కార్మికుడి మృతి



చొప్పదండి: పట్టణానికి చెందిన బొడిగె భూమయ్య (55) గీత కార్మికుడు శుక్రవారం తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. భూమయ్య గీతవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాడు. రోజులాగే ఉదయం సమ్మక్క, సారలమ్మ గద్దెల సమీపంలోని తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. మోకు జారడంతో కిందపడి తీవ్రగాయాలపాలై మృతిచెందాడు. స్థానికులు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడి కుమారుడు పర్శరాములు ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేంద్ర చారి తెలిపారు. మృతుడి నేత్రాలను చొప్పదండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేకరించి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన నాంపెల్లి అంజయ్య (44) రైతు అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సత్తవ్వ కథనం ప్రకారం.. నెల రోజుల క్రితం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించగా కిడ్నీవాపు వచ్చిందని, నెలరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని మందులు వాడినా తగ్గలేదని తెలిపింది. దీంతో జీవితం విరక్తిచెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందుతాగి పడిపోయాడు, కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించి చికిత్సచేయించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. శుక్రవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులుండగా, ఒకరు డిగ్రీ, మరోకరు ఏడోతరగతి చదువుతున్నారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు చొప్పదండి లయన్స్‌క్లబ్ సభ్యులు మృతుడి నేత్రాలను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.

గండి పూడ్చరు.. చెరువు నింపరు



గండి పడ్డ చెరువు కట్ట



నీరు లేని ఎల్లమ్మ చెరువు

- గంగాధర ఎల్లమ్మ చెరువుకు మరమ్మతు ఎప్పుడు?
- తాగు, సాగు నీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తుల ఆవేదన
- మంగపేటవాసుల దీక్షతో పనులు నిలిపివేసిన అధికారులు

గంగాధర(చొప్పదండి): గతేడాది వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు గంగాధర ఎల్లమ్మ చెరువు కట్టకు గండి పడింది. అప్పటినుంచి మరమ్మతు ఎప్పుడు చేస్తరని, చెరువులో నీరెప్పుడు నింపుతరని గ్రామ ప్రజలు, రైతులు ప్రశ్నిస్తున్నారు. చెరువులో నీరు లేకపోవడంతో సాగు, తాగు నీటికి ఇబ్బంది పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగాధర ఎల్లమ్మ చెరువు, నారాయణపూర్ చెరువు రెండూ కలిసే ఉంటాయి. వీటిని రిజర్వాయర్‌గా మార్పు చేసి, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు నీటిని తరలించడానికి పనులు సైతం చేపట్టారు. ఈ చెరువులో ఎప్పుడు నీరుండేలా మేడారం చెరువు నుంచి ఎల్లంపల్లి నీటిని తరలించేందుకు పైపులైన్ వేశారు. నాలుగైదు సంవత్సరాలుగా వేసవిలోనూ చెరువులో నీటిని నింపి, కాలువలు, పంపింగ్, తూముల ద్వారా చెరువులు, కుంటలకు, యాసంగి పంటలకు నీరందిస్తున్నారు.

గతేడాది భారీగా వరద..

గతేడాది వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చింది. నారాయణపూర్ గ్రామానికి ముంపు ప్రమాదం ఉండటంతో అధికారులు చెరువుకు గండి పెట్టారు. అదే సమయంలో గంగాధర ఎల్లమ్మ చెరువు కట్టకు సైతం గండి పడింది. దీంతో చుక్కనీరు లేకుండా పోయింది. ప్రస్తుతం యాసంగి వచ్చినా మరమ్మతు చేయకపోవడంతో చెరువులపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకూ భూగర్భజలాలు తగ్గిపోయి, పొలాలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడటంతో ప్రతిపక్ష పార్టీల నాయకులతో కలిసి ధర్నాకు దిగారు. తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి, పరిహారం అందించే వరకు మరమ్మతు చేయనివ్వబోమని నారాయణపూర్ గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. అధికారులు వారిని ఒప్పించి, కట్ట పనులు పూర్తి చేశారు. ఏళ్లు గడుస్తున్నా తమకు పరిహారం రావడం లేదని ముంపునకు గురవుతున్న మంగపేటవాసులు ఎల్లమ్మ చెరువు కట్టకు మరమ్మతు చేయకుండా నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో ఎల్లమ్మ చెరువులోకి నీరు వెళ్లకుండా అడ్డుకట్ట వేసి, నారాయణపూర్ చెరువులోకి ఎల్లంపల్లి నీటిని పంపింగ్ చేస్తున్నారు.

నీరు లేక వెలవెల..

ఎల్మమ్మ చెరువు కట్టకు మరమ్మతు చేయకపోవడం, నీరు రాకుండా అడ్డుకట్ట వేయడంతో వెలవెలబోతోంది. దీంతో దిగువ ప్రాంత రైతులు సాగు నీటికి, గంగాధర ప్రజలు తాగు నీటికి నానాతంటాలు పడుతున్నారు. ఎల్లంపల్లి నీటితో చెరువు నింపుకునే అవకాశం ఉన్నా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు. పక్కనే ఉన్న చెరువు జలకళతో ఉంటే ఎల్లమ్మ చెరువు ఎండిపోయి దర్శనమిస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, వానాకాలం రాకముందే మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జాతీయ భావజాల వ్యాప్తికి సోషల్ మీడియా ప్రధానం

- ప్రపంచంలోనే ధీటైన శక్తిగా మారుతున్న భారతదేశం
- సోషల్ మీడియా సంగమం కార్యక్రమంలో వక్తల ప్రసంగం



భరతమాత చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



హాజరైన పలువురు ప్రముఖులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఆధునిక సమాజంలో సోషల్ మీడియా అంతర్భాగంగా మారిందని, సమాజంపై సోషల్ మీడియా ప్రభావం ఎంతగానో ఉందని, అందుకే సమాజ పరివర్తన, జాతీయ భావజాల వ్యాప్తికి యువత, సోషల్‌మీడియా సైనికులు నడుం బిగించాలని సీనియర్ జర్నలిస్ట్ సురేశ్ కొచ్చటిల్, రిథమ్ డిజిటల్ తెలుగు రీజినల్ ఎడిటర్ కుంటి సురేందర్, ఆర్ఎస్ఎస్ బాధ్యులు బూర్ల దక్షిణామూర్తి అన్నారు. సమాచార భారతి ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లోని అల్ఫోర్స్ కళాశాలలో సోషల్ మీడియా సంగమం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన వక్తలుగా వారు హాజరై మాట్లాడారు. సోషల్ మీడియా యువత జీవితాలపై గణనీయమైన ప్రభావం చూపుతోందన్నారు. ఒకరితో ఒకరు సంభాషించుకునే విధానం మారిందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వ చారిత్రక నిర్ణయాలతో ప్రపంచంలోనే నేడు భారతదేశం బలమైన శక్తిగా మారిందని, రక్షణరంగం, ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా, 370 ఆర్టికల్, త్రిపుల్ తలాక్, డిజిటల్ లావాదేవీలు, రామమందిరం నిర్మాణం వంటి అనేక అంశాలు సాహసోపేతమైనవని ఇలాంటి విషయాలను సోషల్‌మీడియా వేదిక ద్వారా సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. దేశ,ధర్మ రక్షణకు, దేశానికి సేవ చేసిన మహనీయుల చరిత్రను తెలియజేయడానికి, జాతీయ భావజాల వ్యాప్తికి కృషి చేయాల్సిన అంశంపై యువతరం దృష్టి సారించాలన్నారు. సమాజానికి అవసరమైన వార్తలను సమాచారాన్ని అందించడానికి, దేశ కీర్తిని, గౌరవాన్ని పెంచే అంశాలను సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి తెలియజేసేలా సోషల్ మీడియా సైనికులు నిరంతరం కృషిచేయాలన్నారు. కరీంనగర్ సహ సంఘ చాలక్ ఎలగందుల సత్యనారాయణ, నిర్వాహకులు తడిగొప్పుల శంకరయ్య, కట్ట వేణుగోపాల్, రాజుకుమార్, సాయికిరణ్, విమల్‌కుమార్, అనిల్‌కుమార్, సుధావైష్ణవి,సునీత పురాణం రాము, గీకురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



ఘటన స్థలం వద్ద రాజు మృతదేహం

తిమ్మాపూర్: మండలకేంద్రానికి చెందిన కొండ రాజు(33) ఆర్థిక ఇబ్బందులతో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. రాజు గతంలో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేశాడు. మూడు నెలల క్రితం ఉపాధిపనిలో నుంచి తీసేయడంతో ఖాళీగా ఉంటున్నాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు అధికమై మనస్థాపం చెందాడు. ఉద్యోగం లేక, ఇల్లుగడవడం కష్టంగా మారింది. దీంతో గురువారం రాత్రిఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మహాత్మానగర్ శివారులోని చెరువు వద్దకు వచ్చి క్రిమిసంహారకమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహం కనిపించడంతో సర్పంచ్‌కు సమాచారం అందించారు. సర్పంచ్ పోలీసులకు విషయం తెలపడంతో ఎస్సై ప్రమోద్‌రెడ్డి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి సోషల్ మీడియాలో పలు గ్రూపుల్లో పోస్టుచేయగా మృతిచెందిన వ్యక్తి రాజుగా గుర్తించారు. మరోవైపు రాజు రాత్రంతా ఇంటికి రాకపోవడంతో గాలింపుచేపట్టారు. ఇంతలో చెరువు వద్ద మృతదేహం ఉందని తెలియడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా రాజు విగత జీవిగా కనిపించాడు. రాజుకు భార్య, రెండేళ్ల కూతరు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి సెగ మోదీకి తాకేలా మహాధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని: ప్రధాని మోదీకి సింగరేణి సెగ తగిలేలా మహాధర్నా నిర్వహించాలని రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక ప్రధానచౌరస్తా సమీపంలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరించి, చేతులు దులుపుకోవాలని చూస్తోందని, సింగరేణి ప్రైవేటీకరణను నిలిపివేయాలని సీఎం కేసీఆర్ కేంద్రానికి అనేకమార్లు విజ్ఞప్తి చేసినా, కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. మార్చి 29 నుంచి మే30 వరకు గనులకు వేలం ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేలంతో సంబంధం లేకుండా సింగరేణికి నేరుగా బొగ్గు గనులను కేటాయించాలన్నారు. సింగరేణి ప్రైవేటీకరణను రాష్ట్రప్రభుత్వం తరఫున, సింగరేణి కార్మికుల పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో చేపట్టే యుద్ధభేరి మహాధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మేయర్ అనిల్ కుమార్ టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు కన్నూరి సతీశ్‌కుమార్ బాదావత్ శంకర్ నాయక్ కుమ్మరి శ్రీనివాస్, ఎన్వీ రమణారెడ్డి కల్వచర్ల కృష్ణవేణి, గంగ్ర దామోదర్‌రావు, జాహిద్‌పాషా, అచ్చేవేణు, చెలకపల్లి శ్రీనివాస్, దేవ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సీఎస్సార్ నిధులు

రామగిరి(మంథని): రామగిరి, మంథని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరా ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యం (సీఎస్సార్) నిధులు రూ.15 లక్షలు కేటాయించింది. రామగిరి, మంథని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిత్యం చోటు చేసుకుంటున్న ప్రమాదాలు, చోరీకేసులను చేదించడానికి సీసీ కెమెరాల ఆవశ్యకతపై మంథని సీఐ సతీశ్ సింగరేణి యాజమాన్యానికి లేఖరాశారు. స్పందించిన యాజమాన్యం సీసీ కెమెరా ఏర్పాటుకు రూ.15 లక్షల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు త్వరలో నే రామగిరి, మంథని పోలీస్‌స్టేషన్లపరిధిలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నారు.

తృణధాన్యాలకు ప్రాధాన్యమివ్వాలి

గోదావరిఖని: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుని తృణధ్యాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సింగరేణి హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ సుమన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఆవరణలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాఖాహారం, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు వినియోగించాలన్నారు. రోజు అరగంట పాటు నడక, యోగ, స్విమ్మింగ్, సైక్లింగ్ చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని దీంతో ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంవోఏఐ అధ్యక్షుడు పానుగోటి శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ సీహెచ్.లక్ష్మినారాయణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, పర్సనల్ మేనేజర్ సలీం, సీనియర్ పర్సనల్ అధికారి బంగారు సారంగపాణి, శ్రావణ్ పాల్గొన్నారు.

జేబీసీసీఐ ఒప్పందాలను పూర్తిచేయాలి

గోదావరిఖని: జేబీసీసీఐ సమావేశంలో అలవెన్స్‌ల ఒప్పందాలను వెంటనే పూర్తిచేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్‌చేశారు. శుక్రవారం జీడీకే-1, జీడీకే-11గనులపై ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఎంఎస్ కృషితో బొగ్గుగని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం జరిగిందన్నారు. ఇదే క్రమంలో అలవెన్స్ విషయంలో కూడా ఒప్పందాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. ఒప్పందం విషయంలో యాజమాన్యం, కోలిండియా స్పందించి ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. బేసిక్‌పై ఆధారపడి పెరిగే అండర్ గ్రౌండ్ అలవెన్సులు, స్పెషల్ అలవెన్స్, హెచ్ఆర్ఏ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ట్రాన్స్‌పోర్టు, నైట్‌షిఫ్ట్ అలవెన్స్ ఇతర అలవెన్సులు తదుపరి సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సకాలంలో ఒప్పందం పూర్తిచేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఆకుల హరిబ్, సారంగపాణి, రవీందర్, రాజేశం పాల్గొన్నారు.

తండ్రి నెలమాసికం... తెల్లారే కొడుకు మృతి

- నెలరోజుల వ్యవధిలో తండ్రీకొడుకులిద్దరి మృతితో కుటుంబంలో విషాదఛాయలు
- పెద్దపల్లిరోడ్డు ప్రమాదంలో చామనపల్లివాసి మృతి



అనిల్(ఫైల్)



పెద్దపల్లిలో లారీని ఢీకొట్టి మృతిచెందిన అనిల్

కరీంనగర్‌రూరల్: తండ్రి నెలమాసికం నిర్వహించిన మరుసటిరోజే కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో తీరని విషాదం నింపింది. నెలరోజుల వ్యవధిలో తండ్రికొడుకులిద్దరూ మరణించడంతో కుటుంబమంతా దు:ఖసాగరంలో మునిగింది. స్థానికుల కథనం ప్రకారం... కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన అవారి అనిల్(26) యువకుడు పెద్దపల్లిలోని ట్రాక్టర్ షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తూ గది అద్దెకు తీసుకుని అక్కడే ఉంటున్నాడు. గురువారం రాత్రి 10 గంటలకు ట్రాక్టర్ గ్యారేజీ మూసివేసిన తర్వాత బైక్‌పై మరో మెకానిక్‌ను సుల్తానాబాద్‌లో దించి అనిల్ పెద్దపల్లికి తిరిగి వస్తుండగా రిలయన్స్‌పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రిలో పోస్టమార్టం నిర్వహించి అనిల్ మృతదేహాన్ని చామనపల్లికి తరలించారు. అనిల్ తండ్రి రాజయ్య నెలరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందగా బుధవారం తండ్రి నెలమాసికం నిర్వహించిన మరుసటిరోజు గురువారం ఉదయం పెద్దపల్లికి వెళ్లిన అనిల్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో తీరని విషాదం నెలకొంది. నెలరోజుల వ్యవధిలో తండ్రికొడుకులిద్దరు మృతిచెందడం కుటుంబంలో అంతులేని ఆవేదనను మిగిల్చింది. తల్లి లక్ష్మి, సోదరుడు సునీల్ రోధించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

నిబంధనలు పాటించని వాహనాల పై చర్యలు ..

సుల్తానాబాద్: లారీ ఇండికేటర్లు వేయకుండా రోడ్డుపై నిలపడంతో వెనుక నుంచి బైక్‌పై ఢీకొట్టడంతో అనిల్ (26) యువకుడు అక్కడికక్కడే మృతిచెందినట్లు పెద్దపల్లి ఎస్సై రాజేశ్ తెలిపారు. మృతుడి తల్లి లత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

గుండెపోటుతో ఇద్దరు యువకుల మృతి

- క్రికెట్ ఆడుతూ ఒకరు.. వ్యవసాయ పనులు చేస్తూ మరొకరు



ఆంజనేయులు మృతదేహం



జీల సతీశ్(ఫైల్)

చిగురుమామిడి/గన్నేరువరం: కరీంనగర్ జిల్లాలో శుక్రవారం గుండెపోటుతో ఇద్దరు యువకులు మృతిచెందారు. క్రికెట్ ఆడుతూ ఒకరు, వ్యవసాయ పనులు చేస్తూ మరొకరు హఠాత్తుగా చనిపోవడం విషాదం నింపింది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన శనిగరం ఆంజనేయులు(37)గ్రామపరిధిలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీలో సమీప బంజేరుపల్లి టీం తరఫున క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. మూడో ఓవర్‌లో రెండు బాల్స్ వేసి కుప్పకూలిపోయాడు. తోటి క్రీడాకారులు ఫిట్స్ వచ్చిందనుకుని తాళం చేతుల గుత్తి చేతిలో పెట్టారు నోటినుంచి నురగలు రావడంతో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించేలోపే ఆంజనేయులు మృతి చెందినట్లు తెలిపారు. ఆంజనేయులు కట్టుమిషన్ కుడుతూ జీవనం సాగించేవాడు. ఇతడికి భార్య ధనలక్ష్మి, తల్లి మల్లవ్వ ఉన్నారు. కాగా, హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆంజనేయులు మృతదేహాన్ని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సందర్శించి నివాళి అర్పించారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా గన్నేరువరం మండలం సాంబయ్యపల్లె గ్రామానికి చెందిన జీల సతీశ్ (32)తనకున్న పొలంలో వివిధ పంటలు సాగుచేస్తూ, ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం మొక్కజొన్న పంటకు నీళ్లు పారించేందుకు వెళ్తుండగా పొలానికి సమీపంలో గుండెపోటు రావడంతో కిందపడపోయాడు. అటుగా వెళ్తున్న రైతులు గమనించి స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



పురస్కారం అందుకుంటున్న హిమశేఖర్‌శాస్త్రి



పురస్కారం అందుకుంటున్న నాగరాజు శర్మ

ప్రతిభకు ప్రశంస

కరీంనగర్‌అర్బన్: పురోహిత విద్యలో ప్రతిభ కనబర్చిన యువకుడిని తెలంగాణ టూరిజం శుక్రవారం సన్మానించింది. హైదరాబాద్‌లో త్యాగరాయ గానసభలో కరీంనగర్‌కు చెందిన పురోహితుడు బొనగల హిమశేఖర్‌శాస్త్రిని వైదిక పురోహిత రత్న బిరుదుతో తెలంగాణ టూరిజం చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా నంది అవార్డు, జాతీయ పురస్కారంతో సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నాగరాజు శర్మకు జాతీయ పురస్కారం

మానకొండూర్: హిందుధర్మ, పరిరక్షణకు కంకణబద్ధులై, సంస్కృతి సంప్రదాయ పరిరక్షణకు కృషిచేస్తున్న వేదపండితుడు మానకొండూర్ మండలకేంద్రానికి చెందిన బ్రహ్మశ్రీ ఆవునూరి నాగరాజు శర్మకు వేదవైదిక శిరోమణికి సేవాసంఘం నాయకులు ఉగాది నందితో పాటు జాతీయ పురస్కారంను హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ వేదికలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, రిటైర్డ్ జడ్జి మధుసూదన్‌రావు చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ అరుణారెడ్డి, డీజీ మెంబర్ ఈసీమెంబర్, ల్యాంప్రో కంపెనీ సీఈవో రూప సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా



ఏఎల్పీలో కార్మికులతో మాట్లాడుతున్న శంకరయ్య

రామగిరి(మంథని): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న బొగ్గుబ్లాకుల ప్రైవేటీకరణ విధానాలను ఎండగడుతూ సింగరేణి కార్మికుల సెగ మోదీకి తగిలేలా ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ నేడు సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ ఏరియాల్లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, టీబీజీకేఎస్ మహాధర్నా కోసం ఇచ్చిన పిలుపుతో శుక్రవారం ఏపీఏ పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ (ఏఎల్పీ)లో కార్మికులను కలిసి మాట్లాడారు. గోదావరిఖని ప్రధానచౌరస్తాలో నిర్వహించే మహాధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం గని ఫిట్‌సెక్రటరీ దాసరి మల్లేశ్, నాయకులు శంకర్, రమేశ్, దుగ్యాల నరేశ్, మహేశ్, సతీశ్, గోపి, క్రాంతియాదవ్, రమేశ్, ఉప్పు రాజు, రాజయ్య కార్మికులు పాల్గొన్నారు.

సర్వీస్ నుంచి తొలగించడం సరికాదు

- ఉపాధ్యాయురాలిని విధుల నుంచి తొలగించడంపై పునఃపరిశీలించాలి

పెద్దపల్లిరూరల్: పదోతరగతి వార్షిక పరీక్షల్లో హిందీ పేపర్ లీకేజీకి బాధ్యులుగా చేస్తూ సబియా మదహత్ అనే ఉపాధ్యాయురాలిని సర్వీస్ నుంచి తొలగించడం సరికాదని అఫ్జల్ మోహిఉద్దీన్ (ఎంఈఎస్ఏ) పెద్దపల్లి జిల్లా ప్రధాన బాధ్యులు అన్నారు. శుక్రవారం మీసా జనరల్ బాడి సమావేశం ఎంబీగార్డెన్‌లో నిర్వహించి మాట్లాడారు. ఓవ్యక్తి భద్రత సిబ్బంది కనుగప్పి చెట్టెక్కి గోడ దూకి మొదటి అంతస్తులోని తరగతి గది కిటికీ వద్దకు చేరుకుని రహస్యంగా పేపర్ ఫోటోతీసి వాట్సాప్‌లో ఇతరులకు చేరవేయడం ఇన్విజిలేటర్ తప్పిదం కాదని ప్రభుత్వం ఉపాధ్యాయురాలని సర్వీస్ నుంచి తొలగించడం అత్యంత పెద్ద శిక్ష విధించడమేనన్నారు. ఈ విషయన్నాఇ ప్రభుత్వం పునఃపరిశీలనచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మేష(ఎంఈఎస్ఏ)కు చెందిన అధ్యక్షుడు అఫ్జల్ మోహిద్దీన్, ప్రధానకార్యదర్శి అబ్దుల్‌ఖాదర్, హనరీ ప్రెసిడెంట్ లతీఫ్, అహ్మద్, వజహత్ అలీ, వైస్‌ప్రెసిడెంట్ గులం ముస్తఫా, వహీద్‌ఖాన్, అశ్ఫేక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్యం అందరికీ అందుబాటులోకి రావాలి


వాక్‌ను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్: రోజురోజుకూ వైద్యం ఖరీదుగా మారుతోందని, నిరుపేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రైవేట్ ఆసుపత్రులు కృషి చేయాలని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. శుక్రవారం 73వ ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా రెనీ ఆసుపత్రి, శాతవాహన లయన్స్ క్లబ్‌ల సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన హెల్త్ వాక్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వైద్యసేవలు మారుమూల ప్రజలకు కూడా అందాలని అన్నారు. కార్యక్రమంలో రెనె ఆసుపత్రి వైద్యులు బంగారి స్వామి, రజనీ ప్రియదర్శిని, శాతవాహన లయన్స్ బాధ్యులు బుర్ర మధుసూదన్‌రెడ్డి, మనోహరాచారి, మేకల అరవిందరావు, నర్సింగరావు, మహేందర్, సత్యనారాయణరావు, కోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

జీవీ రామకృష్ణారావు జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న హరిశంకర్, నాయకులు

కరీంనగర్: సుడా చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు జన్మదిన వేడుకలను పార్టీ టౌన్ యూత్ అధ్యక్షుడు దీకొండ కుల్‌దీప్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌక్‌లో నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, పార్టీ నగర మైనారిటీ అధ్యక్షుడు మీర్ షౌకత్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు


కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైద్యాధికారి ఎం.చైతన్య ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, పరిష్కార మార్గాలను వివరించారు. అనంతరం సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, లైబ్రేరియన్ మోహన్‌రావు, స్టాఫ్ సెక్రటరీ రోజారమణి, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ లావణ్య, ఏసీవో సుష్మ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ నిత్యావసర కిట్లు పంపిణీ


కిట్లు అందిస్తున్న జైపాల్‌రెడ్డి

కరీంనగర్: రంజాన్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పేద ముస్లిం కుటుంబాలకు మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల మసీదు సమీపంలో నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మైత్రి ఎండీ.సృజన్‌రావు, మిత్ర మండలి సభ్యులు ఆరిఫ్ జాఫ్రీ, ఎంఏ.కలీం, ఆయుబ్ అలీ, అమ్జద్ లాలా, ఒసామా జాఫ్రీ, సవేరా అండ్ టీం, నాయకులు అక్కనపల్లి నాగరాజు, వైద రామానుజం, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు 33/11 కేవీ కొత్తపల్లి, రేకుర్తి సబ్‌స్టేషన్ల పరిధిలోని రేకుర్తి, సీతారాంపూర్, అరెపల్లి, కొత్తపల్లి, మల్కాపూర్, లక్ష్మీపూర్, దేశరాజ్‌పల్లి, వెదిర, వెలిచాల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏడీఈ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

తుది దశకు ‘కమాండ్ కంట్రోల్’

- నగరంలో పూర్తికావస్తున్న కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ సిగ్నలింగ్ పనులు
- నిరంతరం సేవలందేలా తీగల వంతెన సమీపంలో శాశ్వత భవనం



కరీంనగర్ సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అన్ని సేవలు ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా 2022 ఆగస్టు 15న లాంఛనంగా ప్రారంభించిన ఈ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రస్తుతం సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, నగరంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఎల్‌ఈడీల పనితీరు పరిశీలిస్తున్నారు. ఈ సేవలన్నీ నిరంతరం అందేలా తీగల వంతెన సమీపంలో శాశ్వతంగా మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు.

1.08 ఎకరాల విస్తీర్ణంలో..

రామగుండం బైపాస్ రోడ్డులో 1.08 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.12.5 కోట్లకు పైగా నిధులు వెచ్చించి, అత్యంత ఆధునిక సాంకేతిక పద్ధతిలో భవనం నిర్మిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో కంట్రోల్ రూం, సెక్యూరిటీ, ప్యానెల్ బోర్డు, అగ్నిమాపక యంత్రాలు, పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి అంతస్తులో మూడు కార్యాలయాలు, సిటిజన్ సర్వీస్ సెంటర్, కంట్రోల్ రూం, రెండో అంతస్తులో టెలికాం రూం, ప్రత్యేకంగా 5 గదులు, ఉద్యోగుల కోసం ఒక గది, మూడో అంతస్తులో వెయిటింగ్ రూం, స్మార్ట్‌సిటీ ఎండీ కార్యాలయం, మీటింగ్ హాల్ నిర్మిస్తున్నారు.

భద్రతకు రూ.180 కోట్లకు పైగా..

కరీంనగర్ స్మార్ట్‌సిటీ రెండో దశ పనుల్లో భాగంగా భద్రత కోసం రూ.180 కోట్లకు పైగా నిధులు కేటాయించారు. ఈ మొత్తంలో కమాండ్ కంట్రోల్ కోసం ప్రత్యేకంగా రూ.94.44 కోట్లు వెచ్చిస్తున్నారు. 110 ప్రాంతాల్లో 335 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీస్‌శాఖ సహకారంతో ట్రాఫిక్ కంట్రోల్ కోసం, సిగ్నల్స్ జంపింగ్ చేస్తే చలానా విధించడానికి వీలుగా 48 ప్రాంతాల్లో 170 కెమెరాలు బిగించారు. ఇలా నగరం మొత్తం వివిధ వ్యవస్థలు పని చేసేందుకు వీలుగా 764 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఇళ్లకు జీపీఎస్ ట్యాగింగ్..

నగరంలో ఎక్కడ చెత్త పేరుకుపోయినా సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకునేలా కమాండ్ కంట్రోల్ పని చేస్తుంది. దీనికి కోసం ఇప్పటికే దుకాణాలు, ఇళ్లకు జీపీఎస్ ట్యాగింగ్ పూర్తి చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేకంగా 7 వేల ఆర్‌ఎఫ్‌ఐడీ పరికరాలను వాహనాలకు బిగించి, చెత్త సేకరణ చేపట్టనున్నారు. 20 ప్రాంతాల్లో ఇంటర్నెట్ ఉచితంగా అందించేందుకు 150 వైఫై హాట్ స్పాట్ పాయింట్లను గుర్తించారు. నగరంలోని 24 ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎల్‌ఈడీ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఏయే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఉంది, వాతావరణ వివరాలు, నాలుగు రోజులపాటు వర్షాలు కురిస్తే ముందస్తు సమాచారం, అత్యవసర సమయాల్లో హెచ్చరికలు జారీ చేయడానికి వీలుగా మైకులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని 40 ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. డిజిటల్ తరగతులు, పారిశుద్ధ్య పనులన్నీ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయనున్నారు. ఆస్తి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్, పెన్షన్ల వివరాలు, గ్రీవెన్స్ ఫిర్యాదులు.. ఇలా ప్రతీది రికార్డవుతాయి. వీటన్నింటినీ రెండేళ్లపాటు కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఒక షిఫ్ట్‌కు 16 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు నిరంతరం ఉద్యోగులు పని చేస్తారు.

రెండు నెలల్లో అందుబాటులోకి..

స్మార్ట్‌సిటీలో భాగంగా భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి, కమాండ్ కంట్రోల్ శాశ్వత భవనం నిర్మిస్తున్నాం. పోలీస్‌శాఖ, కార్పొరేషన్ విధులకు పనికి వచ్చేలా కెమెరాలు ఏర్పాటు చేశాం. రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – సునీల్‌రావు, మేయర్

చిత్ర కథ



మార్కెట్లోకి మామిడి పండ్లు

వేసవి కాలం అంటేనే మామిడి పండ్లకు ప్రసిద్ధి. ఈసారి కూడా సీజన్ వచ్చేసింది. పలు రకాల మామిడి పండ్లను జిల్లా కేంద్రంలో విక్రయిస్తున్నారు. కొందరు రోడ్డు పక్కన పెట్టి, మరికొందరు సైకిళ్లు, వాహనాలపై పెట్టుకొని అమ్ముతున్నారు. ఇటీవల వడగండ్ల వానలతో మామిడి కాయలు నేలరాలాయి. దీంతో ధరలు అధికంగా ఉన్నాయని కొనుగోలుదారులు అంటున్నారు. కిలో మామిడి పండ్లు రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారని చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఆధ్యాత్మికం

ఘనంగా జోగు కార్యక్రమం



గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే రేణుకా ఎల్లమ్మ బోనాల్లో భాగంగా శుక్రవారం జోగు కార్యక్రమం ఘనంగా జరిపారు. మంకమ్మతోటలో బీఆర్‌ఎస్ 14వ డివిజన్ అధ్యక్షుడు యాగండ్ల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గౌడ కులస్తుల ఇళ్లలోకి వెళ్లి, జోగు స్వీకరించారు. కార్యక్రమం ఈ నెల 22 వరకు కొనసాగనుంది. మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, కార్పొరేటర్ దిండిగాల మహేశ్, నాయకులు కోడూరి మహేందర్ గౌడ్, పంజాల వెంకన్నగౌడ్, హరికుమార్ గౌడ్, పబ్బ ప్రవీణ్ గౌడ్, నరేష్ గౌడ్, సంపత్ గౌడ్, హరీశ్ గౌడ్ పాల్గొన్నారు. – సప్తగిరికాలనీ

రూ.1,200 కోట్లతో అభివృద్ధి పనులు

- మేయర్ సునీల్‌రావు


పనులు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు, పక్కన నాయకులు, అధికారులు

కరీంనగర్ సిటీ: భవిష్యత్ ప్రణాళికలతో జనాభాకు అనుగుణంగా కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం 51, 24వ డివిజన్లలో పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. భగత్‌నగర్ హెలీప్యాడ్ గ్రౌండ్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ సమీపంలోని పలు కాలనీల్లో ఎస్‌డబ్ల్యూజీ పైపులైన్ డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం 24 డివిజన్‌లో కార్పొరేటర్ కుర్ర తిరుపతితో కలిసి సీసీ రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి సరఫరా పైపులైన్ పనులు ప్రారంభించారు. నగరపాలక సంస్థ ద్వారా రూ.1,200 కోట్లతో వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే 75 శాతం పూర్తి చేశామని మిగతావి వచ్చే మూడు మాసాల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పార్కులు నిర్మించి, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నామని, రాబోయే రోజుల్లో 24 గంటలు నల్లా నీరు వచ్చేలా చూస్తామన్నారు. పద్మనగర్ బైపాస్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం సిరిసిల్ల బైపాస్ రోడ్డు, బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి బొమ్మకల్ చౌరస్తా వరకు, శాతవాహన యూనివర్సిటీ నుంచి చింతకుంట వరకు, శాతవాహన యూనివర్సిటీ నుంచి రేకుర్తి వరకు, అలుగునూరు నుంచి ఎల్‌ఎండీ గెస్ట్‌హౌస్ వరకు, కమాన్ నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు ఎటువైపు చూసినా లైటింగ్ సిస్టమ్ అమర్చినట్లు పేర్కొన్నారు. కరీంనగర్‌ను ఒక సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు, నాయకులు, ఆయా డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కులు ఇస్తున్న ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి, ధర్మరాజుపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ రాణిసురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొండల్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

పూలే జయంతి ఉత్సవ కరపత్రం ఆవిష్కరణ

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద 11న నిర్వహించనున్న జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవ కరపత్రాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆవిష్కరించారు. కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ... సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడు జ్యోతిరావుపూలేను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బుర్ర కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, కల్లెపల్లి రమాదేవి, తాళ్లపల్లి రమేష్, అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎర్ర శ్రీధర్, బాబూ జగ్జీవన్‌రామ్ కమిటీ అధ్యక్షుడు ఇల్లందుల సమ్మయ్య, ఉప్పు శ్రీనివాస్, ఎర్రబోజ్జు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు(చొప్పదండి): మండలంలోని షానగర్ ఎంపీటీసీ భర్త కొత్త వెంకటేశ్ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వెంకటేశ్‌ను పరామర్శించారు.

జమ్మికుంటలో...

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్ తల్లి రజియా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీణవంకకు చెందిన యుప్‌టీవీ అధినేత పాడి ఉదయనంద్‌రెడ్డి శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ శ్రీపతి నరేష్ ఉదయనంద్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఏబూసి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ముద్రగడ నవీన్, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు ఆవుల తిరుపతి, శ్రీరామ్, వీణవంక మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, మాజీ జెడ్పీటీసీదాసరి ప్రభాకర్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మానేరు కట్ట వరకు బ్రిడ్జి నిర్మించాలి

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని మైలారం గ్రామ మైసమ్మ గుట్ట నుంచి లోయర్ మానేరు డ్యాం కట్ట వరకు బ్రిడ్జి నిర్మించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బామండ్ల రవీందర్ కోరారు. మైసమ్మ గుట్ట లోయర్ మానేరు డ్యాంను సందర్శించారు. మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు చొరవ తీసుకోవాలని కోరారు. మండల సరిహద్దు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని కరీంనగర్‌కు వెళ్లాలంటే 40 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కిలోమీటరున్నర బ్రిడ్జి నిర్మిస్తే గన్నేరువరంతో పాటు సిద్దిపేట, రాజన్నసిరిసిల్లా జిల్లాలోని బెజ్జంకి, ఇల్లంతకుంట మండల ప్రజలు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. అలాగే కరీంనగర్‌కు వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలని కోరారు.

బిజిగిరిషరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాలో రంజాన్ సందర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ చైర్మన్ మహమ్మద్ సలీం పాషా ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆయురారోగ్యాలతో ఉండాలని శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధికార పార్టీ నాయకులు బల్మూరిపై రాజకీయ కుట్రలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, నాయకులు చిన్నింటి నాగేంద్ర, పందిళ్ళ శంకర్, ఎర్రబెల్లి తిరుపతిరావు, మైనారిటీ నాయకులు మహమ్మద్ అజ్మత్, మహమ్మద్ అలీషరీఫ్, హకీం తదితరులు పాల్గొన్నారు.

శాంతిసామరస్యాలు వెల్లివిరియాలి


గీటురాయి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ బాధ్యులు

సప్తగిరికాలనీ: దేశంలో శాంతిసామరస్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ సౌభ్రాతృత్వంతో మెలగాలని జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖైరొద్దీన్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని జమాతే ఇస్లామి హింద్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో గీటురాయి పుస్తకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. రంజాన్ మాసం పేదల కోసం వస్తోందని, ప్రతీ ముస్లిం పేదలకు ఇతోధికంగా దానధర్మాలు చేస్తారని చెప్పారు. జమాతే ఇస్లామి హింద్ సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అపోహలు, అపార్థాలు దూరం చేసి, అందరిలో ప్రేమభావాన్ని పెంపొందించేందుకు రంజాన్ దోహదం చేస్తుందని తెలిపారు. సంస్థ గ్రామీణ ప్రాంత అధ్యక్షుడు షోయబ్ లతీఫి, బాధ్యులు నయీమొద్దీన్, సయ్యద్ జుబేర్ అహ్మద్, ఉమేర్ అహ్మద్ ఖాన్, అజీజ్, యూనుస్, అఖిల్, వాజిద్, అనీస్ లతీఫి తదితరులున్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడొద్దు


కాగడాలు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ నాయకులు తడగొండ సత్యరాజ్‌వర్మ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి పార్టీ పట్టణ అధ్యక్షుడు గుర్రం మధు ఆధ్వర్యంలో టీసేవ్ కార్యక్రమంలో భాగంగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టామని వర్మ తెలిపారు. అధినేత వైఎస్ షర్మిల పిలుపు మేరకు రోజూ నిరసన కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె స్రవంతి, నాయకులు మేక అంజయ్య, దాసరి రవి శాస్త్రి, కుక్కల పెద్ద లచ్చవ్వ, మోదుంపల్లి శ్రీకాంత్, ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, గుమ్మడి త్రివర్ణ, పెంచాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

గన్నేరువరం(మానకొండూర్): మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రథాన్ని ఆలయం చుట్టూ తిప్పిన అనంతరం భక్తులు దర్శించుకున్నారు. భక్తులు రథాన్ని తాడుతో లాగుతూ గ్రామంలోని వీధుల్లో తిప్పారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. సమీప గ్రామాల ప్రజలు సైతం స్వామివారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. నిర్వాహకులు వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ జయంతికి రండి


మాట్లాడుతున్న మహేందర్

గన్నేరువరం(మానకొండూర్): మండల కేంద్రంలో ఈ నెల 11, 14వ తేదీల్లో నిర్వహించే జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జెరిపోతుల మహేందర్ అన్నారు. గన్నేరువరంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహనీయులు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతుల జయంతికి ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, కర్షకులు, సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు కల్లెపల్లి భూమయ్య, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మీసాల ప్రభాకర్, అంబేడ్కర్ సంఘం నాయకులు రామంచ సంపత్, వేదిర విజేందర్, కవ్వంపల్లి మునీందర్, దమ్మగల్ల అనిల్, బీఎస్పీ సెక్టార్ అధ్యక్షుడు రేపాక బాబు, జాడిగపు రమేష్, రామంచ అనంద్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక


ఎమ్మెల్యే సమక్షంలో చేరుతున్న నాయకులు

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బండి సంపత్, ఉపాధ్యక్షుడు గట్టు రమేశ్, డైరెక్టర్లు బండి పెద్ద కొంరయ్య, గట్టు రాజయ్య, బండి సంపత్, ఎరవేని రవి, కొలిపాక రామయల్లు, గట్టు రాయమల్లు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచ్ నల్ల వంశీధర్‌రెడ్డి, కడారి ప్రభాకర్, అడప శ్రీనివాస్, బొల్లం శ్రీనివాస్, ఉప సర్పంచ్ తోట రాజమౌళి, వార్డు మెంబర్లు తిరుపతి, సుదాకర్, నల్లగొండ తిరుపతి, రేణుక పాల్గొన్నారు.

తండ్రి మీద దాడి చేయబోతుంటే అడ్డొచ్చిన తల్లిని నరికేశాడు

- జోగుళాంబ జిల్లాలో ఘటన


నాగమ్మ (ఫైల్)

శాంతినగర్: వేపచెట్టు నరకవద్దని చెప్పడంతో గొడ్డలితో కన్నతండ్రిపై దాడి చేయబోతుంటే అడ్డొచ్చిన తల్లిని నరికేశాడు ఓ కొడుకు. తీవ్రంగా గాయపడిన తల్లి అక్కడికక్కడే మృతి చెందింది. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కృష్ణజడ రాముడు, నాగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కూతుళ్లు. చిన్న కుమారుడు ప్రేమరాజ్ ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్యతో మనస్పర్ధలు రావడంతో పది రోజుల క్రితం ప్రేమరాజ్ రామాపురానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో తల్లి నాగమ్మను డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించేవాడు. గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకొంటుండగా ప్రేమ్‌రాజు ఇంటిముందున్న వేప చెట్టును నరికేందుకు ప్రయత్నించాడు. తండ్రి వద్దని వారించడంతో వెంటనే గొడ్డలితో తండ్రిపై దాడి చేయబోయాడు. ఆ సమయంలో తల్లి అడ్డుపడగా గొడ్డలితో ఆమెపై దాడి చేయడంతో తల, చెవిపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నాగమ్మ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం అలంపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కొడుకుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

8 కోచ్‌లు.. టికెట్ ధర రూ. 1,680

- ప్రధాని చేతుల మీదుగా నేడు సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం
- తొలిరోజు సాధారణ ప్రయాణికులకు అనుమతి లేదు
- రేపు తిరుపతి నుంచి మొదలుకానున్న రెగ్యులర్ సర్వీసు



సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వేకు తక్కువ సమయంలోనే రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌గా అందుబాటులోకి వస్తున్న సికింద్రాబాద్–తిరుపతి సర్వీసును ప్రధాని మోదీ శనివారం ఉదయం 11:45 గంటలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. అయితే తొలిరోజు సాధారణ ప్రయాణికులను అనుమతించరు. ఈ రైలు రెగ్యులర్ సర్వీసు ఆదివారం మధ్యాహ్నం 3:15 గంటలకు తిరుపతి నుంచి మొదలు కానుంది. సికింద్రాబాద్–తిరుపతి ఏసీ చైర్‌కార్ ధరను రూ. 1,680గా ఖరారు చేయగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లోని ఏసీ చైర్‌కార్ ధరను రూ. 3,080 (కేటరింగ్ చార్జీలు కలుపుకొని)గా నిర్ణయించారు. అలాగే తిరుపతి–సికింద్రాబాద్ వందే భారత్ రైల్లో ఏసీ చైర్‌కార్ ధర రూ. 1,625గా ఉండగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లోని ఏసీ చైర్‌కార్ ధర రూ. 3,030గా ఉంది. తిరుపతికి వెళ్లే ఇతర ఎక్స్‌ప్రెస్‌లతో పోలిస్తే ఈ రైల్లో టికెట్ ధరలు అధికంగా నిర్ణయించడంతో ప్రస్తుతానికి 8 కోచ్‌లనే ఏర్పాటు చేశారు. డిమాండ్ ఎలా ఉంటుందో స్పష్టత వచ్చే వరకు తక్కువ కోచ్‌లతోనే నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. శుక్రవారం నుంచి సాధారణ ప్రయాణికులకు టికెట్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ - కొన్ని సంగతులు..

- దేశంలోనే 13వ వందేభారత్ సర్వీసు
- దక్షిణ మధ్య రైల్వేలో రెండోది
- **ట్రైన్ నంబర్లు:** సికింద్రాబాద్–తిరుపతి 20701, తిరుపతి–సికింద్రాబాద్ 20702
- **రెగ్యులర్ ట్రిప్పుల్లో ఈ రైలు ఆగే స్టేషన్లు:** నల్లగొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు
- **మొత్తం కోచ్‌లు:** 8 (ఎకానమీ చైర్‌కార్ కోచ్‌లు 7, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ కోచ్‌లు 1), రెండూ కలిపి మొత్తం సీట్లు: 530
- **ప్రత్యేకతలు:** స్లైడింగ్ డోర్స్, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 360 డిగ్రీల కోణంలో తిరిగే కుర్చీలు, ఇతర కోచ్‌లలో సెమీ స్లీపర్ స్థాయిలో తిరిగే కుర్చీలు, ఎమర్జెన్సీ అలారం బటన్, లోకో పైలట్ కేబిన్‌తో మాట్లాడే ప్రత్యేక వ్యవస్థ, సీసీ కెమెరాలు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయాలు ఇవీ

సికింద్రాబాద్ టు తిరుపతి – తిరుపతి టు సికింద్రాబాద్


అరైవల్	డిపార్చర్	స్టేషన్	అరైవల్	డిపార్చర్
-	ఉ.6:00	సికింద్రాబాద్	రా.11:45	-
7:19	7:20	నల్లగొండ	10:10	10:11
9:45	9:50	గుంటూరు	7:45	7:50
11:09	11:10	ఒంగోలు	6:30	6:31
12:29	12:30	నెల్లూరు	5:20	5:21
2:30	--	తిరుపతి	--	3:15

మానవాళికి డెంగీ ముప్పు!

వాతావరణ మార్పులతో దోమల వ్యాప్తి

- 129 దేశాలపై డెంగీ ప్రభావం!
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

సాక్షి, అమరావతి



ప్రపంచవ్యాప్తంగా మానవాళికి డెంగీ ముప్పు పొంచి ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా దోమలు, వైరస్‌ల వ్యాప్తి పెరగడమే ఇందుకు కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల వెల్లడించింది. దశాబ్దకాలంగా డెంగీ, జికా, చికున్ గున్యా వంటి ఆర్బో వైరస్‌ల వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లు భారీగా పెరిగాయని ప్రకటించింది. ఏడాదికి 100 మిలియన్ల నుంచి 400 మిలియన్‌ల వరకు ఇన్‌ఫెక్షన్ కేసులు నమోదవుతున్నాయని ప్రకటించింది. ప్రస్తుతం జనాభాలో దాదాపు సగం మందికి డెంగీ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

డబ్ల్యూహెచ్‌వో వెల్లడించిన కొన్ని ముఖ్యమైన వివరాలు...

- అటవీ నిర్మూలన, పారిశుధ్యం, పట్టణీకరణ, నీటిపారుదలలో సమస్యలు దోమలవ్యాప్తికి ప్రధాన కారణం.
- ముఖ్యంగా అవపాతం(వాతావరణంలో ఉన్న నీటి ఆవిరి ద్రవీకరించడం), ఉష్ణోగ్రత పెరుగుదల, అధిక తేమ వంటివి దోమల అవాసాలకు అనుకూలంగా ఉన్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా 2000 సంవత్సరంలో డెంగీ కేసులు సుమారు 0.5 మిలియన్ నమోదవగా, 2019 నాటికి 5.2 మిలియన్లకు పెరిగాయి. 2023లోనూ ఇదే ఉధృతి కొనసాగుతోంది.
- ఈ ఏడాది దాదాపు 129 దేశాలు డెంగీ బారినపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే 100కి పైగా దేశాల్లో డెంగీ వ్యాప్తి కనిపిస్తోంది.
- ఈ ఏడాది మార్చి చివరి వరకు ప్రపంచవ్యాప్తంగా 4,41,898 డెంగీ కేసులు నమోదవగా, 119 మంది మరణించారు.
- చికున్ గున్యా దాదాపు అన్ని ఖండాల్లో విస్తరించింది. ప్రస్తుతం సుమారు 115 దేశాల్లో దాని ప్రభావం ఉంది.
- ప్రపంచవ్యాప్తంగా జికా వైరస్ క్షీణించింది. అయితే మళ్లీ 89 దేశాల్లో వ్యాప్తిచెందే పరిస్థితులు ఉన్నాయి.

అన్ని భాషల్లోనూ పరీక్ష రాసే అవకాశమివ్వాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మంత్రి కేటీఆర్
- సీఆర్‌పీఎఫ్‌లో హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లోనే పరీక్ష ఉండటంపై అభ్యంతరం
- రాజ్యాంగం గుర్తించిన అన్ని అధికారిక భాషల్లోనూ పరీక్ష నిర్వహించాలని కేంద్ర హోంమంత్రికి లేఖ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు రాజ్యాంగం గుర్తించిన అన్ని అధికారిక భాషల్లోనూ పరీక్ష రాసేందుకు వీలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీ రామారావు కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగాల కోసం కేవలం హిందీ, ఇంగ్లిష్ మాధ్యమంలో మాత్రమే పోటీ పరీక్షల నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని కేంద్రమంత్రి అమిత్ షాకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన అమిత్ షాకు ఓ లేఖ రాశారు. సీఆర్‌పీఎఫ్ ఉద్యోగ సిబ్బంది నియామకం కోసం చేపడుతున్న ఈ పరీక్షను తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళంతో పాటు గుర్తించబడిన అన్ని అధికారిక భాషల్లో నిర్వహించాలని కోరారు. కేవలం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే ఈ పోటీ పరీక్షలను నిర్వహించడంతో తీవ్ర వివక్ష ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆంగ్ల మాధ్యమంలో చదవని లేదా హిందీ ప్రాంతాలకు చెందని నిరుద్యోగ యువకులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 2020 నవంబర్ 18న ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం కేంద్ర ప్రభుత్వానికి ఇదే విషయమై లేఖ కూడా రాసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాంతీయ భాషల్లో చదువుతున్న కోట్లాది యువకుల పట్ల ఎలాంటి వివక్ష, అసమానతలు లేకుండా వారికి సమాన అవకాశాలు దక్కేలా సీఆర్‌పీఎఫ్ నోటిఫికేషన్‌కు సవరణ చేయాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు ఆయన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

పేపర్ల లీకేజీలో బీజేపీ హస్తం

- బండి సంజయ్‌పై 'ఉపా'చట్టం కింద కేసు పెట్టాలి
- వచ్చే ఎన్నికల్లో సీపీఎంతో కలసి పోటీ చేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో బీజేపీ హస్తం ఉన్నట్లుగా తాము భావిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్ పాత్ర బయటపడి ఉండకపోతే రోజుకో పేపర్ లీకయ్యేదని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఖమ్మంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎవరో ఒకరికి వాట్సాప్‌లో పేపర్ పెడితే.. ఆయన బండి సంజయ్‌కి పంపాడే తప్ప ఇందులో సంజయ్ తప్పేముందని కొందరు మాట్లాడడం గర్హనీయమని అన్నారు. ఫోన్‌లో జరిపిన చాటింగ్‌లో ఏం చేయాలి, ఎలా చేయాలి, ధర్నాలు చేయాలనే సూచనలు ఉన్నట్లుగా తెలుస్తోందని చెప్పారు. పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపే ఇలాంటి చర్యలు ఉగ్రవాద కుట్రల కంటే ప్రమాదకరమైనవి అయినందున సంజయ్‌పై ఉగ్రవాదులపై మోపే 'ఉపా'వంటి కఠిన చట్టాల ఆధారంగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, గతంలో సింగరేణిని ప్రైవేటీకరించబోమని చెప్పిన ప్రధాని.. ఇప్పుడు ప్రైవేట్ వారికి ఇచ్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఈనెల 14న హైదరాబాద్ నుంచి మొదలుపెడుతున్న యాత్ర వచ్చేనెల 14న కొత్తగూడెం చేరుకుంటుందని, ఈ సందర్భంగా లక్ష మందితో సభ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం కలసి పోటీ చేస్తాయని కూనంనేని తెలిపారు. ఈ అంశంపై 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అన్నం కోసం తన్నులాట

టెంట్లు కూల్చి.. కుర్చీలు పగులగొట్టి.. • బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో రసాభాస


సీరోలులో ఆత్మీయ సమ్మేళనంలో కార్యకర్తలు కూల్చిన టెంట్లు

కురవి: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం రసాభాసగా మారింది. చాలామంది భోజ నం చేయగా..సుమారు వందమంది కార్యకర్తలకు సరిపోలేదు. దీంతో కాంపల్లి, సీరోలు బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య గొడవ తలెత్తింది. కొందరు అన్నం గిన్నె, కూర గిన్నెలను లాక్కునేందుకు ప్రయత్నించగా.. మరికొందరు టెంట్లను కూలివేసి కుర్చీలను పగులగొట్టారు. పోలీసులు కల్పించుకుని కార్యకర్తలను చెల్లాచెదురు చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆత్మీయ సమ్మేళనం జరిగిన స్టేజీపై నుంచి కార్యకర్తల ఘర్షణను చూసి నిర్ఘాంతపోయారు. ఈ నెల 5న అయ్యగారిపల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలోనూ గ్రామస్తులు కూర గిన్నెలు, అన్నం గిన్నెలు ట్రాక్టర్‌లో ఎత్తుకెళ్లిపోయారు. రెండు ఆత్మీయ సమ్మేళనాల్లో భోజనాల విషయంలో గొడవలు జరగడం గమనార్హం.

బీజేపీలో చేరిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

పార్టీలోకి ఆహ్వానించిన ప్రహ్లాద్‌జోషి, అరుణ్ సింగ్



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బీజేపీలో చేరారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్‌లు సభ్యత్వ రసీదు అందజేసి, పార్టీ కండువా కప్పి ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ.. కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ అనుభవం తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ఉపకరిస్తుందన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అవినీతిపై ప్రధాని మోదీ అద్భుతంగా పోరాడుతున్నారని చెప్పారు. అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు.

కుస్తీమే సవాల్..!


కుస్తీ పోటీలో తలపడుతున్న మల్ల యోధులు

కుంటాల: కుంటాలలో మహాదేవుని పౌర్ణమి, శ్రీ వీరహనుమాన్ జయంతి పురస్కరించుకుని శుక్రవారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. తెలంగాణలోని నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో మల్ల యోధులు పాల్గొన్నారు. పోటీల్లో తలపడ్డారు. మొత్తం 60 కుస్తీ పోటీలు నిర్వహించగా మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన యోగేష్ పటేల్, నాందేడ్ జిల్లా బోకర్ తాలూకాలోని బిద్రాలి గ్రామానికి చెందిన ఉమాటి సాయినాథ్ ఫైనల్ పోటీలో తలపడ్డారు. ఉమాటి సాయినాథ్ విజేతగా నిలిచాడు. రూ.5వేల నగదుతోపాటు వెండి కడియం బహూకరించి శాలువాతో సన్మానించారు. అనంతరం మహాదేవుని ఆలయంలో పూజలు నిర్వహించి జంగం మధు ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమతావెంకటేశ్, సింగిల్ విండో చైర్మన్ సట్ల గజ్జారాం, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, రఘు పటేల్, సబ్బిడి గజేందర్, బోగ లక్ష్మణ్, అరిగెల శంకర్, ఎల్లమ్మల శంకర్, కుమ్మరి సాయన్న, వీడీసీ గజ్జారాం, కుమ్మరి రమేశ్ పాల్గొన్నారు.

ఒంటిచేత్తో కుస్తీ..


పోటీలో తలపడుతున్న దేశాయి గణేష్

కుంటాల: కుంటాలలో నిర్వహించిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీల్లో ఒంటి చేత్తో పోరాడి విజేతగా నిలిచాడు దేశాయ్ గణేశ్. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా కర్కెల్లి గ్రామానికి చెందిన దేశాయి గణేశ్ 2013 సంవత్సరంలో ఐదో తరగతి చదువుతుండగా ప్రమాదవశాత్తు కుడి చేయి కోల్పోయాడు. 12 ఏళ్లుగా కుస్తీ పోటీల్లో పాల్గొంటున్నాడు. కుంటాలలో నిర్వహించిన 2 కుస్తీ పోటీల్లో విజేతగా నిలిచి శభాష్ అనిపించుకున్నాడు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో ఎక్కడ కుస్తీ పోటీలు నిర్వహించినా తాను పాల్గొంటానని గణేశ్ తెలిపాడు.

కొమొరెడ్డి రామ్‌లుకు కన్నీటి వీడ్కోలు

- భారీసంఖ్యలో తరలివచ్చిన అభిమానులు
- హాజరైన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు


హాజరైన కేశవరావు, విద్యాసాగర్‌రావు తదితరులు


మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు అంతిమయాత్రకు హాజరైన అభిమానులు, ప్రముఖులు

మెట్‌పల్లి(కోరుట్ల): కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. అభిమానులు, కుటుంబసభ్యులు అశ్రునయనాల మధ్య ఆయనకు తుదివీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న రామ్‌లు.. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. బుధవారం గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆ తర్వాత మెట్‌పల్లి పట్టణంలోని ఆయన నివాసానికి పార్థివదేహం తరలించారు. కాగా, శుక్రవారం అక్కడి నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర.. పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ మీదుగా వెంకట్రావ్‌పేట శివారు వరకు కొనసాగింది. అక్కడి ఆయన వ్యవసాయ క్షేత్రంలో దహన సంస్కారాలు పూర్తిచేశారు. కోరుట్ల నియోజకవర్గం నుంచే కాకుండా గత మెట్‌పల్లి నియోజకవర్గంలోని కథలాపూర్, మేడిపల్లి మండలాల నుంచి కూడా భారీసంఖ్యలో రామ్‌లు అభిమానులు తరలివచ్చారు. తమ నేతకు కన్నీటి వీడ్కోలు పలికారు. రాజ్యసభ ఎంపీ కేశవరావు, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఆర్థిక సంఘం చైర్మన్ రాజేశంగౌడ్, మాజీ ఎంపీ హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు కటుకం మృత్యుంజయం, కల్వకుంట్ల సుజీత్‌రావు, జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొని రామ్‌లుకు నివాళిర్పించారు.


రోదిస్తున్న రామ్‌లు కుటుంబసభ్యులు

అడవిని నరికితే కఠిన చర్యలు

- కవ్వాల్ టైగర్‌జోన్ ఇన్‌చార్జి ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు
- పలు గ్రామాల్లో ఏకకాలంలో తనిఖీలు
- రూ.6 లక్షల విలువైన ఫర్నిచర్ స్వాధీనం


అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఫర్నిచర్


ఉట్నూర్‌రూరల్: అడవిని ఇష్టానుసారం నరికి కలపను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఉట్నూర్ కవ్వాల్ టైగర్‌జోన్ ఇన్‌చార్జి ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కలప స్థావరాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎఫ్‌డీవో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో కొందరు అడవిలోని చెట్లను నరికి కలపను అక్రమంగా ఉట్నూర్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపారు. చన్నగంగాపూర్, రాజులమడుగు, పాత ఉట్నూర్, దంతన్‌పల్లి, పెద్ద గంగాపూర్ వంకతుమ్మ, తాండ్ర గ్రామాల్లో 150మంది సిబ్బంది, డాగ్ స్క్వాడ్‌తో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. రూ.6లక్షల విలువైన ఫర్నిచర్, వడ్రంగి సామగ్రి స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. అక్రమంగా కలప రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తాండ్ర, నేరడిగొండ, సిరిచెల్మ రేంజ్ సిబ్బంది ఆధ్వర్యంలో కుంటాల, అద్దెల తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల్లో దాడులు నిర్వహించారు. నాలుగు మిషన్లతో పాటు కలప సీజ్ చేసినట్లు తెలిపారు.


పలువురిపై కేసులు

ఉట్నూర్ మండలంలోని పిండి ప్రభాకర్, మధుకర్, రాజన్న, అంజిత, జాడి రాజేశ్వర్, పవర్, కరీం, రాజన్న, టేకం దేవురావు, అంకన్నపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఖానాపూర్, ఉట్నూర్, ఆసిఫాబాద్, జన్నారం, అటవీ రేంజ్‌లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్యాంశమైన 'పెద్దింటి' 'లాంగ్‌మార్చ్'

- ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమ నవల
- రచయిత పెద్దింటి అశోక్‌కుమార్‌కు అరుదైన గుర్తింపు


పెద్దింటి అశోక్ కుమార్


'లాంగ్ మార్చ్' ముఖచిత్రం

సిరిసిల్ల: తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ప్రముఖ కథ, నవలా, సినీ మాటల రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన 'లాంగ్‌మార్చ్' నవల ఉస్మానియా యూనివర్సిటీలో పాఠ్యాంశమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన లాంగ్‌మార్చ్ నవల ఉస్మానియా యూనివర్సిటీ ఎం.ఏ. తెలుగు విద్యార్థులకు థర్డ్ సెమిస్టర్‌లో పాఠ్యాంశంగా ఎంపికైంది. తెలంగాణ ఉద్యమంలో మైలురాయిగా భావించే ట్యాంక్‌బండ్‌పై జరిగిన మిలియన్ మార్చ్ సంఘటన రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిపోసింది. ఆ నేపథ్యంలో జరిగిన కథాంశాన్ని వాస్తవ సంఘటనలతో అప్పటి తెలంగాణ సమాజాన్ని, ప్రజల భావోద్వేగాలను ఉన్నది ఉన్నట్టుగా అక్షరీకరించిన ఈ 'లాంగ్‌మార్చ్' నవల ఇప్పుడు ఎంఏ తెలుగు విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపికవడం విశేషం. తెలంగాణ ఉద్యమానికి పురిటిగడ్డ అయిన ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీకి 'లాంగ్‌మార్చ్' నవలను పాఠ్యాంశంగా ఎంపిక చేయడం అరుదైన అంశం. రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన పలు కథలు, నవలలు వివిధ యూనివర్సిటీల్లో ఇప్పటికే పాఠ్యాంశాలుగా ఉన్నాయి. ఆయన రాసిన 'జిగిరి' నవల ఓరియంటల్ కాలేజీలో ఎంఏ విద్యార్థులకు పాఠ్యాంశమైంది. ఈ 'లాంగ్ మార్చ్' నవల అన్వీక్షికి పబ్లిషర్స్ ప్రచురించింది. ఈ నవల ఇప్పటికే రెండు రెండుసార్లు ముద్రితమైంది. ఈ నవల త్వరలో చలనచిత్రంగా రాబోతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పెద్దింటి అశోక్‌కుమార్ రెండున్నర దశాబ్దాలుగా కథలు, వ్యాసాలు, నవలలు రాస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆయన రాసిన లాంగ్‌మార్చ్ పాఠ్యాంశం కావడంతో మరోసారి పెద్దింటికి అరుదైన గుర్తింపు లభించింది.

జాలర్లకు దొరికిన వింత చేప


ధర్మారంలో లభించిన చేపను చూపుతున్న జాలరి

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో జాలర్లకు వింత చేప లభించింది. శుక్రవారం జాలర్లు వేటకు వెళ్లగా నల్లగా, గోధుమ రంగుల గీతలు ఉన్న చేప లభించింది. వింతగా ఉండడంతో గ్రామస్తులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇది రాక్షసచేప అని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

బాసరలో భక్తుల సందడి


ఆలయంలో భక్తుల రద్దీ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భైంసా: బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు చేయించారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 8-4-2023

ఆమె పేరులో భాగ్యం ఉంది.
ఆ భాగ్యం జీవితంలో కొరవడింది.
ఆమె పేదరికంతో పోరాడింది.
శారీరక వైకల్యంతో ఎదురీదింది.
సమాజంలో విజేతగా నిలిచింది.
అభినందనలు అందుకుంటోంది.

భాగ్య మయూరి



తమిళనటి, నర్తకి సుధాచంద్రన్ ఒక అద్భుతం. నాట్య మయూరిగా పేరు తెచ్చుకుంది. నెమలిలా నాట్యం చేసే ఆమెతో విధి వింత నాటకం ఆడింది. ఒక కాలిని తీసుకెళ్లింది. ఆమె నిర్ఘాంతపోయింది. నడవడమే కష్టం అనుకున్న స్థితి నుంచి కోలుకుని కృత్రిమ కాలితో నాట్యం చేసింది. మన తెలుగు నాట్య మయూరితో విధి మరింత ఘోరంగా ఆటలాడుకుంది. ఆమెను ఒక్క కాలితోనే భూమ్మీదకు పంపించింది. డాన్స్ చేయాలంటే రెండు కాళ్లు ఉంటే మంచిదే... కానీ లేదని ఊరుకోవడమెందుకు? ఒక కాలు లేకపోతేనేం... మరో కాలుందిగా... అంటూ డాన్స్ చేస్తోంది. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం గెలిచాయి. తెలంగాణ జానపద కళలంటే ప్రాణం పెట్టే భాగ్య అందులోనే ఎం.ఏ చేస్తోంది. తన విజయగాథను సాక్షితో పంచుకుంది.


నాట్య ప్రదర్శనలో...

బస్సులు మారలేక...

''మాది మహబూబాబాద్ జిల్లా, గూడూరు గ్రామం. అమ్మ కూలిపనులకు వెళ్తుంది. నాన్న మేకలు కాస్తాడు. అన్న, నేను ఇద్దరం పిల్లలం. నేను పుట్టడమే ఒక విచిత్రం. బిడ్డ ఒక కాలు లేకుండా పుట్టిందని ఊరంతా వచ్చి చూశారట. ఆ తర్వాత నేను పెరగడం, చదువు, డాన్స్ నేర్చుకోవడం... అన్నీ విచిత్రంగానే గడిచాయి. సెవెన్త్ క్లాస్ వరకు వరంగల్ జిల్లా, నెక్కొండ మండలం, పెద్ద కొర్పోల్‌లో చదువుకున్నాను. ఆ తర్వాత హన్మకొండలో సాగింది. ఇంటర్ ప్రైవేట్ కాలేజ్‌లో చదివించడం డబ్బుండి కాదు. ప్రభుత్వ కాలేజీకి రెండు బస్సులు మారి వెళ్లాల్సి ఉండింది. నేనలా వెళ్లలేనని ప్రైవేట్ కాలేజ్‌లో చేర్చారు. వరంగల్ ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ చేసి, ఇప్పుడు హైదరాబాద్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో జానపద కళల్లో ఎం.ఏ. చేస్తున్నాను. ఇంతకీ నేను డాన్సర్‌గా మారిన వైనం మరీ విచిత్రం.

కొత్త అడుగులు

ఎల్‌బి స్టేడియంలో ఇచ్చిన ప్రదర్శన నా జీవితాన్ని కొత్తగా రాసింది. డిసెంబర్ మూడవ తేదీ 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్'. ఆ సందర్భంగా లాల్ బహదూర్ స్టేడియంలో నాలుగు రోజుల ముందు నుంచి ఆటలు, డాన్స్ ప్రోగ్రామ్‌లు జరిగాయి. నా డాన్స్ ఫొటోలు పేపర్‌లో వచ్చాయి. ఆ పేపర్ చూసి మా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కిషన్‌రావు సర్ నన్ను పిలిచి మాట్లాడారు. మా ఆర్థిక పరిస్థితి, గవర్నమెంట్ పెన్షన్‌తో హాస్టల్ ఫీజు కట్టుకుంటూ చదువుకుంటున్నానని తెలుసుకుని ఆయన చలించిపోయారు. ఆయన ఎవరెవరితో మాట్లాడారో తెలియదు. వీసీ సర్, రిజిస్ట్రార్ సర్ కలిసి మూడు లక్షల నిధులు సేకరించి, జర్మనీ నుంచి డాన్స్ చేయడానికి వీలుగా ఉండే ప్రోస్థటిక్ లెగ్‌ను తెప్పించి పెట్టించారు. ఇప్పుడు ఆ కాలితో నడక ప్రాక్టీస్ చేస్తున్నాను. నడక మీద పట్టు వచ్చిన తర్వాత డాన్స్ చేస్తాను.


కృత్రిమ కాలు అమర్చిన తర్వాత...

బాలెన్స్‌కి నెల పట్టింది

నేను నైన్త్ క్లాస్‌లో ఉన్నప్పుడు జరిగిందా విచిత్రం. ప్రముఖ డాన్సర్ లారెన్స్ మాస్టారి ఆలోచన నన్ను డాన్సర్‌ని చేసింది. ఆయన దగ్గర పని చేసిన ప్రశాంత్ మాస్టారు స్పెషల్లీ ఏబుల్డ్ పిల్లలకు డాన్స్ నేర్పించడానికి మేమున్న హాస్టల్‌కి కూడా వచ్చారు. అలా అప్పుడు వాళ్లు పది మందికి పైగా స్టూడెంట్స్‌ని సేకరించి డాన్స్ క్లాసులు మొదలు పెట్టారు. వారిలో స్టేజ్ మీద ప్రదర్శనలిచ్చే స్థాయికి చేరింది ముగ్గురమే. అప్పటివరకు కర్ర లేకుండా నిలబడగలమనే ఊహ కూడా లేని వాళ్లమే అందరం. మొదట ఒక కాలి మీద దేహాన్ని బాలెన్స్ చేయడం సాధన చేశాం. బాలెన్స్ సాధించడానికి నెల పట్టింది. సినిమా పాటలు, జానపద నృత్యం, బతుకమ్మ పాటలు ప్రాక్టీస్ చేశాను. ఆ కోర్సు తర్వాత కూడా సొంతంగా కొన్ని పాటలకు సాధన చేశాను. టీవీ ప్రోగ్రామ్‌లలో కూడా డాన్స్ చేశాను. దసరా ఉత్సవాలు, వినాయక చవితి, ఇతర సమావేశాల్లో అవకాశాలను వెతుక్కుంటూ నాట్యం చేస్తున్నాను. శివరాత్రికి వేములవాడ రాజరాజేశ్వరస్వామి గుడిలో కూడా నాట్యం చేశాను. ఇక్కడ మరో విచిత్రం... ఏమిటంటే, సిట్టింగ్ వాలీబాల్ ఆడే అవకాశం వచ్చింది. ఈ ఆటకు మన దగ్గర పెద్దగా ఆదరణ లేదు. రాజస్థాన్, హర్యానా, తమిళనాడు, కర్నాటకల్లో జరిగిన పోటీలకు హాజరయ్యాను. థాయ్‌లాండ్‌లో జరిగే పోటీలకు ఎంపిక ప్రక్రియలో నెగ్గాను. మనదేశం తరఫున ఆడే అవకాశం వచ్చింది. కానీ కరోనా కారణంగా వెళ్లలేకపోయాను.

తెలంగాణ ఆట పాట

ఫోక్ ఆర్ట్స్ కోర్సులో భాగంగా డప్పు, జానపదగేయాలు, కర్రసాము, చెక్క భజన వంటి తెలంగాణ సంప్రదాయ కళలను నేర్చుకున్నాను. బతుకమ్మ పాటలను సేకరించి పాడాను. ఇతర పాటలు పాడే అవకాశాలు ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. డాన్స్‌లో కూడా నిరూపించుకుంటాను. నాకు సీటు ఇచ్చేటప్పుడు సీటు వృథా అవుతుందేమోనని సందేహించిన యూనివర్సిటీనే ఇప్పుడు నాకు అండగా నిలిచింది. నేను ఎవరికీ భారం కాకూడదు, నా కాళ్ల మీద నేను నిలబడాలనే పట్టుదలే నన్ను ఇంతవరకు నడిపించింది'' అని చెప్పింది భాగ్య. సవాళ్లను ఎదుర్కొనే మనోధైర్యం ఆమె సొంతం. ఆడపిల్లలకు ధైర్యం ఒకింత ఎక్కువగా ఉండాలని చెప్తోంది. బాలికలకు కర్రసాము నేర్పించి ధీరలుగా మలవాలనే ఆమె ఆశయం, జానపదానికి సేవ చేయాలనే ఆమె ఆకాంక్ష నెరవేరాలి.

– వాకా మంజులారెడ్డి

రంగస్థలం

త్రినేత్ర త్రికాల నాటకం

'మహిళల జీవితంలో నెలసరి అనేది ఒక భాగం'. ఈ వాస్తవాన్ని పట్టించుకోకుండా ఎన్నో ప్రాంతాలలో, ఎన్నో రకాలుగా నెలసరికి సంబంధించి మూఢ నమ్మకాలు, ఆంక్షలు ఉన్నాయి.
వాటిని 'థీన్‌దరిపచా' నాటకం సూటిగా ప్రశ్నిస్తోంది.
అజ్ఞాన జాడ్యాలను కడిగి పారేస్తూ, కొత్త ఆలోచనకు వేదిక అవుతోంది...

కేరళలోని త్రిస్సూర్ జిల్లాకు చెందిన పన్నెండు మంది మహిళలు నటించిన థీన్‌దరిపచా (రుతుమతి) నాటకం వివిధ ప్రాంతాలలో ప్రదర్శితమవుతూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. 'త్రిస్సూర్ స్కూల్ ఆఫ్ ఆర్ట్' ఫ్యాకల్టీ శ్రీజిత్ రమణన్ ఈ నాటకానికి దర్శకత్వం వహించాడు.

నాటకం స్క్రిప్ట్ విషయానికి వస్తే అది జడపదార్థంలా ఎప్పుడూ లేదు. తొలినాటకం నుంచి స్క్రిప్ట్ మారుతూనే ఉంది. కొత్త అంశాలను జోడిస్తూనే ఉంది. రిహార్సల్స్ సమయంలో నటీమణులు తమ వ్యక్తిగత అనుభవాలు, పడిన బాధలను స్క్రిప్ట్‌లోకి తీసుకువచ్చారు. అన్ని అనుభవాలు ఒకే రకంగా ఉన్నట్లుగా అనిపించినా సూక్ష్మదృష్టితో చూస్తే... వయసు, కుటుంబ నేపథ్యం, ప్రాంతం ప్రకారం వేటికవే భిన్నమైనవిగా కనిపిస్తాయి.

'థీన్‌దరిపచా' నాటకానికి ఊపిరిపోసిన నటీమణులు... గార్గి, స్మిత, మృదుల, అంజన, అనుజ, శ్రీదేవి, అఖిల, సజిత, దీప్తి, విద్య, నీల, ఆత్మజ.

'ఈ నాటకంలో నటించడానికి నట ప్రతిభ ఒక్కటే సరిపోదు. సామాజిక అవగాహన కూడా ఉండాలి. అదృష్టవశాత్తు నాటకంలో నటించిన పన్నెండు మందిలో సామాజిక స్పృహ ఉంది. విశ్లేషణ సామర్థ్యం ఉంది. స్క్రిప్ట్‌కు ఊపిరి పోసి జీవం పోశారు' అంటున్నాడు డైరెక్టర్ శ్రీజిత్.



గంట నిడివి ఉన్న ఈ నాటకం ఎన్నో ఇండ్లను కంటి ముందుకు తీసుకువస్తుంది.

ఒక ఇంట్లో...

'తల్లీ... కొన్ని రోజులు ఆ పచ్చళ్ల జాడీలను ముట్టుకోవద్దు'

మరో ఇంట్లో...

'ఈ సమయంలో పూలచెట్లను ముట్టుకోవద్దని నీకు ఎన్నిసార్లు చెప్పాను'

ఇంకో ఇంట్లో...

'కొన్నిరోజుల వరకు నువ్వు వంటగదిలోకి రావద్దమ్మా'

ఇది ఒకే ఒక కథను చెప్పే నాటకం కాదు. ఎన్నో ఇండ్లలోని సంఘటనలు, జ్ఞాపకాలు, శుభకార్యాలు, పీడకలలు... ఎన్నో కోణాలలో ఎన్నో అంశాలకు అద్దం పడుతుంది.

ఒక అమ్మాయి గొంతు నుంచి తన తొలి పీరియెడ్ అనుభవాన్ని రికార్డ్ ద్వారా వినిపించడంతో నాటకం మొదలవుతుంది.



కొత్త టూల్స్, మ్యూజిక్, డ్యాన్స్, డైలాగులు, బాడీ మూమెంట్స్, కలర్ పాటర్న్స్‌తో ఈ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

ఎరుపురంగు శాలువా, ఫాబ్రిక్స్, లైట్స్‌ను సందర్భానికి తగినట్లుగా బయోలాజికల్ రియాలిటీ అనే అంశానికి ప్రతీకాత్మకంగా వాడారు.

ఫాంటస్మాగోరియ (రకరకాల ఎలిమెంట్స్‌తో మారే సీన్‌లు, కలలలో కనిపించే అంశాలకు రూపం ఇవ్వడం) టెక్నిక్‌ను ఈ నాటకం కోసం వాడుకున్నారు.

సోషల్ సైకిల్‌కు సింబాలిక్‌గా నాటకాన్ని ఒక సర్కిల్‌లో ప్రదర్శిస్తారు. చుట్టూ ప్రేక్షకులు కూర్చుంటారు. నాటకంలో నటించేవారు ఉన్నట్టుండి ప్రేక్షకుల్లోకి వచ్చి సామాజిక విషయాలపై సంభాషిస్తూ వారిని కూడా నాటకంలో భాగం చేస్తారు.

'ఇది గత, వర్తమాన, భవిష్యత్‌లకు సంబంధించిన త్రికాల నాటకం' అంటుంది నాటకంలో నటించిన మృదుల.

'వర్క్ ఇన్ ప్రోగ్రెస్‌లాగా ప్లే ఇన్ ప్రోగ్రెస్‌లాంటి నాటకం ఇది' అంటుంది మరో నటి అఖిల.

బ్యూటిప్స్



మేనికాంతి కోసం...

చర్మం నిగనిగలాడుతూ ఉండటం కోసం, ముఖం మెరుపులీనడం కోసం రకరకాల క్రీములు, మందులు వాడుతుంటారు చాలామంది. అయితే వాటితోపాటు ఒత్తిడి కూడా లేకుండా చూసుకోవడం అవసరం. ఎందుకంటే ఒత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యలు శారీరక ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతాయి. ఫలితంగా ముఖం పీక్కుపోయినట్లు ఉండటం, జిడ్డు కారుతూ ఉండటం, చెమట ఎక్కువగా పట్టడం, చర్మంపై చిన్న చిన్న దద్దులు, పొక్కులు వంటివి రావడం వంటి సమస్యలు తీవ్రం అవుతాయి. ఈ పరిస్థితిలో యోగా, ధ్యానం వంటివి చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఒత్తిడి, మానసిక సమస్యలను అదుపులో ఉంచేందుకు కంటినిండా నిద్రపోవడం కూడా ఎంతో మేలు చేస్తుంది.




- చర్మం మెరుస్తూ ఉండాలంటే చర్మ సంరక్షణ చాలా ముఖ్యం. చర్మాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవడానికి రెగ్యులర్ ఫేషియల్స్, క్లీనప్‌లు చేయాలి. శనగ పిండి, పసుపు, పెరుగు, తేనె వంటి ఇంటి చిట్కాలు చర్మాన్ని తళతళ మెరిసేలా చేయడంలో సహాయపడతాయి.



- ఆహారంలో అన్ని రకాల పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోవాలి. శరీరానికి అన్ని ముఖ్యమైన పోషకాలు, విటమిన్‌లను పుష్కలంగా అందించడానికి కొన్ని ప్రత్యేక పద్ధతులను అవలంబించాలి. ఆహారంలో కూరగాయలు, పండ్లను సమృద్ధిగా ఉండేలా చూసుకుంటే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది.

కిచెన్ టిప్స్

- కూరగాయలను తరగడం పూర్తయిన తర్వాత చాపింగ్ బోర్డును శుభ్రం చేయడం కొంచెం చిరాగ్గానే ఉంటుంది. చాకు వెనుక వైపు (పదును లేని వైపు) తిప్పి బోర్డు మీద రుద్దితే కూరగాయల అవశేషాలు సులువుగా ఊడి వచ్చేస్తాయి.



- మైక్రోవేవ్‌లో చేపలను వండిన తర్వాత ఆ వాసన వదలడం కష్టం. చిన్న టవల్‌ను ఒవెన్‌లో పెట్టి అర గంట సేపు వేడి చేస్తే వాసన క్లాత్‌కు పట్టేస్తుంది. ఆ తర్వాత మరో శుభ్రమైన టవల్‌తో తుడిస్తే ఒవెన్ శుభ్రపడుతుంది.
- అల్లం పొట్టు తొలగించడం పెద్ద పరీక్షగానే ఉంటుంది. చాకుతో తీస్తే పొట్టుతోపాటు అల్లం కూడా పోతుంది. స్పూన్‌తో ప్రయత్నిస్తే అల్లం మలుపుల్లో ఉండే పొట్టు కూడా సున్నితంగా వదులుతుంది.

పాజిటివ్ ఎనర్జీ

ఇది నా ప్రియ నర్తన హేల

కళ ఆమెకు ఊపిరి పోస్తున్నదో కళకు ఆమె ఆయువు ఇస్తున్నదో గాని వేదిక మీద కథక్ ప్రదర్శన ఇచ్చే అలకనందను చూస్తే ప్రతి ఒక్కరికీ ప్రతికూల పరిస్థితులపై పోరాడాలని అనిపిస్తుంది. ఒవేరియన్ క్యాన్సర్‌తో పోరాడుతూ కీమోథెరపీ తీసుకుంటూ కూడా అలకనంద తన కథక్ కళను కొనసాగిస్తోంది. ఒడిషాకు చెందిన ఈ కళాకారిణి ఓటమిని అంగీకరించవద్దంటోంది.


అలకనంద

గత ఆగస్టులో ఇది జరిగింది.

వేదిక మీద అలకనంద దాస్‌గుప్త కథక్ ప్రదర్శన ఇస్తోంది. జనం మమేకమై చూస్తూ ఉన్నారు. ఆమె తల మీద దుపట్టాను చుట్టుకుని నృత్యం చేస్తోంది. అందరూ ఆస్వాదిస్తూ ఉన్నారు. ఒక్కసారిగా ఆమె దుపట్టా తొలగించింది. అంతే. అందరూ ఆశ్చర్యపోయారు. దానికి కారణం ఆమె శిరోముండనం చేసుకుని ఉండటమే. కొన్ని క్షణాలే. ఆ తర్వాత ఆమె నృత్యం కొనసాగించింది. సాధారణంగా మహిళా నృత్యకారిణికి జడే అందం. జడ లేకుండా నృత్యం చేస్తే చూడటానికి ప్రేక్షకులు పెద్దగా ఇష్టపడరు. కాని అలకనంద తాను ఎలా ఉన్నానో అలా కనిపించి, వారిని మెప్పించింది. ప్రదర్శన అనంతరం అందరూ కరతాళధ్వనులు మార్మోగించారు.


అలకనంద

'శిరోజాలు నా శరీరంలో ఒక భాగం. అవి మాత్రమే నేను కాదు. కీమో థెరపి వల్ల వెంట్రుకలు రాలిపోతున్నాయి. అందుకని ముండనం చేయించాను. ఇలా కూడా నా ప్రేక్షకుల ముందుకు రావాలనుకున్నాను' అంది 48 ఏళ్ల అలకనంద.

ఆమె కొంతకాలంగా ఒవేరియన్ కేన్సర్‌తో పోరాడుతూ ఉంది. కాని పోరాటం పోరాటమే నృత్యం నృత్యమే. 'నాకు ఆరేళ్ల వయసులో కథక్ నేర్పించారు. 16 ఏళ్ల వయసు నుంచి ప్రదర్శనలు ఇస్తున్నాను. నృత్యం నాకు ఆక్సిజన్. అది లేకుండా బతకలేను. నాకు క్యాన్సర్ ఉందని గుర్తించాక డాక్టర్ పూర్తిగా డాన్స్ మానేయమని చెప్పింది. దాని బదులు మరణించడం మేలని అన్నాను. మనం ఒక్కసారే చనిపోతాం. రోజూ బతుకుతాం. ఒక్కసారి చనిపోయే రోజు కోసం ఎదురు చూస్తూ బతకాల్సిన ప్రతిరోజునూ ఎందుకు వృథా చేసుకోవాలి' అంటుందామె.

ఒడిషాకు చెందిన అలకనంద నోయిడాలో స్థిరపడింది. కథక్ నృత్యకారణిగా, గురువుగా ఆమె పేరు గడించింది. మహా భారతంలోని గాథలను కథక్ రూపకాలుగా ప్రదర్శించే తీరుకు చాలా ప్రశంసలు ఉన్నాయి. ముఖ్యంగా ద్రౌపది పాత్రలోని స్త్రీవాద కోణాన్ని ఆమె ప్రదర్శిస్తుంది. 'నృత్యం అంటే కాళ్లు చేతుల కదలిక కాదు. ప్రేక్షకుల్లో తేవాల్సిన కదలిక' అంటుందామె.

అయితే గత సంవత్సరం ఆమెకు క్యాన్సర్ రావడం ఆమె ఎదుట పెద్ద సవాలుగా నిలిచింది. 'ఏమైనా ఇది నన్ను ఓడించకూడదు అనుకున్నాను. ఒక సర్జరీ చేశారు. పొట్ట మీద 36 కుట్లు ఉన్నా రెండు నెలలు విశ్రాంతి తీసుకోమన్నా నేను నృత్యాన్ని మానేయాలనుకోలేదు. అంతెందుకు మూడో కీమో థెరపీ నుంచి ఆరో కీమో థెరపి మధ్యలో 15 షోస్ చేశాను' అంటుందామె.

అలకనంద దాస్‌గుప్తాకు ఇద్దరు అబ్బాయిలు. 'నా ఇద్దరు కొడుకులు నాకు మనో నిబ్బరం కలిగిస్తున్నారు. నేను డాన్స్ చేస్తానంటే అలాగే అమ్మా అని నా మనసు గ్రహిస్తున్నారు. జీవితంలో కష్టాలు ఉంటాయి. ఏదో ఒక పిచ్చి లేకపోతే ఆ కష్టాలను దాటడం కష్టం' అంది అలకనంద.

ఆమె చేస్తున్న ప్రియ నర్తనం కొనసాగుతూ ఉండాలని కోరుకుందాం.

సెల్ఫ్-స్టార్టర్

లాయరమ్మా! ది గ్రేట్

అనగనగా ఒక కథ. ఆ కథలో... ఒక వ్యక్తి ముందుకు వెళుతున్న కొద్దీ కొత్త వస్తువులు, నగలు, నిధులు కనిపిస్తుంటాయి. 'నిల్చున్నచోటే ఉండకుండా నువ్వు ఎంత ముందుకు వెళితే అన్ని అద్భుతాలు కనిపిస్తాయి' అంటుంది ఆ కథ. చిన్నప్పుడెప్పుడో ఈ కథ విన్న అర్చన ముందుకు వెళుతూనే ఉంది. విజయాలు సాధిస్తూనే ఉంది. తాజాగా భారత వాణిజ్య, పారిశ్రామిక మండళ్ల సమాఖ్య (ఫిక్కీ) మహిళల విభాగానికి (ముంబై చాప్టర్) ఛైర్‌పర్సన్‌గా ఎంపికైంది అర్చనా ఖోస్లా బర్మన్...

తమిళనాడులోని వెల్లింగ్‌టన్ టౌన్‌లో పుట్టిన అర్చన అస్సాం నుంచి గుజరాత్ వరకు ఎన్నో రాష్ట్రాలలో చదువుకుంది. పంజాబ్‌లోని 'మొహాలి ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా'లో చదువుకున్న అర్చన దేశంలోని ప్రసిద్ధ లా ఫర్మ్‌లలో పనిచేసింది.


అర్చనా ఖోస్లా బర్మన్

వ్యాపార ప్రారంభంలో వ్యాపార అవసరాలు మాత్రమే కాదు వివిధ దశలలో 'లీగల్ వర్క్'తో కూడా పని ఉంటుంది. చాలామంది ఔత్సాహికులకు ఈ 'లీగల్ ప్రాసెస్' అనేది సజావుగా జరగదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటయిందే... వెర్టిసెస్ పార్ట్‌నర్స్.

కార్పొరేట్ లాయర్‌గా తొమ్మిది సంవత్సరాలు పని చేసిన తరువాత వినాయక్ బర్మన్, అమిత్ వ్యాస్‌లతో కలిసి 'వెర్టిసెస్ పార్ట్‌నర్స్' పేరుతో సొంతంగా లా ఫర్మ్ మొదలుపెట్టింది. మహిళా వ్యాపారులు, ఇన్వెస్టర్‌లకు న్యాయ సహాయం, సలహాలు అందించడానికి ఏర్పాటయిన ఈ సంస్థ 'హార్డ్ అండ్ ఆనెస్ట్' నినాదంతో ముందుకు వెళ్లింది.

మొదలైన సంవత్సరంలోనే 'డెబ్యూ లా ఫర్మ్ ఆఫ్ ది ఇయర్-ప్రైవేట్ ఈక్విటీ'అవార్డ్ అందుకుంది.

అర్చనా ప్రాక్టీస్ ఏరియాలు...కార్పొరేట్ కమర్షియల్ లా, వెంచర్ క్యాపిటల్ అండ్ ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్.

ఒకవైపు సంస్థ పనుల్లో తలమునకలవుతూనే మరోవైపు స్త్రీ సాధికారత కోసం పనిచేస్తున్న సంస్థలు, ఎన్నో అంకుర సంస్థలు, ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లతో కలిసి పనిచేసింది అర్చన.

'ఎఫ్‌ఎల్‌వో-ఫిక్కీ లేడిస్ ఆర్గనైజేషన్ మహిళా వ్యాపారుల కోసం ఎన్నో శక్తిమంతమైన కార్యక్రమాల చేపట్టింది. ఎఫ్‌ఎల్‌వో-ముంబై చాప్టర్‌కు ఛైర్‌పర్సన్‌గా ఎంపిక కావడాన్ని గర్వంగా భావిస్తున్నాను' అంటుంది అర్చన.

2023-2024 లక్ష్యాల గురించి ప్రస్తావిస్తూ...

'పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మరింతమంది మహిళలు, యువతరంతో కలిసిపనిచేస్తాం. తాము వ్యాపారులుగా ఎదగడానికి ఏవైతే అడ్డుగోడలని వారు అనుకుంటున్నారో అలాంటి గోడలు లేకుండా చేసి కొత్త దారిని ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. వొకేషనల్ ట్రైనింగ్ ద్వారా గ్రామీణప్రాంతాలలోని మహిళలు, యువత జీవితాల్లో మార్పు తీసుకురావాలనుకుంటున్నాం. అట్టడుగు వర్గాల ప్రజల కోసం కొత్త కార్యక్రమాలు రూపొందించాలనుకుంటున్నాం. మహిళలను దృష్టిలో పెట్టుకొని చట్టపరమైన హక్కులు, విధుల గురించి అవగాహన సదస్సులు, హెల్త్ అండ్ వెల్‌నెస్ క్యాంపులు విస్తృతంగా నిర్వహించాలనుకుంటున్నాం' అంటుంది అర్చన.

గత ఏడు సంవత్సరాలుగా 'ఫిక్కీ'లో పనిచేస్తున్న అర్చన 'ఎఫ్‌ఎల్‌వో'లో వివిధ పదవులు నిర్వహించింది. 'స్టార్టప్ కారవాన్' పేరుతో ఔత్సాహిక మహిళ వ్యాపారుల కోసం ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించింది.

ఫోర్బ్స్ 'టాప్ లాయర్స్ ఇన్ ప్రైవేట్ ఈక్విటీ', ఏషియ లీగల్ బిజినెస్ (40 అండర్ 40), ఏషియా పెసిఫిక్ రీజియన్(40 అండర్ 40) జాబితాలో చోటు సంపాదించింది.

'నా వెనుక ఎవరూ లేరు అనుకొని అధైర్యపడేవారు హార్డ్‌వర్క్ ఉంది అనుకుంటే ఎంతో ధైర్యం వస్తుంది' అంటుంది అర్చనా ఖోస్లా బర్మన్.




అందరం ఆరోగ్యంగా ఉందాం

ఆరోగ్యం జాగ్రత్త... ఇది ప్రతి ఇంట్లో వినిపించే మాటే. అమ్మా నాన్నలకు క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయించే మంచి కొడుకున్న ఇళ్లు చాలానే ఉంటాయి. చంటి పిల్లల నుంచి పెద్ద పిల్లల వరకు వాళ్లు తుమ్మినా, తుమ్మక పోయినా పట్టించుకునే తల్లులూ ఉంటారు. అయితే అదే ఇంట్లో విపరీతమైన ఆరోగ్యనిర్ల క్ష్యానికి గురయ్యే రెండు ప్రాణాలు కూడా ఉంటాయి. వాళ్లు ఆ ఇంటి దంపతులే. పిల్లలను బాగా చూసుకుంటారు, వయసు మళ్లిన వాళ్లనూ శ్రద్ధగా చూసుకుంటారు. మన భారతీయ మనోఫలకం మీద ఆరోగ్యం అంటే యుక్త వయసు వచ్చే వరకు, వార్ధక్యం వచ్చిన తరవాత మాత్రమే పట్టించుకునే అంశంగా మారి పోయింది. ఇది కాదు నిజం. ఆరోగ్య సంరక్షణ అనేది నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియ.

కరోనా వచ్చి పోయింది. మధ్య వయసుకు దగ్గరలో ఉన్న మహిళల మీద వార్ధక్యం ఉన్న ఫళంగా దాడి చేసేసింది. మగవాళ్లలో అయితే యుక్తవయసులోనే ఉన్నట్లుండి గుండె ఆగిపోవడం చూస్తున్నాం. కరోనా తర్వాత ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రపంచం అంతటా శ్రద్ధ పెరిగింది. ఏం తినాలో, ఏం తిన కూడదోననే స్పృహ పెరిగింది. కానీ అంతకంటే ఎక్కువ అయోమయం కూడా పెరిగిపోయింది. సమతుల ఆహారం తీసుకోవడం గురించి మాట్లాడు తున్నాం, కానీ సమ్మిశ్రిత ఆహారం తీసుకోవడంలో విఫలమవుతున్నాం. మన దేహంలో ఏం లోపిం చిందో తెలుసుకుని, దానిని సరిగ్గా భర్తీ చేయ గలిగిన ఆహారాన్ని తీసుకోవాలి.

మాల్ న్యూట్రిషన్ తెలుసు... కానీ!

ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పోషకా హారం గురించిన అవగాహన పెరిగింది. అందులో సందేహం లేదు. ఈ తరంలో ఆర్థిక సమస్యల కారణంగా పోషకాహారలో పానికి (మాల్ న్యూట్రిషన్) గురవుతున్న వాళ్లు చాలా చాలా తక్కువ. జంక్‌ఫుడ్ వ్యామోహంలో పడి సూక్ష్మ పోషకాలలేమిని 'కొని' తెచ్చుకుంటున్న వాళ్లే ఎక్కువ. అలాగే దేహం పోషకాలను గ్రహించే విధానం తెలియక పోవడం వల్ల అనారోగ్యాల బారిన పడేవాళ్లు కూడా ఎక్కువవుతున్నారు. మాల్ అబ్జార్ప్షన్ గురించిన అవగాహన లేకపోవడంతో 'మంచి ఆహారం తీసు కుంటున్నాం' అనుకుంటూ కడుపు నిండా తింటున్నప్పటికీ దేహం ఆరో గ్యానికి దూరంగానే ఉంటోంది. అనా రోగ్యాలను నివారించలేకపోతోంది. అమ్మో! అంత అన్నమా ఎన్ని కార్బ్స్!



ఇది లైఫ్‌స్టైల్ డిసీజ్

ఎండ కన్నెరగని జీవితాల్లో డీ విటమిన్ లోపం సాధారణమైపోయింది. నరాలు, కండరాలు, వ్యాధినిరోధక శక్తి మీద విటమిన్ డీ ప్రభావం ఉంటుంది. దేహంలో డీ విటమిన్ లోపిస్తే... నీరసం, నిస్సత్తువ, తరచూ అంటువ్యాధుల బారిన పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. క్యాల్షియమ్ సమృద్ధిగా లభించే ఆహారాన్ని తీసుకున్నా సరే... దేహం ఆ క్యాల్షియమ్‌ను స్వీకరించదు. ఆహారంలోని క్యాల్షియమ్‌ని దేహం చక్కగా స్వీకరించాలంటే దేహంలో డీ విటమిన్ తగినంత ఉండాలి. అలాగే ఐరన్ కూడా. మనం ఆహారంలో తీసుకున్న ఐరన్‌ని దేహం గ్రహించాలంటే దేహంలో సీ విటమిన్ తగినంత ఉండాలి. విటమిన్ సీ లోపం ఉన్న వాళ్లు ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకున్నా సరే దేహం సంగ్రహించుకోలేదు. దాంతో ఐరన్ లోపం ఏర్పడి రక్తహీనతకు దారి తీస్తుంది. అంతేకాదు... మనం పీల్చిన గాలి నుంచి ఆక్సిజెన్ తగు పాళ్లలో మెదడుకు చేరడం కూడా ముఖ్యమే. అలాగే ఛాతీ నిండుగా గాలి పీల్చు కోగలగడమూ అంతే అవసరం.

వెళ్తాయో?! ఈ రోజు ప్రొటీన్ ఎంత తీసుకున్నాం' అని జాగ్రత్తలు తీసుకునే వాళ్లు కూడా సమ్మిళి తంగా తీసుకుంటున్నామా లేదా అని చూడడం లేదు. డాక్టర్‌ను సంప్రదించి మనదేహంలో ఏవి ఎంత పాళ్లలో ఉన్నాయో పరీక్ష చేయించుకుని ఏం తినాలో ఎలా తినాలో అవగాహన పెంచుకుందాం. అలాగే డాక్టర్‌ను చూడాల్సింది అనారోగ్యం వచ్చిన తర్వాత మాత్రమే అనుకుంటాం. అనారోగ్యాలను నివారించడానికి క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాలి. రొటీన్ చెకప్‌లకు క్రమం తప్ప కుండా వెళ్లాల్సింది వయసు మళ్లిన వాళ్లు మాత్రమే కాదు, వయసులో ఉన్న వాళ్లు కూడా. అప్పుడే ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉంటారు. ప్రతి ఇల్లూ ఆరోగ్యంగా ఉంటే... 'హెల్త్ ఫర్ ఆల్' అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఉద్దేశం నెరవేరు తుంది.

ఇవన్నీ తిందాం

దైనందిన ఆహారపు అలవాట్లలో భాగంగా అన్నం కూరలు, రొట్టె, పప్పులకు తోడుగా అవసరాన్ని బట్టి ఈ కింద చెప్పిన వాటిని ఆహారంలో భాగం చేసుకుందాం.

- క్యాల్షియమ్ కోసం... రాగులు, నువ్వులు, సబ్జా, అవిశె గింజలు, వాల్‌నట్, గెనుసు గడ్డ (స్వీట్ పొటాటో), పాలకూర, పుదీనలో క్యాల్షియమ్ పుష్కలంగా ఉంటుంది.
- ప్రొటీన్ పుష్కలంగా ఉండే సోయాబీన్స్‌తోపాటు మునగాకు, మునక్కాయలు వారంలో రెండు దఫాలు ఆహారంలో భాగం కావాలి. పాలు, పెరుగు లేదా మజ్జిగ రోజూ తీసుకోవాలి.
- ఐరన్ కోసం... మష్రూమ్, క్యాలీఫ్లవర్, లివర్, ట్యూనా ఫిష్, రొయ్యలు, బీట్‌రూట్, శనగలు, బ్రౌన్ రైస్, పుచ్చకాయ, దానిమ్మ, స్ట్రాబెర్రీలు, ఆపిల్‌తోపాటు విటమిన్ సీ సమృద్ధిగా ఉండే పైనాపిల్, పియర్, నారింజ, కమలాలు తీసుకోవాలి. డ్రైఫ్రూట్స్‌లో ఆప్రికాట్, కిస్‌మిస్, ఖర్జూరాలు, గుమ్మడి గింజలు నమిలి తినాలి. అన్ని కాలాల్లో దొరికే సంపూర్ణ పోషకాల అరటి పండ్లు నిత్య ఆహారంగా ఉండాలి.

పైవన్నీ తీసుకుంటే డీ విటమిన్ కూడా తగినంత అందుతుంది. మష్రూమ్, సోయా, గుడ్లు, పాలు, పెరుగు, మీగడలు, చేపలు డీ విటమిన్‌నిచ్చే ఆహారాలు. వీటితోపాటు రోజుకు కనీసం పావుగంట సేపు దేహానికి సూర్యరశ్మి తగలాలి. సూర్యరశ్మి సోకే చోట మార్నింగ్ లేదా ఈవెనింగ్ వాకింగ్ చేస్తే మంచిది.

ఇవి సాధారణ ఆరోగ్యం కోసం పాటించాల్సిన ప్రధానమైన ఆహార జాగ్రత్తలు మాత్రమే. మనదేహంలో క్యాల్షియమ్, ఐరన్ స్థాయిలను బట్టి డాక్టర్ సూచన మేరకు కచ్చితమైన డైట్ ప్లాన్‌ను అనుసరించాలి.



గింజలూ ఆరోగ్యకరమే!



బొప్పాయి పండు తరగగానే ముందు అందులో ఉండే గింజలు తీసి అవతల పారేస్తాం. బొప్పాయి గింజలపై జిగురు లాంటి పదార్థం ఉంటుంది. ఇవి కొద్దిగా కారంగా, చేదుగా ఉంటాయి. వీటిని ఎండబెట్టి.. మిక్సీలో పొడిలా చేసి తినవచ్చు. బొప్పాయి గింజల్లో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వు, ప్రోటీన్ ఉంటాయి. ఇంకా జింక్, ఫాస్పరస్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, కాల్షియం వంటి విటమిన్లు, ఖనిజాలు కూడా ఉంటాయి. ఇంకా ఈ గింజల్లో ఒలీక్ యాసిడ్, పాలీఫెనాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యాన్ని పెంచుతాయి.

బొప్పాయి గింజలు తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ సాధారణ స్థాయికి తగ్గుతుంది. వీటిలో ఉండే కార్పైన్ అనే పదార్థం పేగుల లోని పురుగులు, బ్యాక్టీరియాను చంపుతుంది. ఈ విత్తనాల లోని అధిక ఫైబర్.. పేగులు బాగా కదిలేలా చేస్తుంది. ఫలితంగా జీర్ణక్రియ బాగా జరుగుతుంది. మలబద్ధకాన్ని పోగొడుతుంది. బొప్పాయి గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచి.. శరీర వ్యర్థాలను తొలగిస్తుంది. శరీరంలో అనవసర కొవ్వు నిల్వ ఉండకుండా చేస్తుంది. ఫలితంగా త్వరగా బరువు తగ్గిపోతారు. బొప్పాయిలో ఉండే కెరోటిన్.... ఈస్ట్రోజెన్ లాంటి హార్మోన్ ఉత్పత్తిని నియంత్రిస్తుంది. బొప్పాయి గింజలు ఋతుక్రమం సరైన క్రమంలో ఉండేలా చేస్తాయి. పీరియడ్స్ నొప్పిని కొంతవరకూ తగ్గిస్తాయి. బొప్పాయి గింజల్లో విటమిన్ సి, ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ వంటి సమ్మేళనాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి మంట, నొప్పిని తగ్గిస్తాయి.

బొప్పాయి గింజల్లో పాలీఫెనాల్స్... అనేక రకాల క్యాన్సర్ల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. రోజూ 5 నుంచి 6 బొప్పాయి గింజలను తీసుకుని.. వాటిని చూర్ణంలా చేసి తినండి. లేదా పొడిలా చేసి నీటిలో కలిపి తాగేయండి. బొప్పాయి గింజల సారాన్ని తాగడం వల్ల... కడుపులో ఫుడ్ పాయిజనింగ్‌కు కారణమయ్యే బ్యాక్టీరియాలు చనిపోతాయి.

జీవక్రియలు వేగం పుంజుకోవాలంటే..?



మనం చాలాసార్లు మెటబాలిజం అనే పదాన్ని వింటూ ఉంటాం. శరీరం శక్తిని ఖర్చు చేసే వేగమే మెటబాలిజం. దీనినే జీవక్రియలు చురుగ్గా ఉండటం అంటారు. ఈ వేగం మన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మీద ఆధారపడి ఉంటుంది. మెటబాలిజాన్ని పరిగెత్తించ గలిగితే, శరీరంలో కొవ్వు పేరుకునే అవకాశాలు తగ్గుతాయి. కాబట్టి అందుకు ఉపయోగపడే అలవాట్లను అలవరుచుకోవాలి. అవేంటంటే....

కంటినిండా నిద్ర: మెటబాలిజం చురుగ్గా ఉండాలంటే కంటి నిండా నిద్ర తప్పనిసరి. కాబట్టి రోజుకు 8 గంటలకు తగ్గకుండా ప్రశాంతంగా నిద్రపోవాలి.

హై ఇంటెన్సిటీ వర్కవుట్స్: వ్యాయామం తర్వాత కూడా మెటబాలిజం వేగంతో పని చేయాలంటే హై ఇంటెన్సిటీ వర్కవుట్స్ చేయాలి. దీన్నే 'ఆఫ్టర్ బర్న్ వర్కవుట్' అంటారు.

వెయిట్ లిఫ్టింగ్: బరువులు ఎత్తడం వల్ల ఆరోగ్యకరమైన, సన్నటి కండర కణజాలం తయారవుతుంది. కాబట్టి నిద్రావస్థలో ఉన్న మెటబాలిజం మేల్కొనాలంటే బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి.

చురుకైన జీర్ణశక్తి: మెటబాలిజం పెరగాలంటే జీర్ణశక్తి మందగించే ఆహారానికి దూరంగా ఉండాలి. ఇలాంటి ఆహారం వల్ల శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్ పెరిగి మెటబాలిజం కుంటుపడుతుంది. కాబట్టి తేలికగా అరుగుతూ, స్వల్ప పరిమాణాల్లో గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేసే ఆహారానికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి.

హెల్త్ టిప్స్

- సబ్జాగింజలను డైలీ తీసుకోవడం వల్ల మలబద్ధకం, హైబీపీ, అధిక బరువు సమస్యలు తగ్గుతాయి. నీరసంగా ఉన్నప్పుడు సబ్జా గింజలు నానబెట్టిన నీళ్లు తాగడం వల్ల నీరసం తగ్గి యాక్టివ్‌గా ఉంటారు. ఈ గింజల్లో ఉన్న క్యాల్షియం, మ్యాంగనీస్, ఫాస్పరస్‌లు ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. క్రమం తప్పకుండా సబ్జాగింజలను నానపెట్టుకుని తాగితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.



- శరీరం మీద దద్దుర్లు దురదతో బాధిస్తుంటే..కొబ్బరినూనెలో కొద్దిగా అలోవెరా జెల్ వేసి పేస్టులా కలిపి దద్దుర్ల పైన రాస్తే ఉపశమనం లభిస్తుంది.



సినిమా

తైవాన్ టు సౌతాఫ్రికా


కమల్‌హాసన్

తైవాన్‌కు బై బై చెప్పాడు భారతీయుడు. 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, బాబీ సింహా, బెనెడిక్ట్ గారెట్, గుల్షన్ గ్రోవర్ కీ రోల్స్ చేస్తున్నారు. ఇటీవల తైవాన్‌లో మొదలైన 'ఇండియన్ 2' షెడ్యూల్ ముగిసింది. ఈ షూటింగ్ షెడ్యూల్‌లో కమల్‌హాసన్ పాల్గొనగా, కొన్ని కీలక సన్నివేశాలతో పాటు విదేశీ ఫైటర్స్‌తో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. తైవాన్ షెడ్యూల్ తర్వాత యూనిట్ సౌతాఫ్రికా వెళ్తుందని, అక్కడి లొకేషన్స్‌లో మరో యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేసిందనికి వినికిడి. ఈ చిత్రాన్ని సుభాస్కరన్, ఉదయనిధి స్టాలిన్ కలిసి నిర్మిస్తున్నారు.

పుష్ప.. జిందాబాద్


అల్లు అర్జున్

"తిరుపతి జైలు నుండి బుల్లెట్ గాయాలతో తప్పించుకున్న పుష్ప, ఆ ప్రయత్నంలో పోలీసులు పుష్పపై పది రౌండ్ల కాల్పులు జరపగా.. తను తీవ్రంగా గాయపడ్డాడని తెలుస్తోంది'' అనే డైలాగ్స్‌తో మొదలైంది 'పుష్ప: ది రూల్' సినిమా కాన్సెప్ట్ టీజర్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం తొలి పార్ట్ 'పుష్ప: ది రైజ్' ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం మలి భాగం 'పుష్ప: ది రూల్' సినిమా షూటింగ్ జరుగుతోంది. సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. కాగా నేడు అల్లు అర్జున్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుక్రవారం ఈ సినిమా కాన్సెప్ట్ టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'శేషాచలం అడవుల్లో పుష్ప జాడ కోసం మొదలవుతున్న కూంబింగ్ ఆపరేషన్', పుష్ప పోలీసుల కాల్పుల్లో మరణించాడన్న వదంతులు వ్యాపించడంతో చిత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగాయి, పుష్ప.. జిందాబాద్, పుష్ప అన్న బతికాడ్రాయ్యా, అడవిలో జంతువులు రెండడుగులు ఎనకేసినాయంటే పులొచ్చింది అని అర్థం. అదే పులే రెండడుగులు ఎనక్కేసిందంటే పుష్ప వచ్చిండాడని అర్థం'' అనే డైలాగ్స్ కాన్సెప్ట్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రంలోని గంగమ్మ జాతర బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఓ యాక్షన్ సీక్వెన్స్‌లోని అల్లు అర్జున్ లుక్‌ను ఫస్ట్ లుక్‌గా రిలీజ్ చేసినట్లు తెలుస్తోంది.

గగన పోరాటం


వరుణ్ తేజ్

దేశంలో జరిగిన వైమానిక దాడుల్లో మన సైనికులు ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు? ఎంతటి వీరోచితంగా పోరాడతారో వరుణ్ తేజ్ చూపించనున్నారు. దేశంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా భారతీయ వైమానిక దళ పైలెట్‌గా వరుణ్ తేజ్ హీరోగా ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సందీప్ ముద్దా నిర్మిస్తున్నారు. "ఇప్పటివరకు చూడని భీకర వైమానిక దాడుల్లో మన వీరుల పోరాటాన్ని ఈ చిత్రంలో చూపించనున్నాం. తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్న ఈ చిత్రం కోసం గ్వాలియర్‌లో షూటింగ్ చేశాం. అక్కడి షెడ్యూల్ పూర్తయింది'' అని చిత్రబృందం పేర్కొంది.

కనిపెట్టాలి.. కొట్టాలి!


రాఘవా లారెన్స్

"కూర్చున్న చోటే స్కెచ్ వేసి మనుషుల్ని లేపేసే వాడివి. నిన్నే వాడు బయటకు లాక్కొచ్చాడంటే వాడెంత తోపై ఉంటాడు'' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'రుద్రుడు' సినిమా ట్రైలర్. దర్శక-నిర్మాత, నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవా లారెన్స్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'రుద్రుడు'. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. ఫైవ్‌స్టార్ క్రియేషన్స్ ఎల్‌ఎల్‌పీ పతాకంపై స్వీయ దర్శకత్వంలో కదిరేశన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో నిర్మాత 'ఠాగూర్' మధు రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. 'ఒకడి జీవితంలో ఏవేవి జరగకూడదో అవన్నీ రుద్ర జీవితంలో జరిగాయి', 'మావ.. మన చుట్టూ పెద్దగా ఏదో జరుగుతోంది రా.. మనమే వెతకాలి. మనమే కనిపెట్టాలి. మనమే కొట్టాలి' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. "కుటుంబంతో సంతోషకరమైన జీవితాన్ని గడుపుతుంటాడు లారెన్స్. తనకి ఇష్టమైన అమ్మాయి ప్రియా భవానీ శంకర్‌ని పెళ్లి చేసుకుంటాడు. అయితే, శరత్‌కుమార్ అతని లైఫ్‌లోకి ఎంట్రీ ఇవ్వడంతో కష్టాలు మొదలవుతాయి. అయినప్పటికీ దృఢంగా నిలబడి, క్రిమినల్‌ని పట్టుకోవాలని నిర్ణయించుకుంటాడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం సాగుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది.


నయనతార
అఖిల్

పదేళ్ల తర్వాత...


జై

హీరో జై, హీరోయిన్ నయనతార పదేళ్ల తర్వాత స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. నయనతార ప్రధాన పాత్రలో నీలేష్ కృష్ణ దర్శకుడిగా పరిచయం అవుతూ ఓ సినిమా తెరకెక్కనుంది. ఇది నయనతార కెరీర్‌లో 75వ సినిమా కావడం విశేషం. కాగా ఈ సినిమాలో యాక్టర్ జై నటిస్తున్నట్లుగా చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. 2013లో అట్లీ దర్శకత్వంలో వచ్చిన 'రాజా రాణి' చిత్రం తర్వాత జై, నయనతార కలిసి మళ్లీ ఈ చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

ఏజెంట్ రెడీ

వేసవికి థియేటర్స్‌కు రానున్నాడు 'ఏజెంట్'. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న స్పై యాక్షన్ ఫిల్మ్ 'ఏజెంట్'. ఈ చిత్రంలో సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. మలయాళ నటుడు మమ్ముట్టి కీలక పాత్రధారి. అనిల్‌సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు అఖిల్ బర్త్ డే (ఏప్రిల్ 8). ఈ సందర్భంగా 'ఏజెంట్' కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసి, ముందుగా అనుకున్నట్లుగానే ఈ సినిమాను ఏప్రిల్ 28న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళ, సహనిర్మాతలు: అజయ్ సుంకర, దీపా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి.


జోగి నాయుడు, పోసాని కృష్ణమురళి, గౌతమ్ రెడ్డి, అలీ, సి. కల్యాణ్

అది చిన్న నిర్మాతలకు జగన్‌గారిచ్చిన వరం - సి. కల్యాణ్

ఏపీలో ప్రజల వద్దకే సినిమా

"సినిమా రిలీజైన రోజు ఇంట్లోనే ఫస్ట్ డే ఫస్ట్ షో చూసే అవకాశం ఏపీ ఫైబర్‌నెట్ కల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిగారి ఆలోచన మేరకు 'ప్రజల వద్దకు సినిమా'ను తీసుకు వస్తున్నాం'' అని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ– "భారతదేశంలో ఎక్కడా లేని విధంగా నెట్ సేవలను ఏపీలో తక్కువ ధరకు ఇస్తున్నాం. పెద్ద హీరోలకు, నిర్మాతలకు మేము వ్యతిరేకం కాదు. సినిమాను బేస్ చేసుకుని ఫిఫ్టీ-ఫిఫ్టీ రేషియో ఉంటుంది. ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ పల్లెటూర్లతో ఎక్కువ కనెక్ట్ అయింది. దీనివల్ల మారుమూల గ్రామాల్లో ఉన్నవారు కూడా రిలీజ్ రోజు సినిమా చూసే చాన్స్ లభిస్తుంది'' అన్నారు.

నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– "ఫైబర్‌నెట్‌లో సినిమా రిలీజ్ అనేది చిన్న నిర్మాతకు జగన్ గారిచ్చిన వరం. ఈ ప్లాట్‌ఫామ్ చిన్న నిర్మాతలకు, పేదల పాలిట పెన్నిధి. ఏపీ సీఎం జగన్‌గారి విజన్ చాలా పెద్దది. సినిమా ఇండస్ట్రీ అభివృద్ధి కోసం మంచి ఆలోచన చేశారు. చిన్న నిర్మాతలకు గొప్ప అవకాశం ఇచ్చినందుకు సినీ ఇండస్ట్రీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం'' అన్నారు. ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ, ఏపీ కల్చరల్ కమిటీ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ మాట్లాడారు.

నంది అవార్డు గురించి మాట్లాడితే తిట్టారు – పోసాని కృష్ణమురళి

ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ – "నేను రైటర్‌గా ఉన్నప్పుడే ఫలానా సినిమాలకు అవార్డులు ఇవ్వలేదని మాట్లాడాను. కొందరు నన్ను తిట్టారు. ఎన్టీఆర్ 'టెంపర్' సినిమాలోని నటనకుగాను నాకు నంది అవార్డు ఇచ్చారు. తప్పదు అని తప్పక ఇచ్చారు. అది నా కళ్లకు కమ్మ నందిలా కనిపించింది. ఆ నంది అవార్డు నాకు వద్దని చెప్పాను. ఎందుకంటే జ్యూరీలో 12మంది ఉంటే 11మంది కమ్మ వారే. ఇది తెలుగు సినిమా ఇండస్ట్రీ. ఇక్కడ కమ్మవారి డామినేషన్, కాపువాళ్ల డామినేషన్ అన్నట్లుగా మాట్లాడతారు. కానీ లేదు. డబ్బు డామినేషనే ఉంది. నంది అవార్డుల విషయమై ఓ సందర్భంలో జ్యూరీ చైర్మన్ అంబికా కృష్ణను అడిగితే 'వారికి వారే పంచేసుకున్నారు' అన్నారు. గతంలో నంది అవార్డులను ప్రకటించారు. ఎందుకు ఇవ్వలేదో కారణం లేదు. ఇప్పుడు వాటిని మా చేతుల మీదుగా ఇవ్వడం కష్టంగా ఉంది. అందుకని ఇవ్వని సీఎంగారితో కూర్చొని పాత నంది అవార్డులు ఇవ్వాలా, అదే సమయంలో సి. కల్యాణ్ వంటి పెద్దలతో కూర్చుని పాత అవార్డులు ఇవ్వాలా? కొత్త అవార్డులతో ముందుకు వెళ్లాలా? అనే కన్‌ఫ్యూజ్‌లో ఉన్నాం. అందుకు కొంచెం సమయం కావాలి'' అన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
8-4-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)		
సెన్సెక్స్‌	144 ▲	59,833
నిఫ్టీ	42 ▲	17,599

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్‌	12,088	▲ 91
డోజోన్స్‌	33,485	▲ 3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,742	▲ 79
డాక్స్‌	15,598	▲ 78
షాంఘై	3,328	▲ 15
నికాయ్‌	27,518	▲ 46

అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

ఐటీలో నియామకాలకు 6 నెలలు బ్రేక్‌

- హైరింగ్‌పై వేచి చూసే ధోరణిలో కంపెనీలు
- అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులే కారణం
- పరిశ్రమ వర్గాల అంచనా



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఐటీ కంపెనీలు నియామకాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఆరు నెలల పాటు హైరింగ్‌కు కాస్త విరామం ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాలను చూస్తే ప్రతి త్రైమాసికంలోనూ నికర నియామకాలు క్రమంగా తగ్గుతూ వచ్చాయని, రాబోయే రోజుల్లోనూ కొన్నాళ్ల పాటు ఇదే ధోరణి కొనసాగవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అంతక్రితం ఏడాది జోరుగా రిక్రూట్‌ చేసుకున్నప్పటికీ ప్రస్తుతం డిమాండ్‌ మాత్రమే కీలకాంశంగా మారిందని పేర్కొన్నాయి. మూడో త్రైమాసికంలోనే నియామకాలు తక్కువ స్థాయిలో ఉండగా.. నాలుగో త్రైమాసికంలోనూ దాదాపు అదే రకమైన ట్రెండ్‌ నెలకొందని టీమ్‌లీజ్‌ డిజిటల్‌ వర్గాలు వివరించాయి. చాలామటుకు కంపెనీలు వేచి చూసే ధోరణిలో ఉన్నాయని పేర్కొన్నాయి. ఎక్స్‌ఫెనో జాబ్‌ రిపోర్ట్‌ ప్రకారం మార్చి త్రైమాసికంలో ఉద్యోగావకాశాలు గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 56 శాతం క్షీణించాయి. మరికొద్ది రోజుల్లో కంపెనీలు నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించడం మొదలుపెట్టనున్న నేపథ్యంలో ఈ అంచనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

బ్యాంకింగ్‌ కష్టాలు.

అంతర్జాతీయంగా బ్యాంకింగ్‌ రంగంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులు కూడా ఐటీ రంగంలో నియామకాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఎక్కువగా బీఎఫ్‌ఎస్‌ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా) సంస్థలకు సేవలు అందించే దేశీ ఐటీ కంపెనీల్లో హైరింగ్‌ మందగించింది. ఈ పరిస్థితి నెమ్మదిగా మారనున్నప్పటికీ, కొత్త ఆర్థిక సంవత్సరం తొలి నాళ్లలో మాత్రం ఆ ప్రభావాలు అలాగే కొనసాగవచ్చని ఎక్స్‌ఫెనో సహవ్యవస్థాపకుడు అనిల్‌ ఎథనూర్‌ పేర్కొన్నారు. గత రెండు త్రైమాసికాలుగా హైరింగ్‌పై కాస్త సానుకూలంగా ఉన్నా, ఇంటర్వ్యూ చేసిన అభ్యర్థులను తీసుకునే విషయంలో మాత్రం కంపెనీలు ముందుకు వెళ్లడం లేదని టీమ్‌లీజ్‌ డిజిటల్‌ సీఈవో సునీల్‌ చెమ్మన్‌కొటిల్‌ తెలిపారు. ఆయా సంస్థలు వేచి, చూసే ధోరణి పాటిస్తున్నాయని, ఈ త్రైమాసికంలో నియామకాల పరిస్థితి ఆశావహంగా ఉండకపోవచ్చని పేర్కొన్నారు. తొలి ఆరు నెలల్లో నికరంగా నియామకాలు 40% తగ్గొచ్చని భావిస్తున్నట్లు వివరించారు. బ్యాంకింగ్‌ సంక్షోభం కారణంగా క్యూ4లో కంపెనీల ప్రణాళికలు మారిపోయాయని, హైరింగ్‌పై దాని ప్రభావం పడిందని కెరియర్‌నెట్‌ సీఈవో అన్షుమన్‌ దాస్‌ చెప్పారు. వాస్తవానికి అంతక్రితం త్రైమాసికంలో ఐటీ కంపెనీలు హైరింగ్‌ను ప్రారంభించడంపై సానుకూల యోచనల్లోనే ఉన్నప్పటికీ .. బ్యాంకింగ్‌ సంక్షోభంతో పెద్దగా రిక్రూట్‌మెంట్‌ తలపెట్టలేదని వివరించారు. ఈ నేపథ్యంలో తొలి ఆరు నెలలు హైరింగ్‌ అంత ఆశావహంగా కనిపించడం లేదన్నారు. పరిస్థితులపై ఇంకా స్పష్టత రానందున కంపెనీలు వేచి చూసే ధోరణే కొనసాగించవచ్చని.. ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధం కాస్త మెరుగ్గా ఉండవచ్చని దాస్‌ ఆశాభావం వ్యక్తం చేశారు.

2.5 లక్షలకు పరిమితం కావచ్చు..

దేశీ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్‌ టెక్నాలజీస్, టెక్‌ మహీంద్రా క్యూ1లో 59,704, క్యూ2లో 34,713 మందిని రిక్రూట్‌ చేసుకోగా క్యూ3లో ఇది ఏకంగా 4,904కి పడిపోయింది. 2022 ఆర్థిక సంవత్సరంలో ఐటీ, బీపీవో సర్వీసుల విభాగంలో నికరంగా 4.80 లక్షల నియామకాలు జరగ్గా, 2023 ఆర్థిక సంవత్సరంలో ఇది 2.80 లక్షల స్థాయిలో ఉండొచ్చని హాన్‌ డిజిటల్‌ సీఈవో శరణ్‌ బాలసుందరమ్‌ తెలిపారు. ప్రస్తుత ధోరణులను బట్టి చూస్తే 2024 ఆర్థిక సంవత్సరంలో నికర నియామకాలు సుమారు 2.5 లక్షల స్థాయిలో ఉండొచ్చని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొన్ని కంపెనీలు తాము ఇచ్చిన ఆఫర్లకు కట్టుబడి ఉండొచ్చని, మరికొన్ని వాటిని రద్దు చేసుకునే అవకాశం ఉందని బాలసుందరమ్‌ చెప్పారు. 2021 ఆర్థిక సంవత్సరంలో హైరింగ్‌ అంతగా జరగకపోవడం, కోవిడ్‌ పరిస్థితులపరమైన డిమాండు కారణంగా 2022 ఆర్థిక సంవత్సరంలో నియామకాలు భారీగా జరిగాయని ఆయన చెప్పారు. ఆ ఒక్క సంవత్సరాన్ని పక్కన పెడితే ఐటీలో ఏటా 2–3 లక్షల మంది హైరింగ్‌ సాధారణంగానే ఉంటుందని పేర్కొన్నారు.

మణిపాల్‌ హాస్పిటల్స్‌లో షియర్స్‌కు మెజారిటీ వాటా

సంస్థ విలువ రూ. 42,000 కోట్లు



న్యూఢిల్లీ: మణిపాల్‌ హాస్పిటల్స్‌లో మెజారిటీ వాటాలు దక్కించుకునే దిశగా షియర్స్‌ హెల్త్‌కేర్‌ ఇండియా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. హెల్త్‌కేర్‌ రంగంలో ఇదే అతిపెద్ద ప్రైవేట్‌ ఈక్విటీ డీల్‌ కాగలదని పరిశ్రమవర్గాలు తెలిపాయి. డీల్‌పై వచ్చే వారం అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని వివరించాయి. ఒప్పందం ప్రకారం మణిపాల్‌ హాస్పిటల్స్‌ విలువ సుమారు రూ.40,000 కోట్లు – రూ.42,000 కోట్లుగా మదింపు చేసినట్లు పేర్కొన్నాయి. ప్రమోటర్‌ కుటుంబం, ఇతర ఇన్వెస్టర్లయిన టీపీజీ, ఎన్‌ఐఐఎఫ్‌ నుంచి వాటాలు కొనుగోలు చేయడం ద్వారా తన వాటాను పెంచుకునేందుకు షియర్స్‌ ప్రయత్నాల్లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. మిగతా ఇన్వెస్టర్ల నుంచి 41 శాతం వాటాను కొనుగోలు చేయడం ద్వారా షియర్స్‌ తన మొత్తం వాటాను 59 శాతానికి పెంచుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వివరించాయి. మణిపాల్‌ గ్రూప్‌నకు 28 ఆస్పత్రులు, 8,000 పడకలు ఉన్నాయి.

సింగపూర్‌కు చెందిన ప్రైవేట్‌ ఈక్విటీ దిగ్గజం టెమాసెక్‌కు సంబంధించిన హెల్త్‌కేర్‌ డెలివరీ అసెట్లను షియర్స్‌ నిర్వహిస్తోంది. షియర్స్‌కు మణిపాల్‌ హాస్పిటల్స్‌లో ప్రస్తుతం 18 శాతం వాటాలు ఉన్నాయి. దానితో పాటు అమెరికన్‌ ప్రైవేట్‌ ఈక్విటీ సంస్థ టీపీజీకి 21%, భారత సార్వభౌమ వెల్త్‌ఫండ్‌ నేషనల్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ఫండ్‌ (ఎన్‌ఐఐఎఫ్‌)కు 8 శాతం వాటాలు ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన హాస్పిటల్‌ చెయిన్‌ మెడికా సినర్జీ, మెడాంటా హాస్పిటల్స్‌ ఆపరేటర్‌ గ్లోబల్‌ హెల్త్‌లోనూ షియర్స్‌ వాటాదారుగా ఉంది.

కొత్తగా 3 కోట్ల యూజర్ల లక్ష్యం

- త్వరలో రూ. 10 వేల లోపు 5జీ ఫోన్‌
- ఐటెల్‌ సీఈవో అరిజిత్‌ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: మొబైల్‌ ఫోన్ల తయారీ సంస్థ ఐటెల్‌ ఈ ఏడాది కొత్తగా దాదాపు 3 కోట్ల మంది యూజర్లను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఇది 9 కోట్లుగా ఉందని, దీన్ని సుమారు 12 కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఐటెల్‌ మాతృసంస్థ ట్రాన్షన్‌ ఇండియా సీఈవో అరిజిత్‌ తాలపత్ర తెలిపారు. తాజాగా అధిక సామర్థ్యాలు గల ఎ60, పీ40 స్మార్ట్‌ఫోన్లను ప్రవేశపెట్టడం, బ్రాండ్‌ అంబాసిడర్‌గా బాలీవుడ్‌ స్టార్‌ హృతిక్‌ రోషన్‌ను నియమించుకోవడం వంటి అంశాలు ఇందుకు దోహదపడగలవని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. వ్యాపార విస్తరణ క్రమంలో టీవీలు, ట్యాబ్లెట్లు వంటి విభాగాల్లోకి కూడా ప్రవేశించినట్లు వివరించారు. 5జీ సేవల విస్తరణ నేపథ్యంలో తాము కూడా ఈ ఏడాది మూడు లేదా నాలుగో త్రైమాసికం నాటికి 5జీ స్మార్ట్‌ఫోన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు అరిజిత్‌ చెప్పారు. దీని ధర రూ. 10 వేల లోపే ఉంటుందని పేర్కొన్నారు.

మేడిన్‌ ఇండియాపై మరింతగా దృష్టి.: ఫీచర్‌ ఫోన్లు, అందుబాటు ధరల్లో స్మార్ట్‌ ఫోన్లను అందించడంపైనా.. దేశీయంగా తయారీపైనా ప్రధానంగా దృష్టి పెడుతున్నామని అరిజిత్‌ చెప్పారు. దేశీయంగానే లభ్యమయ్యే పరికరాలు, విడిభాగాలను కొనుగోలు చేయడాన్ని పెంచుకుంటున్నట్లు వివరించారు. నోయిడాలో తమకు మూడు తయారీ ప్లాంట్లు ఉన్నాయని, వీటిలో దాదాపు 4,000 మంది సిబ్బంది పనిచేస్తున్నారని అరిజిత్‌ చెప్పారు. కోవిడ్‌పరమైన సవాళ్ల కారణంగా కొంతకాలం సెమీకండక్టర్ల కొరత నెలకొన్నప్పటికీ ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడిందన్నారు. ప్రస్తుతం రూ. 10 వేల లోపు ఫోన్ల సెగ్మెంట్లో తమకు 25 శాతం పైగా మార్కెట్‌ వాటా ఉందన్నారు. మొత్తం స్మార్ట్‌ఫోన్లకు సంబంధించి రూ. 8 వేల లోపు విభాగంలో తాము 12% వాటా దక్కించుకున్నామని అరిజిత్‌ చెప్పారు. తమ ఆదాయాల్లో దక్షిణాది మార్కెట్‌ వాటా 20% ఉంటుందని ఆయన చెప్పారు. ట్రాన్షన్‌ సంస్థ ఐటెల్, ఇన్ఫినిక్స్, టెక్నో బ్రాండ్ల పేరిట మొబైల్‌ ఫోన్లను విక్రయిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

8-4-2023	
విశాఖ	420–00
చిత్తూరు	428–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	395–00
విజయవాడ	395–00
రిటైల్‌ ధర (డజను)	66.00
7-4-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	370–00
వరంగల్‌	372–00
రిటైల్‌ ధర	4.30

రాందేవ్‌ బాబా సేవలు ప్రశంసనీయం: అమిత్‌ షా



హరిద్వార్‌: భారతీయ వేద విద్య, సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భావితరాలకు అందించేందుకు రాందేవ్‌ బాబా చేస్తున్న కృషి ప్రశంసనీయమని కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా కొనియాడారు. హరిద్వార్‌లోని యోగా గురు బాబా రాందేవ్‌ ఆధ్వర్యంలో చేపట్టిన 2వ సన్యాస్‌ దీక్షా మహోత్సవం సందర్భంగా ఆయన పతంజలి యూనివర్సిటీ కొత్త భవనాన్ని ప్రారంభించారు. ''గడిచిన పాతికేళ్లలో యోగ, ఆయుర్వేద, స్వదేశీ పరిశ్రమకు రాందేవ్‌ బాబా గణనీయమైన సేవలు అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో విద్యా రంగంపై దృష్టి సారించారు. రానున్న రోజుల్లో పతంజలి గ్రూప్‌ దేశాభివృద్ధికి ఎంతోగానూ తోడ్పడుతుంది'' అని అన్నారు. పతంజలి యూనివర్సిటీ, భారతీయ శిక్షా బోర్డు ద్వారా ప్రాచీన విద్యను నేటి తరానికి అందించి ఉత్తమ సమాజ స్థాపనకు తమ వంతు కృషి చేస్తామని రాందేవ్‌ బాబా తెలిపారు.

గ్యాస్‌ రేటుపై పరిమితులు



న్యూఢిల్లీ: కొత్త ధరల విధానం ప్రకారం ఏప్రిల్‌ నెలలో మిగతా కాలానికి (8 నుంచి 30వ తేదీ వరకు) సహజ వాయువు (గ్యాస్‌) రేటును యూనిట్‌కు రూ. 7.92గా కేంద్రం నిర్ణయించింది. అయితే, సాధారణ వినియోగదారులపై భారం పడకుండా రెండేళ్ల పాటు (2025 మార్చి 31 వరకు) నామినేషన్‌ క్షేత్రాల నుంచి ఓఎన్‌జీసీ, ఆయిల్‌ ఇండియా ఉత్పత్తి చేసే గ్యాస్‌కు మాత్రం 6.5 డాలర్ల రేటు మాత్రమే వర్తించేలా ఫార్ములాను సవరించింది. ప్రస్తుత ధరలతో పోలిస్తే ఈ రేట్లు దాదాపు పావు శాతం తక్కువ. దానికి అనుగుణంగా సీఎన్‌జీ, పైపుల ద్వారా సరఫరా చేసే గ్యాస్‌ ధర సుమారు 10 శాతం వరకు తగ్గనుంది. మరోవైపు, గ్యాస్‌ ధర విధానాన్ని సవరించడం ద్వారా సాధారణ వినియోగదారులతో పాటు రవాణా రంగానికి కూడా ఊరట లభించగలదని వాహనాల తయారీ సంస్థల సమాఖ్య సియామ్‌ ప్రెసిడెంట్‌ వినోద్‌ అగర్వాల్‌ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్‌



ఫైనల్లో తీర్థ శశాంక్‌ జోడీ

అంతర్జాతీయ టెన్నిస్‌ సమాఖ్య (ఐటీఎఫ్‌) పురుషుల టోర్నీ డబుల్స్‌ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన మాచర్ల తీర్థ శశాంక్‌–గంటా సాయికార్తీక్‌ రెడ్డి జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం చెన్నైలో జరిగిన సెమీఫైనల్లో తీర్థ శశాంక్‌–సాయికార్తీక్‌ రెడ్డి ద్వయం 4–6, 6–3, 10–4తో 'సూపర్‌ టైబ్రేక్‌'లో ఒర్లావ్‌ వ్లాదిస్లావ్‌ (ఉక్రెయిన్‌)–ప్యాట్రిక్‌ ఎడ్వర్డ్‌ (అమెరికా) జోడీపై విజయం సాధించింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తీర్థ శశాంక్‌–సాయికార్తీక్‌ రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్‌ చేశారు. నేడు జరిగే ఫైనల్లో విష్ణువర్ధన్‌–నితిన్‌ కుమార్‌ సిన్హా (భారత్‌)లతో తీర్థ శశాంక్‌–సాయికార్తీక్‌ తలపడతారు. రెండో సెమీఫైనల్లో విష్ణువర్ధన్‌–నితిన్‌ జోడీ 4–6, 6–3, 10–4తో టాప్‌ సీడ్‌ లొమాకిన్‌ (కజకిస్తాన్‌)–పెరెజ్‌ (స్పెయిన్‌) జంటను ఓడించింది.

సెమీస్‌లో ప్రియాన్షు



న్యూఢిల్లీ: ఓర్లియాన్స్‌ మాస్టర్స్‌ వరల్డ్‌ టూర్‌ సూపర్‌–300 బ్యాడ్మింటన్‌ టోర్నీలో పురుషుల సింగిల్స్‌ విభాగంలో భారత యువతార ప్రియాన్షు రజావత్‌ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం ఫ్రాన్స్‌లో జరిగిన క్వార్టర్‌ ఫైనల్లో ప్రపంచ 58వ ర్యాంకర్‌ ప్రియాన్షు 21–18, 21–18తో 61వ ర్యాంకర్‌ చియు జెన్‌ (చైనీస్‌ తైపీ)పై గెలుపొందాడు. తద్వారా తన కెరీర్‌లో తొలిసారి సూపర్‌–300 స్థాయి టోర్నీలో సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ల ప్రియాన్షు హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్‌ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ఎన్‌హట్‌ న్యూయెన్‌ (ఐర్లాండ్‌)తో ప్రియాన్షు తలపడతాడు.

బంగ్లాదేశ్‌ విజయం

ముష్ఫికర్‌ అజేయ అర్ధ సెంచరీ



మిర్పూర్‌: ఐర్లాండ్‌ జట్టుతో జరిగిన ఏకైక టెస్ట్‌ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఐర్లాండ్‌ నిర్దేశించిన 138 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్‌ 27.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించిన ముష్ఫికర్‌ రహీమ్‌ (48 బంతుల్లో 51 నాటౌట్; 7 ఫోర్లు) రెండో ఇన్నింగ్స్‌లో అజేయ అర్ధ సెంచరీ చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 177 పరుగులు చేసిన ముష్ఫికర్‌కు 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' అవార్డు లభించింది. ఓపెనర్లు తమీమ్‌ ఇక్బాల్‌ (31; 3 ఫోర్లు), లిటన్‌ దాస్‌ (23; 3 ఫోర్లు, 1 సిక్స్‌), మొమినుల్‌ హక్‌ (20 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్‌) రాణించారు. అంతకుముందు ఓవర్‌నైట్‌ స్కోరు 286/8తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌ కొనసాగించిన ఐర్లాండ్‌ మరో ఆరు పరుగులు జోడించి మిగతా రెండు వికెట్లు కోల్పోయి 292 పరుగులవద్ద ఆలౌటైంది. బంగ్లాదేశ్‌ బౌలర్లలో తైజుల్‌ ఇస్లామ్‌ నాలుగు, ఇబాదత్‌ హుస్సేన్‌ మూడు వికెట్లు పడగొట్టారు. 2017లో టెస్టు హోదా పొందిన ఐర్లాండ్‌ ఇప్పటి వరకు నాలుగు టెస్టులు ఆడి నాలుగింటిలోనూ ఓడిపోయింది.

సన్‌'రైజ్‌' కాలేదు!



- హైదరాబాద్‌కు రెండో ఓటమి
- 5 వికెట్లతో లక్నో విజయం
- కృనాల్‌ పాండ్యా ఆల్‌రౌండ్‌ ప్రదర్శన



లక్నో: సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌కు ఐపీఎల్‌ సీజన్‌లో రెండో మ్యాచ్‌ కూడా కలిసి రాలేదు. సొంతగడ్డపై మొదటి మ్యాచ్‌లో ఓడిన జట్టు ఇప్పుడు సమష్టి వైఫల్యంతో ప్రత్యర్థి వేదికపై పరాజయాన్ని మూటగట్టుకుంది. శుక్రవారం జరిగిన పోరులో లక్నో సూపర్‌ జెయింట్స్‌ 5 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. టాస్‌ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రైజర్స్‌ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. రాహుల్‌ త్రిపాఠి (41 బంతుల్లో 34; 4 ఫోర్లు), అన్‌మోల్‌ప్రీత్‌ సింగ్‌ (26 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్‌) రాణించారు. అనంతరం లక్నో 16 ఓవర్లలో 5 వికెట్లకు 127 పరుగులు చేసింది. కేఎల్‌ రాహుల్‌ (31 బంతుల్లో 35; 4 ఫోర్లు), 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' కృనాల్‌ పాండ్యా (23 బంతుల్లో 34; 4 ఫోర్లు, 1 సిక్స్‌) జట్టును గెలిపించారు.

బ్యాటింగ్‌ వైఫల్యం...

ఆటగాళ్లు మారినా, సన్‌రైజర్స్‌ ఆట మారలేదు. మొదటి మ్యాచ్‌ ఓటమి నుంచి ఆ జట్టు పాఠాలు నేర్చుకున్నట్లుగా లేదు. దాదాపు అదే తరహాలో పేలవ బ్యాటింగ్‌తో మరోసారి టీమ్‌ సాధారణ స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్‌ మయాంక్‌ అగర్వాల్‌ (8) మళ్లీ విఫలం కాగా, అన్‌మోల్‌ కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 43 పరుగులకు చేరింది. అయితే కృనాల్‌ వేసిన ఇన్నింగ్స్‌ ఎనిమిదో ఓవర్‌ రైజర్స్‌ను దెబ్బ తీసింది. అన్‌మోల్‌ను ఎల్బీగా అవుట్‌ చేసిన కృనాల్‌ తర్వాతి బంతికి కెప్టెన్‌ మార్క్‌రమ్‌ (0)ను వెనక్కి పంపాడు. హైదరాబాద్‌ టీమ్‌కు సారథిగా బరిలోకి దిగిన మొదటి మ్యాచ్‌లో మార్క్‌రమ్‌ తొలి బంతికే వెనుదిరగాల్సి వచ్చింది. హ్యారీ బ్రూక్‌ (3) కూడా ప్రభావం చూపలేకపోవడంతో స్కోరు 55/4కు చేరింది. ఈ దశలో త్రిపాఠి, వాషింగ్టన్‌ సుందర్‌ (16) కలిసి కొద్దిసేపు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే లక్నో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పరుగులు రావడం కష్టంగా మారిపోవడంతో బంతులు వృథా అయ్యాయి. వీరిద్దరు ఐదో వికెట్‌కు 39 పరుగులు జత చేసినా... ఏకంగా 50 బంతులు తీసుకొని మూడే ఫోర్లు కొట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయిన సన్‌ టీమ్‌ అతి కష్టమ్మీద వంద పరుగులు దాటగలిగింది. చివర్లో అబ్దుల్‌ సమద్‌ (10 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) వేగంగా పరుగులు జోడించగలిగాడు.

కీలక భాగస్వామ్యం...

ఛేదనలో ఆరంభంలో లక్నో కొంత తడబడింది. పవర్‌ప్లేలో 45 పరుగులు చేసిన ఆ జట్టు మేయర్స్‌ (13), దీపక్‌ హుడా (7) వికెట్లు కోల్పోయింది. అయితే రాహుల్, కృనాల్‌ భాగస్వామ్యం టీమ్‌ను విజయానికి చేరువ చేసింది. వీరిద్దరు ప్రశాంతంగా ఆడుతూ పరుగులు రాబట్టారు. ఈ ద్వయం మూడో వికెట్‌కు 38 బంతుల్లో 55 పరుగులు జోడించారు. వీరిద్దరితో పాటు షెఫర్డ్‌ (0)ను తక్కువ వ్యవధిలో సన్‌రైజర్స్‌ వెనక్కి పంపగలిగినా... అప్పటికే జెయింట్స్‌ విజయం దాదాపు ఖాయమైంది.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ ఇన్నింగ్స్‌: అన్‌మోల్‌ప్రీత్‌ (ఎల్బీ) (బి) కృనాల్‌ 31; మయాంక్‌ (సి) స్టొయినిస్‌ (బి) కృనాల్‌ 8; త్రిపాఠి (సి) మిశ్రా (బి) యశ్‌ 34; మార్క్‌రమ్‌ (బి) కృనాల్‌ 0; బ్రూక్‌ (స్టంప్డ్‌) పూరన్‌ (బి) బిష్ణోయ్‌ 3; సుందర్‌ (సి) హుడా (బి) మిశ్రా 16; సమద్‌ (నాటౌట్‌) 21; రషీద్‌ (సి) హుడా (బి) మిశ్రా 4; ఉమ్రాన్‌ (రనౌట్‌) 0; భువనేశ్వర్‌ (నాటౌట్‌) 0; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 121. వికెట్ల పతనం: 1–21, 2–50, 3–50, 4–55, 5–94, 6–104, 7–108, 8–109. బౌలింగ్‌: మేయర్స్‌ 1–0–5–0, ఉనాద్కట్‌ 3–0–26–0, కృనాల్‌ 4–0–18–3, యష్‌ 3–0–23–1, బిష్ణోయ్‌ 4–0–16–1, హుడా 1–0–8–0, అమిత్‌ మిశ్రా 4–0–23–2.

లక్నో సూపర్‌ జెయింట్స్‌ ఇన్నింగ్స్‌: మేయర్స్‌ (సి) మయాంక్‌ (బి) ఫజల్‌ 13; రాహుల్‌ (ఎల్బీ) (బి) రషీద్‌ 35; హుడా (సి అండ్‌ బి) భువనేశ్వర్‌ 7; కృనాల్‌ (సి) అన్‌మోల్‌ప్రీత్‌ (బి) ఉమ్రాన్‌ 34; స్టొయినిస్‌ (నాటౌట్‌) 10; షెఫర్డ్‌ (ఎల్బీ) (బి) రషీద్‌ 0; పూరన్‌ (నాటౌట్‌) 11; ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (16 ఓవర్లలో 5 వికెట్లకు) 127. వికెట్ల పతనం: 1–35, 2–45, 3–100, 4–114, 5–114. బౌలింగ్‌: భువనేశ్వర్‌ 2–0–19–1, సుందర్‌ 1–0–11–0, ఫజల్‌ 3–0–13–1, మార్క్‌రమ్‌ 2–0–14–0, రషీద్‌ 3–0–23–2, నటరాజన్‌ 3–0–23–0, ఉమ్రాన్‌ 2–0–22–1.

ఐపీఎల్‌ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
లక్నో	3	2	1	4	1.358
గుజరాత్‌	2	2	0	4	0.700
పంజాబ్‌	2	2	0	4	0.333
కోల్‌కతా	2	1	1	2	2.056
రాజస్తాన్‌	2	1	1	2	1.675
చెన్నై	2	1	1	2	0.036
బెంగళూరు	2	1	1	2	-1.256
ఢిల్లీ	2	0	2	0	-1.703
ముంబై	1	0	1	0	-1.981
హైదరాబాద్‌	2	0	2	0	-2.867

నోట్‌: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్‌ రన్‌రేట్‌

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్‌ × ఢిల్లీ (మ. గం. 3:30 నుంచి)
ముంబై × చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్‌ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ధోని 'సిక్సర్‌'కు శాశ్వత కీర్తి!





ముంబై: 'ధోని ఫినిషెస్‌ ఆఫ్‌ ఇన్‌ స్టయిల్‌... మాగ్నిఫిసెంట్‌ స్ట్రయిక్‌ ఇన్‌ టూ ద క్రౌడ్‌. ఇండియా లిఫ్ట్‌ ద వరల్డ్‌ కప్‌ ఆఫ్టర్‌ 28 ఇయర్స్‌'... రవిశాస్త్రి చేసిన ఈ వ్యాఖ్యానం పుష్కర కాలం తర్వాత కూడా అభిమానుల చెవుల్లో మారుమోగుతూనే ఉంది. ముంబైలో ఏప్రిల్‌ 2, 2011న జరిగిన వన్డే వరల్డ్‌ కప్‌ ఫైనల్లో కులశేఖర బౌలింగ్‌లో ధోని లాంగాన్‌ మీదుగా సిక్సర్‌ కొట్టి విజయం ఖాయం చేసిన క్షణం భారతీయుల హృదయాల్లో నిలిచిపోయింది. అతను కొట్టిన షాట్‌కు బంతి వాంఖెడే స్టేడియంలో 'జె' స్టాండ్‌లో పడింది. ఈ ఘనతను చిరస్మరణీయం చేయాలని ముంబై క్రికెట్‌ అసోసియేషన్‌ (ఎంసీఏ) భావించింది. అందుకే ఆ బంతి పడిన స్థానంలో ఒక స్మారకాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందు కోసం 'జె' స్టాండ్‌లోని 282–286 నంబర్ల ఐదు సీట్లను తొలగించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లకు శ్రీకారం చుట్టేలా శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ధోని రిబ్బన్‌ కట్‌ చేశాడు. ఈ సందర్భంగా ధోనిని సన్మానించి ఎంసీఏ అతడికి జ్ఞాపికను అందజేసింది. గతంలో ఆక్లాండ్‌లో జరిగిన 2015 వరల్డ్‌ కప్‌ సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై గెలిచినప్పుడు న్యూజిలాండ్‌ బ్యాటర్‌ గ్రాంట్‌ ఇలియట్‌ కొట్టిన సిక్సర్‌ పడిన సీట్‌ను ప్రత్యేకంగా కనిపించేలా ఆకుపచ్చ రంగు వేసి దానిని 'ఇలియట్‌ సీట్‌'గా పేరు పెట్టి కివీస్‌ బోర్డు గౌరవించింది.

రెండో రౌండ్‌కు భారత్‌

ఒలింపిక్‌ ఆసియా మహిళల ఫుట్‌బాల్‌ క్వాలిఫయింగ్‌ టోర్నీ



బిష్కెక్‌: పారిస్‌ ఒలింపిక్స్‌ మహిళల ఆసియా ఫుట్‌బాల్‌ క్వాలిఫయింగ్‌ టోర్నీలో భారత జట్టు రెండో రౌండ్‌ దశ మ్యాచ్‌లకు అర్హత సాధించింది. గ్రూప్‌ 'జె'లో భాగంగా కిర్గిజ్‌ రిపబ్లిక్‌తో శుక్రవారం జరిగిన రెండో లీగ్‌ మ్యాచ్‌లో భారత్‌ 4–0తో నెగ్గింది. భారత్‌ తరఫున సంధ్య రంగనాథన్‌ (18వ ని.లో, 56వ ని.లో) రెండు గోల్స్‌ చేయగా, అంజూ (24వ ని.లో), రేణు (85వ ని.లో) ఒక్కో గోల్‌ సాధించారు. భారత్‌ గ్రూప్‌ 'జె' టాపర్‌గా నిలిచి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. మొత్తం 12 జట్ల మధ్య అక్టోబర్‌లో రెండో రౌండ్‌ జరుగుతుంది.

టాప్లే స్థానంలో పార్నెల్‌



ముంబై: ఐపీఎల్‌ టోర్నీ తాజా సీజన్‌లో రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టులో ఇద్దరు కొత్త ఆటగాళ్లు చేరనున్నారు. గాయాల కారణంగా ఆర్‌సీబీ క్రికెటర్లు రీస్‌ టాప్లే (ఇంగ్లండ్‌), రజత్‌ పటిదార్‌ (భారత్‌) ఈ టోర్నీ నుంచి వైదొలిగారు. టాప్లే స్థానంలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్‌ వేన్‌ పార్నెల్‌... రజత్‌ పటిదార్‌ స్థానంలో వైశాఖ్‌ విజయ్‌ కుమార్‌ (కర్ణాటక)లను ఆర్‌సీబీ జట్టు కొనుగోలు చేసింది. పార్నెల్‌కు రూ. 75 లక్షలు... విజయ్‌కు రూ. 20 లక్షలు చెల్లించనున్నారు. 33 ఏళ్ల పార్నెల్‌ దక్షిణాఫ్రికా తరఫున 56 టి20 మ్యాచ్‌లు, ఆరు టెస్టులు, 73 వన్డేలు ఆడాడు. టి20ల్లో 59 వికెట్లు తీశాడు. పార్నెల్‌ గతంలో 2011 నుంచి 2014 వరకు వరుసగా నాలుగేళ్లు ఐపీఎల్‌ టోర్నీలో బరిలోకి దిగాడు. ఢిల్లీ, పుణే వారియర్స్, ఆర్‌సీబీ జట్లకు ప్రాతినిధ్యం వహించిన అతను మొత్తం 26 మ్యాచ్‌లు ఆడి 26 వికెట్లు పడగొట్టాడు. విజయ్‌ దేశవాళీ టి20 క్రికెట్‌లో 14 మ్యాచ్‌లు ఆడి 22 వికెట్లు తీసుకున్నాడు.

క్లుప్తంగా...

నిట్‌కు వసంతోత్సవ 'కళా'ధ్వని

సందడి చేసిన విద్యార్థులు



పాటరీ మేకింగ్‌లో కుమ్మరి సారెపై మట్టి దివ్వెను తయారు చేస్తున్న విద్యార్థి

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్న 3 రోజుల వసంతోత్సవాల్లో భాగంగా స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని శుక్రవారం ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి పది వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. 55కు పైగా ఈవెంట్స్, ప్రో షోలు, కొరియోనైట్స్ నిర్వహించారు. తొలిరోజు విద్యార్థులు ప్రదర్శించిన నుక్కడ్‌నాటకం, పాటరీ మేకింగ్, కరవోకే, క్యాసెట్ పెయింటింగ్, వార్ ఆఫ్ డీజెస్, యాంకర్ సుమ, హీరో కార్తికేయ బెదురులంక టీం చిట్‌చాట్‌లతో అలరించింది. కొరియో నైట్‌లో బాలీవుడ్ సింగర్ అదర్ తన గానామృతంతో అలరించాడు.

వాకపల్లి దోషులను శిక్షించాలి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని జి.మాడుగుల మండలం వాకపల్లి గ్రామంలో ఆదివాసీలపై దాడి, మహిళలపై అత్యాచారం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులను శిక్షించాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.జ్యోతి, కో–కన్వీనర్ రాధా శ్రీదేవి డిమాండ్ చేశారు. 2007 ఆగస్టు 20న 21 మంది గ్రేహౌండ్స్ పోలీసులు ఆదివాసీ గ్రామంపై దాడి చేశారని, బాలింత సహా పలువురు మహిళలపై సామూహిక అత్యాచారం చేశారని గుర్తు చేశారు. కేసులో 16 ఏళ్ల పోరాటం తర్వాత కూడా ఆధారాలు లభించనందున పోలీసుల ను విడిచి పెడుతున్నట్టు కోర్టు ఇచ్చిన తీర్పును తాము ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు.

'10న కలెక్టరేట్‌ల ముందు నిరసన'

సాక్షి, హైదరాబాద్: పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న అన్ని జిల్లా కలెక్టరేట్ ల కార్యాలయాల ముందు నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సుభాకర్‌రావు తెలిపారు.



గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని మియాపూర్ కల్వరి టెంపుల్‌లో శుక్రవారం ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ సతీష్‌కుమార్ ఏసుప్రభు ప్రేమ, త్యాగం, కనికరం, దయ, క్షమాపణ గురించి వివరించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

పిల్లలు, మహిళలపై రక్తహీనత పంజా

రాష్ట్రంలో మహిళల్లో 57.6 శాతం, పిల్లల్లో 70 శాతం మంది బాధితులు

- 53.2 శాతం మంది గర్భిణుల్లో రక్తహీనత
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నివేదిక వెల్లడి
- రక్తహీనత 40 శాతం కంటే ఎక్కువ ఉంటే తీవ్రమైన ప్రజారోగ్య సమస్యే



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మహిళలు, పిల్లలను రక్తహీనత పట్టి పీడిస్తోంది. తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా పరిణమించింది. 15–49 ఏళ్ల మధ్య వయసు గల మహిళల్లో 57.6 శాతం, ఐదేళ్ల లోపు పిల్లల్లో 70 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ మేరకు తాజాగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన నివేదికలో పలు వివరాలు పేర్కొంది. పిల్లల రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి 11 హెచ్‌బీ కంటే తక్కువగా ఉంటే రక్తహీనత కలిగినవారిగా వర్గీకరించారు. అంతకు ముందు ఐదేళ్లతో పోల్చినప్పుడు మహిళల్లో రక్తహీనత ఒక శాతం పెరిగింది. 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు మహిళల రక్తహీనతలో తెలంగాణ 16వ స్థానంలో నిలిచింది. దేశంలో అత్యధికంగా లడక్‌లో 92.8 శాతం మంది, అత్యంత తక్కువగా లక్షద్వీప్‌లో 25.8 శాతం మంది రక్తహీనత బాధితులున్నారు. ఇదే వయసు గల గర్భిణుల్లో 53.2 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని నివేదిక తెలిపింది. గర్భిణుల రక్తహీనతలో తెలంగాణ 13వ స్థానంలో నిలిచింది. అంతకుముందు ఐదేళ్లలో గర్భిణుల్లో 48.2 శాతం మంది రక్తహీనత బాధితులు ఉండగా, ఆ తర్వాత ఐదు శాతం పెరిగింది. ఇక 15–19 ఏళ్ల వయస్సుగల బాలికల్లోనూ రక్తహీనత శాతం 64.7 శాతముంది. అంతకుముందు ఐదేళ్లలో అది 59.7 శాతమే. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం రక్తహీనత 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ ఉంటే తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా పరిగణించాలి.

పిల్లల్లో అత్యధికం లడాక్.. అత్యల్పం కేరళ

రాష్ట్రంలో ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు వయసు గల 70 శాతం మంది పిల్లలు రక్తహీనత బారినపడ్డారు. 2019–21 మధ్య దేశంలో ఆ వయస్సు పిల్లల్లో అత్యధికంగా లడక్‌లో 92.5 శాతం మంది, గుజరాత్‌లో 79.7 శాతం మంది రక్తహీనతకు గురయ్యారు. పిల్లల్లో రక్తహీనత తక్కువగా ఉన్న రాష్ట్రాలు కేరళ (39.4 శాతం), అండమాన్‌- నికోబార్ దీవులు(40 శాతం), నాగాలాండ్ (42.7 శాతం) మణిపూర్ (42.8 శాతం) ఉన్నాయి. రక్తహీనత బారిన పడిన పిల్లల విషయంలో తెలంగాణ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఐదేళ్లలోపు పిల్లల్లో జాతీయ సగటు 67.1 శాతం కంటే రాష్ట్రంలో ఎక్కువగా రక్తహీనత బాధితులు ఉన్నారని పేర్కొంది. 2015–16 సంవత్సరంతో పోలిస్తే, 2019–21 మధ్య 9.3 శాతం మేర రక్తహీనత బాధితులు తెలంగాణలో పెరిగారని వెల్లడించింది.

ఇవీ కారణాలు..

తల్లి విద్యాస్థాయి, వయస్సు, తల్లిపాలు ఇచ్చే వ్యవధి తదితర కారణాలు పిల్లల్లో రక్తహీనతపై ప్రభావం చూపిస్తాయి. ఇనుము లోపం రక్తహీనతకు అత్యంత సాధారణ కారణం. పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనత ఏర్పడుతుందని వైద్య నిపుణులు అంటున్నారు. డయేరియా, మలేరియా, ఇతర ఇన్ఫెక్షన్లు, వ్యాధులు రక్తహీనత ప్రమాదాన్ని పెంచుతాయి. వివిధ సామాజిక–ఆర్థిక, సాంస్కృతిక, విశ్వాసాల కారణంగా ఏర్పడే ఆహారపు అలవాట్లు కూడా రక్తహీనతకు కారణమవుతున్నాయి. రక్తహీనత సమస్యను అధిగమించాలంటే పుట్టిన తర్వాత మొదటి వెయ్యి రోజుల్లో తీసుకునే చర్యలు కీలకమైనవని డాక్టర్ కిరణ్ మాదల విశ్లేషించారు.

24 గంటలూ షాపులు తెరవొచ్చు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వ్యాపారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని అన్ని దుకాణాలు, వ్యాపార సముదాయాలు 24 గంటలపాటు తెరిచి ఉంచేందుకు అనుమతించింది. ఈ మేరకు కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని జీవో జారీ చేశారు. తదనుగుణంగా తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1988కు సవరణలు చేసినట్టు తెలిపారు. 24 గంటలపాటు దుకాణం తెరిచి ఉంచేందుకు గాను ప్రభుత్వానికి సంవత్సరానికి రూ.10,000 వార్షిక రుసుము చెల్లించాల్సి ఉంటుందని నిబంధనలో పేర్కొన్నారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. అయితే ఈ జీవో అమలులో ఈ కింది పది నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
ఐడీ కార్డులు జారీ చేయాలి.. వారాంతపు సెలవు ఇవ్వాలి
వారంలో కచ్చితమైన పనిగంటలు ఉండాలి
ఓవర్ టైమ్‌కు వేతనం చెల్లించాలి
పండుగలు, సెలవు దినాల్లో పని చేసినవారికి
కాంపన్సేటరీ సెలవు ఇవ్వాలి
మహిళా ఉద్యోగులకు తగిన వేతనం
రాత్రి షిఫ్ట్‌లో పనిచేసే మహిళా ఉద్యోగుల అంగీకారం
తీసుకోవాలి.. రవాణా సదుపాయం కల్పించాలి
రికార్డులను సరిగా మెయింటెన్ చేయాలి
పోలీస్‌యాక్ట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

బీసీ బిల్లుపై ప్రధాని విధాన ప్రకటన చేయాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న కృష్ణయ్య, ఇతర నేతలు

కాచిగూడ: పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు నేడు నగరానికి వస్తున్న ప్రధాని... బీసీ బిల్లుపై విధాన ప్రకటన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీలకు మద్దతు ఇవ్వని పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు. కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. ''పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. రాష్ట్రంలో, కేంద్రంలో బీసీల విద్య, ఉద్యోగ, రిజర్వేషన్లను 27 శాతం నుంచి 56కు పెంచాలి. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి. జనగణనలో కులగణన చేపట్టాలి. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలోనూ రిజర్వేషన్ కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలి. బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బీసీ యాక్ట్‌ను తీసుకురావాలి. బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.2లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలి. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి''అని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

బమ్మెరలో అరుదైన జైన్ శిల్పాలు

చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి





ఆల్వారు స్వామి శిల్పం, బమ్మెరలో భైరవి శిల్పాన్ని పరిశీలిస్తున్న రత్నాకర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో అరుదైన జైన యక్షిణి, భైరవి శిల్పాలను గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో పర్యటించి ఆయన తెలుసుకున్న శిలాయుగం సంస్కృతి, బౌద్ధ, జైన చారిత్రక ఆధారాలను శుక్రవారం వివరించారు. 5 వేల సంవత్సరాల క్రితం ఆదిమానవులు జీవించిన ఆనవాళ్లు బమ్మెరలో లభించాయన్నారు. చెరువు మత్తడి పైభాగంలో విశాలమైన పరుపుబండపై అనేక సంఖ్యలో గ్రూప్స్ ఉన్నాయని తెలిపారు. ముడి శిలలను పగుల గొట్టి చేతిలో ఇమిడేంత పరిమాణంలోకి తెచ్చి, రాతి పనిముట్లుగా ఉపయోగించారని వెల్లడించారు. చెరువు మత్తడి పరుపు బండపై బలపం రాయికి చెందిన భైరవ, జైన యక్షిణి శిల్పాలు పక్కపక్కనే ఉన్నాయని వివరించారు. స్మారక మందిరాన్ని ఆనుకొని ప్రాచీన వైష్ణవ ఆలయం, దానికి ఎనిమిది అడుగుల ఎత్తయిన ద్వారం, సీతా రామచంద్రుల పాదాల బండ, ఆళ్వారు విగ్రహం ఆధారాలను బట్టి పోతన కాలం నాటికే శివాలయం, రామాలయం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఇక్కడే కత్తులు లేదా నాగలికి అమర్చే కర్రులు చెక్కిన రాతి పలకలు కనిపించాయని చెప్పారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.